ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక

సంపుటి 5 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org

అనురాగ లోగిలి అమ్మానాన్నల సన్నిధి



సంపాదక మండలి

వ్యవస్థాపక సంపాదకులు
మహాకవి గురజాడ అప్పారావు

ప్రధాన సంపాదకులు
ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ(USA)

నిర్వాహక సంపాదకులు
శ్రీమతి అరుణ గురజాడ (USA)
శ్రీ గురజాడ రవీంద్రుడు *(విశాఖపట్టణం)*

విద్యాసంబంధిత ప్రచురణ విభాగ సంపాదకులు

కార్యనిర్వాహక సంపాదకులు
ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
(హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్)

సంపాదక సలహాదారులు

ఆచార్య, సూర్యా ధనంజయ్
(ఉపకులపతి, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం, హైదరాబాదు)

ఆచార్య చల్లా శ్రీరామచంద్రమూర్తి
(అధ్యక్షులు, తెలుగుశాఖ, బెనారస్ హిందూ యూనివర్శిటీ, వారణాసి)

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్
(సంచాలకులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం, నెల్లూరు)

డా. వి.ఆర్. రాసాని
(విశ్రాంత ఆచార్యులు, తిరుపతి)

సంపాదకులు

ఆచార్య నల్లపరెడ్డి ఈశ్వర రెడ్డి
(యోగి వేమన విశ్వ విద్యాలయం, కడప)

ఆచార్య రాచగాల్ల రాజేశ్వరమ్మ
(శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి)

ఆచార్య జొన్నలగడ్డ వెంకటరమణ
(మదురై విశ్వవిద్యాలయం, మదురై)

సహ సంపాదకులు

డా. నందవరం మృదుల, *(సహ ఆచార్యులు & తెలుగు విభాగాధిపతి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్) బేగంపేట, హైదరాబాద్)*

డా. వి. వింధ్యవాసినీ దేవి, *తెలుగు ఉపన్యాసకులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (పురుషులు) క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు*

కథలు, కవితలు, వ్యాసాల విభాగం

సంపాదకులు
డా. ఎస్. రఘు, *(సహాయ ఆచార్యులు, ఉస్మానియా విశ్వ విద్యాలయం, హైదరాబాదు)*

ISSN 2766-0168 | అంతర్జాల త్రైమాస పత్రిక | www.prakasika.org | editor@prakasika.org

విద్యనివ్వని చదువు....

వేసవి కాలం ఉక్కపోత, తాపంతో విద్యార్థులకి పరీక్షలు, ఫలితాల కాలం. చదువుకి అధిక ప్రాముఖ్యాన్నిచ్చే సమాజంలో, ముఖ్యంగా మధ్య తరగతి తెలుగు కుటుంబాలలో, చదువుతో వచ్చే పట్టాలకి ఇచ్చే ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. తల్లిదండ్రుల వారిపై ఉంచే అంచనాల వల్ల పెరిగే ఉక్కపోత వేసవి ఉక్కపోత కంటే ఎక్కువగా ఉక్కిరిబిక్కిరి చేస్తుందన్నది అందరం గమనించే విషయమే.

చదువు, విద్య అన్న పదాలను సమానార్థకంగా వాడుతున్నా, వాటి అంతరార్థం వేరు. కొన్ని విషయాలను నేర్చుకుని పరీక్షల్లో ఉత్తర్ణత పొంది ఒక పట్టా పొందే అవకాశం ఇచ్చే ప్రక్రియని "చదువు" అని అంటున్నాం. మరి విద్య అంటే ?

కొంతమంది పాశ్చాత్య, భారతీయ తత్త్వవేత్తలు ఇచ్చిన నిర్వచనం 'విద్య' చదువుకి ఎంత దూరంగా ఉందో అవగతం అవుతుంది. "అజ్ఞానాన్ని తరిమివేసే సత్యాన్వేషణే విద్య" అంటాడు సోక్రటీస్; "ఆరోగ్యవంతమైన శరీరంలో ఆరోగ్యవంతమైన మనసును సృష్టించడమే విద్య అని నిర్వచించాడు అరిస్టాటిల్"; మానవుడి బుద్ధి దేని ద్వారా వికసిస్తుందో, మనశ్శాంతి పెంపొందుతుందో, శీలం ఏర్పడుతుందో, మానవుడు దేని ద్వారా స్వశక్తితో నిల్చుంటాడో అదే విద్య" అని స్వామి వివేకానంద ఉద్ఘాటించారు. ఇలా ఎంతో మంది "విద్య" నీ manifistation of virtues through learning అని సూత్రీకరించారు.

ప్రస్తుత కాలంలో, కొలువుల కోసం కనీస అర్హతనిచ్చే పట్టాలు పొందడమే పరమావధిగా చదువుల ప్రహసనం సాగుతోంది. చదివే సబ్జెక్టుకి

చేసే ఉద్యోగానికీ పొంతన లేని సందర్భాలు చాలా చూస్తాం. ఏ సబ్జెక్టు లో డిగ్రీ పొందినా సాఫ్టవేర్ ఉద్యోగం సంపాదించడం కోసం యువత పడే పాట్లు ఆధునిక భారత సమాజంలో చూస్తున్నాం. అమెరికాలో ఆర్థిక మాంద్యం అని పుకార్లు వస్తె చాలు అబ్బాయికి వణుకు, అయ్యకి గుండె నెప్పి. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొని నిలబడగలమనే ఆత్మ నిబ్బరం కలిగించే "విద్యనివ్వని చదువులు" జీవితం లో ఒత్తిడికారకం అవుతున్నాయన్నమాట.

చదువు జ్ఞానాన్ని ఇవ్వాలి. కానీ ప్రభుత్వ నియంత్రణలో నడిచే ప్రస్తుత విద్యా వ్యవస్థలో జ్ఞానం ఇచ్చే చదువులు అరుదు. ప్రస్తుత చదువులు సమాచారాన్ని మాత్రమే అందిస్తున్నాయి. బతుకు తెరువు నేర్పే విద్యలు కళాశాలలో, విశ్వవిద్యాలయాలలో దొరకడంలేదు. ఏ పట్టాలూ లేని రైతు అనుభవంతో పొందిన నైపుణ్యంతో పంట పండిస్తాడు. ఎంతో ఖర్చు పెట్టి ప్రఖ్యాత విశ్వవిద్యాలయం నుంచి వ్యవసాయ శాస్త్రంలో అత్యున్నత పట్టా పొందిన వారికి పొలం దున్నడం, విత్తనాలు వేయడం పాఠ్యాంశంగా మాత్రమే తెలుసు.

పట్టాలకోసం చదివినా చదువులు యువతకి కొన్ని బతుకు పాఠాలు నేర్చుకునే సాధనాలుగా ఉండాలి. స్వంతంగా, తార్కికంగా ఆలోచించి జీవిత ప్రయాణం కొనసాగించే నేర్పు, మనస్థితి అలవర్చుకునేలా పట్టాలకతీతంగా విద్యనభ్యసించాలి. అది విద్యాలయాల ద్వారా సాధ్యం కాకపోయినా పుస్తకపఠనం ద్వారా, పెద్దలనుంచి నేర్చుకునే ప్రయత్నం చేయాలి. అయితే, యువతకి మార్గ నిర్దేశం చేయగల పెద్దలు సమాజంలో ఉన్నారా? తమ పిల్లలు ఎక్కువ జీతం వచ్చే ఉద్యోగాలు సంపాదించే గొప్ప డిగ్రీలు పొందాలని ఆశించడం సహజమే కానీ సంపాదనతో పాటు సమాజహితం కాంక్షించే నైజం అలవరచుకోవాలని కోరుకోవడం అభిలషణీయం కదా.

ముఖ్యంగా యువత విద్యతో పాటు విచక్షణ నేర్పడం అవసరం. మంచి చెడుల మధ్య తేడా తెలుసుకోగల వివేకం అలవర్చుకోవడమే చదువు యొక్క అంతిమ లక్ష్యం గా ఉండాలి. పట్టాలు పొంది విశాల ప్రపంచం లోకి అడుగు పెట్టిన యువతకి "వివేక చూడామణి" ఏది?

శ్రీవిష్ణుపురాణం "విద్యయా యో యయా యుక్తస్తస్య సా దైవతం

మహత్,నైవ పూజ్యార్చనీయా చ నైవ తస్యోపకారికా" అని విద్య యొక్క శక్తిని ప్రతిపాదిస్తుంది. ఏ విద్య సాయంతో ఒక వ్యక్తి తన జీవనాన్ని సాగిస్తుంటాడో, ఆ విద్యయే అతడికి ఇష్టదైవం వంటిది. ఆ విద్య ఆ వ్యక్తికి పూజనీయమైనది; ఆ విద్య ఆ వ్యక్తికి చిరకాలం ఆనందాన్ని కలిగించేదిగా ఉంటుంది అని సారాంశం.

విద్యయొక్క ప్రయోజనాలు ఆవశ్యకత గురించి భర్తృహరి సుభాషితం సమగ్రంగా చెబుతుంది.

విద్య నిగూఢ గుప్తమగు విత్తము, రూపము పూరుషాళికిన్
విద్య యశస్సు, భోగకరి, విద్య గురుండు విదేశ బంధుడన్
విద్య విశిష్ట దైవతము, విద్యకు సాటి ధనంబు లేదిలన్,
విద్య నృపాల పూజితము, విద్య నెఱుంగని వాడు మర్త్యుడే..?

భౌతిక సుఖాలు, సౌకర్యాలు చేకూర్చే సాధనంగా విద్యని నిర్వచించినా, "విద్య గురువు, విశిష్ట దైవతము" అని చెబుతాడు. అంటే సన్మార్గంలో నడిచే విధంగా మార్గదర్శనం చేసేది, ఉత్తమ గుణసంపదనిచ్చేది అని అర్థం. విద్యకి రూపం లేదు; కానీ మంచి విద్య పొందినవారు తమకు తాము గురువు గానూ, దైవము గానూ మలచుకునే శక్తియుక్తులు సంపాదించి సమాజానికి ఉపయోగపడాలన్నది భర్తృహరి ఉపదేశ సారం.

పుస్తక జ్ఞానమూ, అనుభవ జ్ఞానమూ కలగలిపి సర్వశక్తి సంపన్నుడుగా, వివేకం, విచక్షణ గల వ్యక్తిగా ఎదగడానికి తనకు తానే గురువుగానూ, దైవం గానూ పరిణమించాలి. అప్పుడే, యువత వేగంగా మారుతున్న ప్రపంచ పరిస్థితులను తట్టుకుని స్వయం ప్రతిభతో విరాజిల్లగలరు.

భవదీయుడు

డాక్టర్ కొవ్వలి గోపాలకృష్ణ
ప్రధాన సంపాదకులు, ప్రకాశిక

ముఖచిత్రం



లోపల

హిందీ సాహిత్యం లో ఓ వినూత్న సంతకం –
వినోద్ కుమార్ శుక్లా – డా. నిర్మలా దేవి చిట్టిళ్ళ................................ 7

మా అమ్మ ఎక్కడ – తెలుగు అనువాదం : డా.సి.భవానీదేవి 16

తెలుగు పద్య నాటక రంగంలో ఆధునిక
ప్రయోగాల ఆవశ్యకత– డా. పి.వి.ఎన్. కృష్ణ 24

మానవ రుగ్మతల చికిత్సకు అవసరమైన ఔషధీయ చికిత్సా విధానాలు –
1988 సంవత్సరపు నోబెల్ పరిశోధన– డా. చాగంటి కృష్ణ కుమారి....... 41

హైకూ కవిత–లక్షణాలు, నిర్మాణ వైవిధ్యం –డా. తలతోటి పృథ్విరాజ్...... 52

మనసు – శ్రీ శేఖర్ మంత్రి ప్రభాకర్ 74

హైకు – ఒక పరామర్శ – డా. రూప్ కుమార్ డబ్బీకార్ 75

'హైకూ'ల ప్రకృతి ప్రయాణం – డా. తన్నీరు సురేశ్........................... 87

నిశ్శబ్దంగా ప్రవహించే ప్రార్థనే హైకూ – శ్రీ బివివి ప్రసాద్..................... 98

ఈ పత్రికలోని వ్యాసాలు, కథలు, కవితలు, అభిప్రాయాలు, ఆయా రచయితల స్వంతం. పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధమూ లేదు.

హిందీ సాహిత్యం లో ఓ వినూత్న సంతకం - వినోద్ కుమార్ శుక్లా

డా. నిర్మలా దేవి చిట్టిళ్ళ
9966539518

దృశ్యాలు మారడానికి రెప్పపాటు కాలం చాలు. ఇది వినోద్ కుమార్ శుక్లా మనోభావం.

ఆనందించడానికి కారణాలు మనమే వెతుక్కోవాలి. ఎందుకంటే మనం ఆనందంగా ఉండాలి. మనం వెతుక్కున్న కారణాలే నిజమై, మనకు నిజమైన ఆనందాన్ని ఇస్తాయి. ఇటువంటి సాలోచనాత్మకమైన, సకారాత్మకమైన భావాలు అతని రచనలలో అడగడుగునా కనిపిస్తాయి.

"రాజకీయ విషయాలు, కిరాణా షాపులు, గుత్తేదారులు, వాతావరణం, రైలు ప్రయాణాలు...ఇవేనా ప్రాపంచిక విషయాలంటే... కాదు..ఇవేవీ కావు. నేనే కనుక రాయడం జరిగితే ..." అంటూ అతని కవిత మొదలౌతుంది. "అప్పుడే తలుపు కొట్టిన అలికిడి. నే వెళ్ళి తెరిచి చూసాను——" అంటూ మొదలౌతుంది 2008 లో ప్రచురితమైన ఇంకో చిరు కవిత.

శుక్లా గారి రచనలు చదవడమంటే మనకు ఇదివరకే తెలిసిన దానిని చదవడం కాదు, మన స్పృహ అంచుల్లో నిరంతరం లిఖించబడి, తుడిచివేయబడుతున్నదానిని చదవడం– అని అరవింద కృష్ణ అభిప్రాయం.



1970లో కవి, విమర్శకుడు, సంపాదకుడు అయిన శుక్లా గారి తలుపు తట్టిన శబ్దం. అంత వరకు హిందీ సాహిత్య పత్రికల్లో ప్రచురించ బడిన అతని కవితలు ధారావాహికలుగా

వెలువడాలన్న వర్తమానంతో ఆయన అనుమతి కోరుతూ అశోక్ వాజపేయ గారు పంపిన వ్యక్తి అతడి గుమ్మం ముందు నిల్చుని ఉన్నాడు. "గడ్డి పక్కనే గడ్డి మొలుస్తుంది" అనే కవితా సంకలనం ధారావాహికంగా వెలువడింది.

ఆ చెట్టు నన్ను కలవడానికి నా ఇంటికి రాలేకపోతే నేను ఆ చెట్టు దగ్గరకి వెళ్ళి కలుస్తాను

వినోద్ కుమార్ కవితల్లో సామాన్యుడి జీవితం, అందులోని సుఖ–దుఖాలు ప్రతిబింబిస్తాయి. నిరాశ ఉన్నప్పటికి ఆశా కిరణం కనిపిస్తుంది. సామాజిక స్పృహతో కూడుకున్న ఆయన రచనలు సమాజంలో సమస్యల్ని ఎత్తి చూపేవిగా ఉంటాయి. కవితల్లోని విలక్షణమైన భాష పాఠకుల్ని కట్టి పడేస్తుంది. ఆయన కవితల్లో కథనానికి ముఖ్యమైన స్థానం ఉంది. కవితలతో కథలు చెప్పడం ఆయన ప్రత్యేకత.

"ఆ చెట్టు నన్ను కలవడానికి నా ఇంటికి రాలేకపోతే నేను ఆ చెట్టు దగ్గరకి వెళ్ళి కలుస్తాను.

నా ఇంటికి ఎప్పటికి రాని వారిని కలవడానికి నేనే స్వయంగా వెళ్తాను" అంటూ ఒక కవిత నడుస్తుంది.

వినోద్ కుమార్ శుక్లా కవితలు హిందీ సాహిత్యం లో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉన్నాయి అనడం లో ఎటువంటి అతిశయోక్తి లేదు. ఆయన కవితలలో పాత్రలు లోతైన భావాల్ని, సున్నితత్వాన్ని, కల్పన, మాయ, వాస్తవికత తో కూడిన సమాజాన్ని మనకు పరిచయం చేసేవిగా ఉంటాయి. మానవ సంబంధాలను మెరుగు పరచేవిగా ఉంటాయి.

"ఓ వ్యక్తి నిరాశగా కూర్చున్నాడు. ఆ వ్యక్తి ఎవరో నాకు తెలియదు.
కాని నిరాశ నాకు తెలుసు, అందుకే నేను ఆ వ్యక్తి దగ్గరకు వెళ్ళాను
చేయి అందించాను అతడు నా చేయి అందుకున్నాడు
ఆ వ్యక్తి కి నాతో పరిచయం లేదు
కాని చాచిన చేయి అతడికి పరిచయమే
మేం కలిసి నడవడం మొదలు పెట్టాం
మేం ఒకరికి ఒకరం అపరిచితులం

కాని కలిసి చేసే ప్రయాణానికి సుపరిచితులం" (అతిరిక్త్ నహీ, పేజి 13) వాణి ప్రకాశన్ 2000

ఆయన తన కవితల్లో ప్రకృతికి, ప్రేమకి ఉన్నతమైన స్థానం కల్పించారు

"ప్రేమ స్థానం అనిశ్చితం
ఇక్కడ ఎవరూ ఉండరు, దానికంటూ వేరే చోటు కూడా లేదు
ఇక్కడ మిట్ట మధ్యాహ్నం కూడా చీకటి
ప్రేమ సుఖం లో కళ్ళు మూసుకోవడం వలన ఏర్పడే చీకటి.
తన భాగం లో, ఓ చాటులో
అకస్మాత్తుగా స్పర్శిస్తూ
వచ్చి చేరి, స్పర్శించి వీడ్కోలు పలుకుతూ
(కవి నే కహా, పేజి 29) కితాబ్ ఘర్ ప్రకాశన్ 2012



కవితలే కాదు కథలు, నవలలు కూడా అంతే ప్రసిద్ధి పొందాయి. 1979 లో ఆయన రాసిన తొలి నవల "నౌకర్ కీ కమీజ్" భారతీయ ప్రజల యథార్థ జీవితానికి అద్దం పడుతుందన్న విషయంలో కాల్పనికత గాని, అతిశయోక్తిగాని లేదు. పాత్రలు సజీవమైనవి. ఇందులోని పాత్రలు కల్పితమైనవిగా కాని, కథకు జోడించినవిగా, అనవసరమైనవిగా, కిట్టించినట్లుగాగానీ ఉండవు. కథతో పాటు వీటి ఔచిత్యం సమానంగా ఉంటుంది. ఇందులోని ప్రధానమైన పాత్ర సంతుబాబు. పరిపాలనా వ్యవస్థలో గల లోపాలు, అసమర్థత, నమ్మక

ద్రోహం ఈ కథలో ఎత్తిచూపారు శుక్లా. వ్యంగ్యాత్మశైలిలో ఓ చురకలా సాగిన ఈ కథ మనసుకు హత్తుకొనేలా మలచిన శైలి అద్భుతం. ఈ కథలో భాష, పదబంధాలు, రచనలోని ప్రత్యేకమైన శైలి వల్ల ఈ నవల బాగా ప్రసిద్ధి చెందింది. ఇందులోని చిన్న-చిన్న సంఘటనలు కథకి బలాన్ని చేకూర్చాయి. ఇందులోని భాషా విశిష్టత ఏమిటంటే, ఇందులోని పాత్రలు సాధారణ సంభాషణకి ఓ సరికొత్త అర్థాన్ని చెపుతాయి. ఇదే ఈ నవలకు ఆయువుపట్టు. చదువుతున్నంత సేపు పాఠకులకు వాక్యాలు ఓ చిన్న తాళంలా, సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించేవిగా తోస్తాయి.

ఈ నవలలోని కథాంశం ఇల్లు, ఆఫీసు అనే స్తంభాల మధ్య వారధి లాంటిది. ఇది సంతుబాబు, అతని భార్య కథ.

కథలు రాయడానికి ఎన్నో మార్గాలు ఉన్నాయి. అందులో ఆత్మకథ ఒకటి. కొంతమంది నేరుగా తమ కథను రాస్తారు. మరికొందరు వేరేవారి ముసుగులో తమ కథను చెబుతారు. ఈ నవలలో వినోద్ కుమార్ తన కథకే కాదు తనలాంటి కష్టజీవుల కథను వివరించారు. ఇందులో సమాజ వ్యవస్థలో జరుగుతున్న దోపిడీని ప్రజలముందుకు తీసుకుని రాడానికి ప్రయత్నించారు.

ఈ నవలలోని కథాంశం ఇల్లు, ఆఫీసు అనే స్తంభాల మధ్య వారధి లాంటిది. ఇది సంతుబాబు, అతని భార్య కథ. సంతుబాబు తన అనుభవంతో చాకచక్యంగా ఈ రెండింటి మధ్య ఉన్న తాడు మీద స్వారీ చేయడానికి ప్రయత్నిస్తాడు. ఈ పనిలో అతని భార్య అతనికి సహకరిస్తుంది. ఈ ప్రయత్నంలో అతనికి జీవితం ఓ ఓడ రేవులా అని పిస్తుంది.

సంతుబాబు ఓ ప్రభుత్వ కార్యాలయం లో ఉద్యోగి. ఇతడు నిజాయతీ పరుడైన ఉద్యోగి కావడం వల్ల అందరూ ఇతనిని 'బాబు' అని సంబోధిస్తారు. ఇతని పై ఆఫీసరు తన ఇంటి పనిని సంతు బాబులాంటి తన క్రింది ఉద్యోగులతో చేయించుకుంటూ ఉంటాడు. ఆఫీసర్ భార్య సంతుబాబు భార్యతో ఇంటి పనులు చేయిస్తుంది. అతడు ఆ వ్యవస్థలో తనని తాను ఇముడ్చుకో లేక ఇబ్బంది పడతాడు. అతనికి ఆ వ్యవస్థ ఇష్టం లేని చొక్కాలాంటిది. ఈ చొక్కా

తన పై అధికారి తనలాంటి వారికోసం చేయించిన సేవకుడి చౌక్కా అంటాడు సంతుబాబు. సంతుబాబు అతని భార్య ఈ ఇబ్బందికరమైన పరిస్థితి నుండి బయట పడడానికి చేసే ప్రయత్నమే ఈ కథా వృత్తాంతం.

ధనవంతులు, వడ్డీ వ్యాపారులు, సామాన్య ప్రజలని దోచుకొనే పరిస్థితిని కళ్ళకుకట్టినట్లుగా చూపేదే ఈ నవల. వ్యక్తిగత ప్రయోజనాలకంటే ప్రజా సంక్షేమం, సమాజ సంక్షేమమే ముఖ్యం అనుకునే పాత్ర సంతూబాబు. 'వ్యవస్థతో పోరాడని వాడు పిరికి వాడు; అన్యాయాన్ని ఎదురించి నిలిచే వాడే ఆనందం పొందుతాడు' అనే సందేశాన్ని అందించే నవల ఇది.

1996 లో వినోద్ కుమార్ శుక్లా "దీవార్ మే ఏక్ ఖిడకీ రహతీ థీ" (గోడకు ఓ కిటికి ఉండేది) అనే నవల రచించారు. ఈ నవల చదివిన తరువాత ఏ సాధారణ పాఠకుడినైనా కలవర పెట్టే ప్రశ్న ఏమిటంటే ఈ రచన ఔచిత్యం ఏమిటి, లేదా రచయిత ఈ రచన ద్వారా పాఠకులకు ఏ సందేశాన్ని అందించాలని అనుకున్నాడు? కథానాయకుడు రఘువర ప్రసాద్ దిగువ మధ్య తరగతి మనిషి. అతని లో ఎటువంటి ప్రత్యేకత లేదు. అతని జీవితం లో ఎటువంటి సంచలనాత్మకమైన సంఘటలేవీ జరగలేదు. మరి ఈ నవల ప్రత్యేకత ఏమిటి?



ఏదైనా సాహిత్య రచనను తిరిగి చదవడం అనేది అద్దాన్ని మెరుగు పెట్టడం లాంటిది. పదే పదే రుద్దడం వల్ల దాని మెరుపు పెరుగుతుంది. అలానే వినోద్ కుమార్ శుక్లా రాసిన "దీవార్ మే ఏక్ ఖిడ్కీ రహతీథీ" రచన పదే పదే చదవడం వలన దానిలో ఉన్న ఔచిత్యం తెలుస్తుంది అని అంటాడు అతిథి భరద్వాజ్ అనే సాహిత్య విశ్లేషకుడు.

అందరిలోనూ సాధారణంగా కనిపించే ఒక అంశం సాన్నిహిత్యం; సాన్నిహిత్యం అవధులు లేనిది. ఇది ఒక కుటుంబానికి, బంధువులకే పరిమితం కాదు. అపరిచితులతో కూడా సన్నిహితంగా మెలగడం, ఇచ్చి పుచ్చుకోవడం వలన సామాజిక పరిస్థితులు మెరుగు పడతాయి అని చెప్పడమే ఈ రచనలోని

సందేశం. ఈ నవలలో భారతీయ దిగువ మధ్య తరగతి జీవితంలోని మానసిక విశ్లేషణ మనకు కనిపిస్తుంది; వారిలోని అసంతృప్తి అర్థం అవుతుంది. జీవితంలో ఏ విధమైన భోగభాగ్యాలు లేక పోయినా రంగురంగుల కలలు కంటూ జీవితాన్ని గడపడానికి కావలసిన బలాన్ని, ధైర్యాన్నిసృజనాత్మకంగా మలచిన శుక్లా తీరు మనకు ఆదర్శవంతంగా నిలుస్తుంది. పేదరికంలో కూడా ఆనందాలని వెతుక్కోవడం, ఆ ఆనంద క్షణాల్ని కాపాడుకోవడం, జీవితపు చీకటి గదిలో ఆనందం నిండిన కాంతి నింపే కిటికీని తెరవడం దీని ముఖ్య ఉద్దేశ్యం. ఇది కిటికీ లోపల ఉన్న ప్రపంచం. కిటికీ వెలుపల ఉన్న ఈ అందమైన ప్రపంచం సృష్టించడం నవలాకారుడి రచనకు గీటురాయి. తెలియని, పరిచయం లేని ఓ యువజంట పై ఓ వృద్ధురాలు ప్రేమ కురిపిస్తుంది. కిటికీ బయట అందమైన ప్రపంచం వారిలో ఆశాభావాన్ని మేల్కొల్పుతుంది. ఈ నవల 1996 లో సాక్షత్కార్ అనే పత్రికలో సీరియల్ గా వెలువడింది. 'వాణి ప్రకాశన్' ఈ నవలను 1997 లో పుస్తకంగా ప్రచురించింది. 1999 లో ఈ రచనకు సాహిత్య అకాడమీ అవార్డు ను ప్రకటించింది.

శుక్లా రచనలు

వినోద్ కుమార్ శుక్లా కథారచనలో కూడా తనదైన శైలితో గాఢమైన ముద్ర వేసాడు. సాధారణ ప్రజలు, వారి జీవితం, వారు కనే కలలే ఆయన కథలకు ఆధారం. ఆయన రాసిన "రూపాయలు", "భోజ్", వంటి కథలలో సామాన్యుడు తన శ్రమతో సంపాదించిన డబ్బు విలువను తెలియజేసే నేపథ్యంతో సాగేవే. "పేడ్ పర్ కమరా" (చెట్టు మీద గది) ప్రకృతికి మనిషికి గల సంబంధాన్ని, సాంగత్యాన్ని తెలియ జెప్పే కథ. మనిషికి, మార్కెట్టుకి ఉన్న సంబంధాన్ని, దానికి సంబంధించిన ఘర్షణల్ని "మహా విద్యాలయ" అనే కథ ద్వారా వ్యంగ్యాత్మకంగా వివరిస్తాడు శుక్లా. "ఆద్మీ కీ ఔరత్", "మఛలీ" కథల్లో స్త్రీ పక్షంతో పాటు పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా తనదైన దృక్పథాన్ని, అరుదైన



శైలిలో చాలా నైపుణ్యాత్మకంగా మలచిన తీరు అద్వితీయమైనది. ప్రత్యేకమైన కథనాలతో కూడుకొని ఉన్న ఈ కథలను చదవడం అంటే, కథకుడు ఆశ–నిరాశల, వెలుగు నీడల జ్ఞాపకాల లోగిలిలో సరికొత్త ప్రపంచంలోకి అడుగిడిన అనుభూతిని మనం కూడా అనుభవించిన భావనను పొందడమే.

వినోద్ కుమార్ శుక్లా సాహిత్యంలోని భాష సరళంగా, సహజంగా, సామాన్య మానవుడు మాట్లాడినట్లుగా, ఆర్భాటాలు లేకుండా సామాన్యుడికి కూడా అర్థమయ్యేటట్లు ఉంటుంది. కాని లోతుల్లోకి వెళ్ళి చూస్తే ఓ అగాధం, గూఢార్థం, నిగూఢార్థ అవగతం అవుతుంది. తాత్వికతతో కూడిన ఆయన భాషే, ఆయనను అందరికన్నా వేరుగా, ప్రత్యేకంగా నిలబెట్టింది .

"చెట్టు నీడ లో, రద్దీగా ఉండే రహదారి పక్కన
ఓ అంధుడు, వివిధ శబ్దాలతో కుర్చీ అల్లుతున్నాడు
ప్రపంచాన్ని ప్రేమించి, దానిని అందుకోవాలని ఆశ" (కవి నే కహా, పేజి 27)

వినోద్ కుమార్ రచనలలో భాషా ప్రత్యేకతలు :

సరళత, సౌలభ్యత– సాధారణంలోని అసాధారణమైన భాష ఆయన సొంతం. నదులు, పర్వతాలు, సామాన్యుడి జీవితంలోని ఒడిదుడుకులు.... అన్నీ అతి సాధారణమైనవే, అయినా వాటి అసాధారణ అర్థాన్ని స్ఫురింపజేసి, మనలను ఆలోచనల ప్రవాహంలోనికి నెట్టేయడమే ఆయన భాషలోని విశిష్టత. ఆయన భాషలో అతిశయం ఉండదు. ఓ సాధారణమైన మనిషి మాట్లాడినట్లుగానే ఉంటుంది. అది జన సాధారణ వ్యవహారిక భాష. మానవ సున్నితతత్వాలను ఆవిష్కరించే భాష.

"పార్కులో కూర్చున్నవాడు
వార్తాపత్రిక చదువుతున్నాడు
మురికి, దుర్వాసనల మధ్య అతడు బ్రతికే ఉన్నాడు
అందరూ పంచుకునే గాలి ఒకటి కాదు
నా వాటా కోసం ఆరాటం
అందరికి అన్నం పూర్తిగా దొరకదు
ఇది అందరికి సరిపడే సమయం కాదు"

తాత్త్వికత– జీవిత ఉనికిని, సమాజంలోని సత్యాన్ని, సాధారణ సమస్యల్ని– వాటి అసాధారణ అర్థాన్ని ఆలోచింపజేసేదిగా ఉంటుంది ఆయన భాష. కవితలలోని లోతైన భావోద్వేగాలు పాఠకులని ప్రభావితం చేస్తాయి అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ఆధునిక మానవుని సంక్లిష్టమైన అస్తిత్వ ఆకాంక్షలు, వ్యక్తీకరణలు ఏకకాలంలో వ్యక్తపరచడం ఆయన రచనలలో కనబడే శైలి. మధ్య తరగతి జీవితం లోని సూక్ష్మనైపుణ్యాలను మూర్తీభవించే అతని రచనలలోని ప్రత్యేక పాత్రలు భారతీయ కల్పనా సాహిత్యాన్ని సుసంపన్నం చేయడానికి దోహద పడ్డాయి. కొత్త తరహా విమర్శనాత్మక దృక్పథాన్ని ఆవిష్కరించడానికి ప్రేరణనిచ్చే కొత్త తరహా రచయిత వినోద్ కుమార్ శుక్లా.

ఉదాహరణకి –

"ఓ మనిషి వేరే మనిషి ప్రజాతిలా
సైరన్ మోత వినగానే
తన ప్రాణాలని కాపాడుకోవడానికి గోతిలోకి దూకేస్తాడు
ఆ గోతి దగ్గర నిలబడిన ఓ గర్భవతి
ఓ ప్రాణికి జన్మనీయడానికి
ఆ గోతిలోకి దిగింది
కాని మనిషి చనిపోతాడు ఒంటరితనం వల్ల....."

సాంప్రదాయాలకు దూరంగా, మాయా వాస్తవికాలకు ప్రతిబింబాలుగా ఆయన రచనలు నిలుస్తాయి. వాస్తవికతతో కూడిన ఓ మాయా ప్రపంచాన్ని, లేమితనంలో కలిమి, కల్పనని జోడించి పాఠకులను ఆశల ఉయ్యాలలూగిస్తూనే వాస్తవికతను చవిచూపిస్తాడు. జాతీయాలు, వ్యంగ్యార్థాలు ఆయన భాషకు సొబగులు అద్దాయి. ఉదాహరణకి –

"ఒక ఆలోచన లాగానే

ఆ వ్యక్తి కొత్త వెచ్చని
కోటు వేసుకొని వెళ్ళాడు"

శైలి ప్రధానమైన భాషా ప్రయోగాలు, ఆడంబరం లేని వ్యాఖ్యలు శుక్లా గారికి వెన్నతో పెట్టిన విద్య. అతి సునాయసంగా వాటిని ప్రయోగించడంలో ఆయన దిట్ట. సమాజంలోని అసమానతలు వెలుగులోకి తెచ్చే ఆయన వ్యంగ్య రచనలు, మానవ సంబంధాలు ఆయన రచనలోని ముఖ్యాంశాలు. హిందీ సాహిత్యంలో ఓ కొత్త ఒరవడి ఊపిరి పోసుకుంది. ఉదాహరణకి –

"ఆ పేద రోగి, జబ్బు నయం చేయడానికి
వచ్చాడో ఓ పెద్ద వైద్యుడు
ఆయనే కాదు, ఆయన ఫీజు కూడా పెద్దదే...
ఆ పేద రోగికి,
అందరికన్నా చవకైన డాక్టరు కూడా
ఖరీదైన వాడే"

హిందీ కవిత్వ రచనారంగం లో తనదైన శైలిలో ప్రత్యేకమైన భాషా ప్రయోగాలతో లోతైన భావోద్వేగాల్ని పలికించడంలో ప్రసిద్ధి చెందారు డా. శుక్లా. ఆయన తన విభిన్న పద ప్రయోగాలతో సమకాలీన కవితావనిని సుసంపన్నం చేసారు అనడం అతిశయోక్తి కాదు. ఆయన రచనలు ప్రపంచం లోని దాదాపు అన్ని ప్రధాన భాషలలోకి అనువదించ బడ్డాయి. అతడు నాటక రంగానికి, సినీ రంగానికి చేసిన కృషి మరువరానిది. ప్రత్యేకంగా, ఆయన రచనాశైలిని ప్రస్తుతిస్తూ 2024 సంవత్సరానికి ఆయనకు జ్ఞానపీఠ పురస్కారం ప్రకటించారు.

మా అమ్మ ఎక్కడ

హిందీ మూలం : కృష్ణా సోబ్తి
తెలుగు అనువాదం : డా.సి.భవానీదేవి
9866847000

చాలా రోజుల తర్వాత అతను చంద్రుడిని, నక్షత్రాలను చూశాడు. తను ఇప్పటివరకు ఎక్కడ ఉన్నాడు? కింద కింద, బహుశా చాలా లోతుగా ... అక్కడి కందకం మానవరక్తంతో నిండి ఉంది. అతని చేతుల నైపుణ్యం లెక్కలేనన్ని బుల్లెట్ల వర్షాన్ని కురిపిస్తోంది. కానీ ఇప్పుడు అతను కింద లేడు. తన కొత్తదేశ స్వాతంత్ర్యంకోసం పోరాడుతున్నాడు. దేశం ముందు ప్రశ్నలే లేవు, తనగురించి చింతలేదు. అతను నాలుగురోజులుగా ఎక్కడ ఉన్నాడు? అతను ఎక్కడ లేడని? గుజరాన్వాలా, వజీరాబాద్, లాహోర్! మైళ్ళ కొద్దీ దూసుకుపోతున్న ట్రక్కు. అతను ఎంత దూరం ప్రయాణించాడు? ఇదంతా ఎవరి కోసం? దేశం కోసం, సమాజం కోసం.. తనకోసం? లేదు, తనపై తనకి అంత ప్రేమలేదు. యూనస్ ఖాన్ పెద్దరోడ్డుపై నిలబడి సుదూరగ్రామంలో అగ్నిజ్వాలలను చూస్తున్నాడా? ఆ అరుపుల శబ్దం అతనికి కొత్తకాదు. మంటలు అంటుకున్నప్పుడు కేకలు వేయడంలో కొత్తేమీలేదు. అతను అగ్నిని చూశాడు. పిల్లలు, స్త్రీలు, పురుషులు మంటల్లో కాలిపోవడం చూశాడు. రాత్రంతా కాలిపోయి, ఉదయం బూడిదగా మారిన కొన్ని ప్రాంతాలలో కాలిపోయిన వ్యక్తులను చూశాడు. అతను అంత తేలికగా భయపడడు? మరి ఎందుకు ఆందోళన? రక్తం లేకుండా స్వేచ్ఛ సాధించలేము. రక్తం లేకుండా విప్లవం రాదు, ఈ విప్లవం నుండే అతని చిన్నదేశం పుట్టింది! సరే. రాత్రి, పగలు అన్నీ ఒక్కటయ్యాయి. అతని కళ్ళు నిద్రపోతున్నాయి. కానీ అతను లాహోర్ చేరుకోవాలి. సరైన సమయానికి. ఒక్క

అవిశ్వాసి కూడా ప్రాణాలతో ఉండకూడదు. ఈ చిరు చలిరాత్రిలో కూడా, బలోచ్ యువకుడికి 'కాఫిర్' అనే ఆలోచన రాగానే కళ్ళుఎర్రబడ్డాయి. అకస్మాత్తుగా ఒక విరిగిన క్రమం తిరిగి కనెక్ట్ అయినట్లుగా ఉంది.

- 2 -

వేగవంతమైన వేగంతో ట్రక్ మళ్ళీ కదలడం ప్రారంభించింది.

రోడ్డు పక్కన మృత్యువు ఒడిలో పడున్న గ్రామాలు, పచ్చని పొలాల చుట్టూ మృతదేహాల కుప్పలు. కొన్నిసార్లు దూరం నుండి 'అల్లా-హో-అక్బర్' మరియు 'హర్-హర్ మహాదేవ్' శబ్దాలు వినిపిస్తున్నాయి. "అయ్యో.. అయ్యో"....'పట్టుకో, పట్టుకో'...' కొట్టు, కొట్టు'. యూనస్ ఖాన్ ఇదంతా వింటున్నాడు. దానితో అతనికి ఎటువంటి సంబంధం లేనట్లు నిశ్శబ్దంగా ఉన్నాడు. అతను గతంలోకంటే కొత్తగా, మరింత మహిమాన్వితమైన, శక్తివంతమైన సుల్తానేట్‌ను చూస్తున్నాడు.

బలోచ్ కిందకి దిగాడు. బహుశా గాయపడి ఉండవచ్చు! కానీ అతను ఎందుకు ఆగిపోయాడు?

చంద్రుడు అస్తమిస్తున్నాడు. పాలలాంటి చంద్రకాంతి నీలంరంగులోకి మారిపోయింది. బహుశా భూరక్తం విషంరూపంలో ఆకాశంలో వ్యాపించి ఉండవచ్చు.

"చూడు, కొంచెం ఆగు." యూనస్ ఖాన్ చెయ్యి బ్రేక్ మీద ఉంది.

ఇది.. ఇదేమిటి? ఒక చిన్న, చిన్న నీడ! నీడ? కాదు, రక్తంతో తడిసిన సల్వార్‌లో అపస్మారక స్థితిలో ఒక పిల్ల.

బలోచ్ కిందకి దిగాడు. బహుశా గాయపడి ఉండవచ్చు! కానీ అతను ఎందుకు ఆగిపోయాడు? అతను మృతదేహాల కోసం ఎప్పుడు ఆగాడని? కానీ ఇక్కడ గాయపడిన చిన్నపిల్ల ... అతనికెందుకు? అతను చాలామంది స్త్రీలను చూశాడు... కానీ, ఖచ్చితంగా ఆ అమ్మాయిని ఎత్తుకున్నాడు. ఆమె బతికితే .. బతకగలిగితే...అతను ఇలా ఎందుకు చేస్తున్నాడో యూనస్ ఖాన్ కి అర్థం కాలేదు... కాఫిర్ అయితే మాత్రం? ఇప్పుడు ఆ అమ్మాయిని వదిలి వెళ్ళలేడు.

బలమైన పెద్ద పెద్ద చేతుల్లో స్పృహలో లేని అమ్మాయి. యూనస్ ఖాన్ ఆమెను ఒక సీట్లో పడుకోబెట్టాడు. ఆమె కళ్ళు మూసుకుని ఉంది. తలమీద నల్లని మందపాటి వెంట్రుకలు తడిగా ఉన్నాయి. పాలిపోయిన ముఖంమీద రక్తం చిమ్ముతోంది...

- 3 -

యూనస్ ఖాన్ వేళ్లు ఆమె జుట్టుమీద ఉన్నాయి. జుట్టురక్తం అతని చేతులకి ఉంది... బహుశా ఆమెను లాలించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు ఇలా జరిగి ఉండవచ్చు! కానీ యూనస్ ఖాన్ ఎప్పుడూ అంత భావుకుడు కాలేదు. అతని చేతుల్లో అంత దయ ఎక్కడినుండి వచ్చింది? తెలియదు. స్పృహలో లేని అమ్మాయికి మాత్రమేం తెలుసు? తన అన్నని చంపి తనపై దాడిచేసిన చేతులే ఇప్పుడు తనను నిమురున్నాయని.

యూనస్ ఖాన్కి వణుకుతున్నట్లు, ఊగుతున్నట్లు అనిపిస్తుంది. అతను ఎంతసేపు ఆలోచిస్తాడు. వెళ్ళిపోవాలి!

యూనస్ ఖాన్ చేతుల్లో ఉన్న అమ్మాయి చూస్తున్నది ... అతని హింసాత్మక కళ్ళు కాదు, అతని తడి కళ్ళు. అవి దూరంగా ఉన్న కోయ్టేలో ఒక చల్లని, చాలా చల్లని సాయంత్రం, అతని చేతుల్లో అతని అందమైన పన్నెండేళ్ల సోదరి నూరాన్ మృతదేహాన్ని చూస్తున్నాయి, అక్కడే కళ్ళు మూసిన అతని వితంతువు తల్లిని.

ఈలలు వేసే గాలిలో ..స్మశానవాటికలో, మృత్యువు ఒడిలో పువ్వులాంటి అతని సోదరి. ప్రపంచాన్ని మరచిపోయి ఆ పాత జ్ఞాపకంలో వణుకుతున్న యూనస్ ఖాన్ హృదయం ..మనస్సు.

నేడు, అలాగే .. సరిగ్గా అదే విధంగా, అతని చేతుల్లో... కానీ ఊచకోతను తన మతంగా, విశ్వాసంగా భావించే ఆ యూనస్ ఖాన్ గత నాలుగురోజులుగా రక్తంతో ఆట్లా డుతున్నాడు... అతను ఎక్కడ? ఎక్కడ?

యూనస్ ఖాన్కి వణుకుతున్నట్లు, ఊగుతున్నట్లు అనిపిస్తుంది. అతను ఎంతసేపు ఆలోచిస్తాడు. వెళ్ళిపోవాలి! ఆ అమ్మాయి గాయాలు?... యూనస్

ఖాన్ మళ్ళీమళ్ళీ గౌరవంగా, ఆప్యాయతతో తడుముతూ, ఆ అమ్మాయిని పడుకోబెట్టి, సైనికుడి వేగంతో ట్రక్కును స్టార్ట్ చేశాడు. అకస్మాత్తుగా విధి నిర్వహణ గురించిన స్పృహలోకి రావడంతో వెంటనే వెళ్ళిపోవాలి. ఆ అమ్మాయి గాయాలకు కట్టు కట్టినట్లయితే ఆమె బతికే అవకాశం ఉంది. వేగంగా, వేగంగా, అతి వేగంగా! ట్రక్కు వేగంగా పోతోంది.

అతని మనసు ఆలోచిస్తోంది? ఇదేంటి? ఈ ఒక్కరికోసం ఎందుకు? వేలమంది చనిపోయారు.

- 4 -

ఇది లాభానికి జరిగే నష్టం. దేశంకోసం చేసే యుద్ధం. మనసుగొంతు మౌనంగా ఉండమంటోంది. ఈ అమాయక పిల్లల త్యాగాలకు స్వేచ్ఛారక్తంతో సంబంధం ఏమిటి? ఆ అమ్మాయి ఏమీ తెలియని అపస్మారక స్థితిలో పడుంది.

లాహోర్ రాబోతోంది. ఇవి రోడ్డుకు సమాంతరంగా వేసిన రైల్వే పట్టాలు. షాదారాతో బాటు ట్రక్ ఇప్పుడు లాహోర్ వీధుల్లో ఉంది. అతను ఎక్కడికి తీసుకెళ్తాడు? మాయో హాస్పిటలా.. సర్ గంగారామ్?...గంగారామ్ ఎందుకు? యూనస్ ఖాన్ ఉలిక్కిపడ్డాడు. తాను ఆ అమ్మాయిని తిరిగి ఇచ్చేస్తాడా? లేదు, లేదు, ఆమెను తనతోనే ఉంచుకుంటాడు. మాయో హాస్పిటల్ ముందు ట్రక్ ఆగింది.

కొన్ని క్షణాల తర్వాత బలోచ్ డాక్టర్‌తో ఆందోళనాస్వరంతో డాక్టర్, దయచేసి ఎలాగైనా ఈ అమ్మాయికి నయం చేయండి...

కొన్ని క్షణాల తర్వాత బలోచ్ డాక్టర్‌తో ఆందోళనాస్వరంతో

"డాక్టర్, దయచేసి ఎలాగైనా ఈ అమ్మాయికి నయం చేయండి... తను సురక్షితంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను!" అన్నాడు. ఇంకా పెద్దగొంతుతో

"డాక్టర్, డాక్టర్..." అని అరిచాడు. అతని గొంతు అదుపులో లేదు.

"సరే! ఈమెను బాగుచేయటానికి నా వంతు ప్రయత్నం చేస్తాను" చెప్పాడు డాక్టర్.

ఆ అమ్మాయి ఆసుపత్రిలో పడి ఉంది. యూనస్ ఖాన్ తన డ్యూటీలో ఉన్నాడు. కానీ కొంచెం అజాగ్రత్తగా, ఆశ్చర్యంగా, ఆందోళనగా, పెట్రోలింగ్ చేస్తున్నాడు.

ఆమె ఇనుప మంచం మీద పడుకునిఉంది. తలకు తెల్లటి బ్యాండేజీ కట్టి ఉంది. ఏదో భయంకరదృశ్యం

లాహోర్‌లోని పెద్ద పెద్ద రోడ్లమీద కొన్నిచోట్ల నిన్నరాత్రి వెలిగించిన మంటల నుండి పొగ వస్తోంది. కొన్నిసార్లు, భయపడిన వ్యక్తుల సమూహాలు కొంతమంది సైనికులతో కలిసి కనిపిస్తున్నారు. అక్కడక్కడా వాళ్ళ స్నేహితులు ఎగతాళిగా ఆ గూండాలముఠా వైపు వేలెత్తి చూపిస్తున్నారు. ప్రజల మృతదేహాలు చెల్లాచెదరుగా పడి ఉన్నాయి. నిర్జన వీధుల్లో నగ్నస్త్రీలు, మధ్యమధ్యలో నినాదాలు, బిగ్గరగా నినాదాలు! నిన్నటి వరకు బలంగా పనిచేసిన యూనస్ ఖాన్ చేతులు ఇవాళ అలసిపోయాయి.

- 5 -

సాయంత్రం తిరిగి వచ్చేటప్పుడు అతను త్వర త్వరగా నడుస్తున్నాడు. ఆసుపత్రికి కాకుండా ఇంటికి వెళ్తున్నట్లుగా ఉన్నాడు. అపరిచితురాలైన అమ్మాయి పట్ల అతనికి ఎందుకు గాభరాగా ఉంది? ఆ అమ్మాయి ముస్లిం కాదు, హిందువు...

తలుపు దగ్గరనుంచి మంచం వరకు వెళ్ళడం కూడా చాలా దూరం వెళ్తున్నట్లు అనిపిస్తుంది. పెద్ద పెద్ద అడుగులు.

ఆమె ఇనుప మంచం మీద పడుకునిఉంది. తలకు తెల్లటి బ్యాండేజీ కట్టి ఉంది. ఏదో భయంకరదృశ్యం ఊహించుకోవడంవల్ల కళ్ళు ఇంకా మూసుకునేఉన్నాయి. అందమైన అమాయక ముఖంమీద భయం కమ్మేసిన భయంకరమైన నీడ!

యూనస్ ఖాన్ ఎలా పిలవాలి, ఏం చెప్పాలి? ఆలోచిస్తున్నాడు.

'నూరన్' అనే పేరు పెదవులమీదే ఆగిపోతున్నది. చేతులు ముందుకు చాస్తున్నాడు. గాయపడిన బాలిక తలస్పర్శ, అతని వేళ్లు దానిని తాకుతున్నప్పటి సున్నితత్వం, ఎంత భారంగా ఉన్నా, గొంతులోనే ఆవేదనాస్వరం ఆగిపోతున్నది.

అకస్మాత్తుగా ఆ అమ్మాయి కదిలింది. ఆమె అపస్మారక స్థితిలో గొణుగుతున్నట్లుగా, బాధాస్వరంతో

కాఫిర్... యూనస్ ఖాన్ చెవులు రింగుమంటున్నాయి. కాఫిర్... కాఫిర్... ఈమెను ఎందుకు కాపాడాలి?

"క్యాంప్, క్యాంప్...క్యాంప్ వచ్చేసింది. పరిగెత్తు.. పారిపో"

"ఏమీ లేదు, ఏమీ లేదు, చూడుతల్లీ , కళ్ళు తెరు "

"ఫైర్, ఫైర్... ఆ బుల్లెట్ ... మిలిటరీ..."

- 6 -

ఆ అమ్మాయి అతన్ని దగ్గరగాచూసి అరుస్తున్నది...

"డాక్టర్, డాక్టర్...డాక్టర్, ఈమెను బాగుచేయండి." అతను ప్రార్థిస్తున్నాడు.

డాక్టర్ అతని వైపు అనుభవపూర్వకంగా చూస్తూ,

" నిన్ను చూసి ఆమె భయపడుతోంది. ఈమె కాఫిర్, అందుకే" అంటాడు.

కాఫిర్... యూనస్ ఖాన్ చెవులు రింగుమంటున్నాయి. కాఫిర్... కాఫిర్... ఈమెను ఎందుకు కాపాడాలి? కాఫిర్?...ఏమీ లేదు...నేను తనను నా దగ్గరే ఉంచుకుంటాను!

ఆ రక్తసిక్త రాత్రులు ఇలా గడిచిపోయాయి. యూనస్ ఖాన్ తన విధి నిర్వహణలో పరధ్యానంగా.. ఆ అమ్మాయి ఆసుపత్రిలో ...

క్రమంగా ఆ అమ్మాయి కోలుకుంటున్నది. యూనస్ ఖాన్ ఆరోజు ఆమెను తీసుకెళ్లాడు. డ్యూటీ నుండి తిరిగివచ్చిన తర్వాత అతను వచ్చి ఆ వార్డులో నిలబడ్డాడు.

ఆ అమ్మాయి విశాలమైన కళ్ళతో అతనికేసి చూస్తున్నది. ఆమె కళ్ళలో భయం, ద్వేషం, దిగులు కనిపిస్తున్నాయి.

బలోచ్ ఆ పిల్లని జాలిగా చూశాడు. ఈమెను ఎవరు రక్షించారు. అతనే తనతో ఉండమంటున్నాడు.

యూనస్ ఖాన్ ఆ అమ్మాయి తలను నిమిరాడు. ఆ అమ్మాయి వణికిపోయింది. అతని చేతులు తన మెడను నులిమేస్తాయని భయపడి కళ్ళు మూసుకుంది! తను ఎక్కడ ఉన్నదో అర్థం కాలేదు? మరి ఈ బలోచ్?...ఆ భయంకరమైన రాత్రి! తన అన్న! ఒక్కసారిగా ఆమెకు తన సోదరుడి మెడ గొడ్డలివల్ల శరీరంనుండి దూరంగా పడిపోయిందని గుర్తుకొచ్చింది.

యూనస్ ఖాన్ ఆమెను చూస్తూ మెల్లగా, "బాగున్నావా? మనం ఇప్పుడు ఇంటికి వెళదాం'' అన్నాడు.

- 7 -

ఆ అమ్మాయి తల అడ్డంగాఊపుతూ వణికిపోతూ, "వద్దు-వద్దు, ఇల్లు... ఇల్లు ఎక్కడుంది! నువ్వు నన్ను చంపేస్తావు." అంటోంది. యూనస్ ఖాన్ నూరాన్ ని చూడాలనుకున్నాడు. కానీ ఈమె నూరాన్ కాదు. ఎవరో అపరిచితురాలు. అతన్ని చూడగానే భయంతో కుంచించుకుపోతోంది.

ఆ అమ్మాయి భయంతో, "నన్ను ఇంటికి పంపకండి.. శిబిరానికి పంపండి. ఇక్కడ నన్ను చంపేస్తారు... చంపేస్తారు..." అంటున్నది.

యూనస్ ఖాన్ కళ్ళు చెమర్చాయి. వారికి సైనికుల క్రూరత్వం లేదు.. బలం లేదు, అధికారంలేదు. వారికున్నది ఒక అసహనభావం, నిస్సహాయత మాత్రమే.

బలోచ్ ఆ పిల్లని జాలిగా చూశాడు. ఈమెను ఎవరు రక్షించారు. అతనే తనతో ఉండమంటున్నాడు. బలోచ్ ఏదో తెలియని అనురాగంలో మునిగిపోతున్నాడు.

అతను చిరునవ్వుతో ఒకసారి ఆ పిల్లని తట్టి, "పద పద, ఏమీ చింతించకు. మేము మీ వాళ్ళమే..." అన్నాడు.

యూనస్ ఖాన్ తో ట్రక్కులో కూర్చొని, బలోచ్ ఎక్కడైనా ఒంటరిగాచూసి తనను చంపేస్తాడని ఆ అమ్మాయి అనుకుంటున్నది... బుల్లెట్తోనా ... కత్తితోనా!

ఆమె బలోచ్ చెయ్యి పట్టుకుని, "ఖాన్, నన్ను చంపకు... నన్ను చంపకు..." అంటున్నది పాలిపోయిన ఆమె ముఖం చూస్తే భయపడుతున్నట్లు తెలుస్తున్నది.

ఖాన్, ఆ అమ్మాయి తలపై చేయివేసి, "వద్దు-వద్దు, భయం లేదు... భయం లేదు... నువ్వు మా సొంతమనిషివి..." అన్నాడు.

అకస్మాత్తుగా ఆ అమ్మాయి ద్వేషంతో అరవడం ప్రారంభించింది నా తల్లి ఎక్కడ! నా అన్న ఎక్కడ! నా చెల్లి ఎక్కడ... అని.

అకస్మాత్తుగా ఆ అమ్మాయి ఖాన్ ముఖాన్ని గీకడం మొదలుపెట్టింది.

- 8 -

"నన్ను శిబిరంలో వదిలేయండి.. వదిలేయండి" అని ఏడుస్తున్నది.

ఖాన్ సానుభూతితో "ఊరుకోమ్మా, ఏడవకు ... నువ్వు మా బిడ్డగానే ఉంటావు. మాతోనే" అంటున్నాడు.

"వద్దు" ఆ అమ్మాయి తన పిడికిలితో ఖాన్ ఛాతీపై కొట్టడం ప్రారంభించింది.

"నువ్వు ముస్లింవి... నువ్వు..."

అకస్మాత్తుగా ఆ అమ్మాయి ద్వేషంతో అరవడం ప్రారంభించింది

"నా తల్లి ఎక్కడ! నా అన్న ఎక్కడ! నా చెల్లి ఎక్కడ..." అని.

★★★

హిందీ మూలం: https://hindikahani.hindi-kavita.com/Meri-Maan-Kahan-Krishna-Sobti.php

తెలుగు పద్య నాటక రంగంలో ఆధునిక ప్రయోగాల ఆవశ్యకత

డా. పి.వి.ఎన్. కృష్ణ
94409 00592

ఏ జాతికైనా ఆత్మ ఆ జాతి యొక్క సంస్కృతి మాత్రమే. అంటే ఒక జాతి యొక్క లేదా ఒక సమూహంలో నివసిస్తున్న ప్రజల యొక్క కళలు, క్రీడలు, నమ్మకాలు, ఆచార వ్యవహారాలు, సాంప్రదాయాలు భాష, భావన, దృక్పథం అన్ని కలగలిసినదే సంస్కృతి. అయితే ఇందులో కళలు సాంస్కృతిక అభివ్యక్తికి ప్రతీకలు. కళాకారులు సాంస్కృతిక వారధులు. చరిత్రలో ఏం జరిగిందో, కట్టు, బొట్టు, ఆచారాలు కట్టుబాట్లు ఏవిధంగా ఉండేవో మొదలైన చారిత్రిక విజ్ఞానం వినోదభరితంగా కళాకారుల ద్వారానే మనకు తెలుస్తుంది. వాల్మీకి మహర్షి అనే ఒక సాహిత్యకారుడు ఆనాడు రామాయణాన్ని లిఖించి ఉండకపోతే ఈనాడు మన చరిత్ర మనకు తెలిసి ఉండేది కాదు. అలాగే వేదాలను, భారత భాగవతాలను, అష్టాదశ పురాణాలను వ్యాసభగవానుడు వ్రాసి ఉండకపోతే మన అస్తిత్వమే మనకు తెలిసి ఉండేది కాదు. వాళ్లు వ్రాసిన గ్రంథాల ఆధారంగా రూపురేఖలను శిలలపై చెక్కిన శిల్పులు, రామునికి కృష్ణునికి ఇతర పాత్రలకి రంగురంగుల ఆకారాలు కల్పించిన చిత్రలేఖకులు, వారి మహిమలను

గొప్పతనాలను అద్భుతంగా గానం చేసిన గాయకులు, ఆనాటి పాత్రలను ధరించి సజీవంగా వేదికపై నిలిపి వారి హావభావాలను రసవంతంగా మనకు అందించిన నృత్య మరియు నాటక కళాకారులు అందరూ మన సాంస్కృతిక వారధులే. ఈ కళాకారులందరూ కూడా ఆయా కాలాలలో ప్రజలను

రంజింప చేయడానికి వారి వారి కళా కౌశలాన్ని నిరంతరం మెరుగు పరుచుకుంటూ ప్రజల అభిరుచులలో వచ్చిన మార్పులకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ సాంస్కృతిక ప్రవాహంలో కలిసి పయనించిన కారణంగానే నేటికీ ఆ కళలు సజీవంగా మిగిలి ఉన్నాయి. ఆ విధంగా కాలమాన పరిస్థితులకు అనుగుణంగా మారని కళలు కనుమరుగైపోయాయి. ఒకనాడు విజ్ఞానాన్ని వినోదాన్ని అందిస్తూ తెలుగు నాట తరతరాలుగా అద్భుతంగా విలసిల్లిన అనేక జానపద కళలు నేటి తరానికి చేరకుండానే అంతరించిపోయాయి. దానికి కారణాలు చాలానే ఉన్నా ఆ కళలన్నీ నేటి తరానికి తగినట్టుగా ఆధునికత సంతరించుకోకపోవడం వాటి పతనానికి ప్రధాన కారణం అని చెప్పక తప్పదు. ఏదైనా ఒక కళ అంతరించడానికి ముందుగా మనకు కొన్ని లక్షణాలు కనబడతాయి. ఆ కళను ఆదరించే వారు లేక ప్రదర్శించే కళాకారులు పేదలుగా మారడం. తద్వారా ఆ కళాకారులను కళారూపాలను మిగిలిన ప్రజలు చిన్న చూపు చూడడం, తద్వారా వాళ్లు వేరే వృత్తులను ఆశ్రయించుకుని వెళ్లడం అందులో ప్రధానమైనది. ఈ పరిస్థితులు నేడు పద్య నాటకానికి దాపురిస్తున్నాయి. ఇక్కడ కళను ఆదరించని ప్రజలను నిందించడం భావ్యం కాదు. ప్రజలకు కావలసింది కొత్తదనం, వినోదం. ఆ వినోదం ఎక్కడ దొరికితే అక్కడికి వెళ్ళిపోతారు. వారికి నచ్చేటట్లుగా నూతన పోకడలతో తమని తాను మార్చుకుంటూ సమాజంలో ఉన్న తప్పు ఒప్పులను ప్రతిక్షేపిస్తూ విజ్ఞానంతో కూడిన వినోదాన్ని అందించడం కళాకారుల మరియు కళా సంస్థల యొక్క బాధ్యత.

నాటకం విషయానికి వస్తే, 1860లో కోరాడ రామచంద్ర శాస్త్రి గారు వ్రాసిన 'మంజరీ మధుకరీయం' తెలుగులో వ్రాయబడిన తొలి నాటకంగా చెబుతారు. తర్వాత వావిలాల వాసుదేవశాస్త్రి గారు మొదలగు కవులు నాటకాలు వ్రాసినా అవి ప్రదర్శనకు నోచుకోలేదు. 1880 ప్రాంతంలో మహారాష్ట్ర నుంచి వచ్చిన ధార్వాడ నాటక సమాజాల వారు ప్రదర్శించిన

హిందీ నాటకాలు ఆంధ్రదేశాన్ని అప్పట్లో ఉర్రూతలూగించాయి. వాటి స్ఫూర్తితో కందుకూరి వీరేశలింగం గారు షేక్స్పియర్ రచించిన 'కామెడీ ఆఫ్ ఎర్రర్స్' నాటకాన్ని తెలుగులో 'చమత్కార రత్నావళి' అనే పేరుతో రాసి ప్రదర్శించడం జరిగింది. అదే మనకు తెలిసిన తొలి తెలుగు నాటక ప్రదర్శన. తర్వాత ఆనాడు తెలుగు సారస్వతంలో పద్యాల యొక్క ప్రభావాన్ని సంగీతానికి ఉన్న ప్రాధాన్యతని అంచనా వేసిన శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులు గారు 1886 లో తాను వ్రాసిన 'చిత్రనళీయం' నాటకంలో పద్యాలు పాటలు ప్రవేశపెట్టడం జరిగింది. వాటిని రాగయుతంగా నటీనటులు ఆలపించడం ద్వారా ప్రజలకు అద్భుతమైన వినోదం అంది, వాటిని అధికంగా ఆదరించడం ప్రారంభించారు. ఈ ప్రయోగం నాటక రంగంలో ఒక ప్రభంజనాన్ని సృష్టించి పద్య నాటకం అనే ప్రక్రియ ప్రారంభం కావడానికి దోహదపడింది. మార్పును ప్రవేశపెట్టిన శ్రీ ధర్మవరం కృష్ణమాచార్యులు గారిని 'పద్య నాటక రంగ పితామహుడు'గా బిరుదునిచ్చి ఆంధ్రదేశం గౌరవించింది. అది విజయవంతం కావడంతో అనేక పద్య నాటకాలు రూపుదిద్దుతున్నాయి. చిలకమర్తి వారి 'గయోపాఖ్యానం' ఆనాటి సమాజంలో ఉన్న దెప్పిపొడుచుకోవడం, వ్యంగ్య సంభాషణలు ఆ నాటకంలో పెట్టడం ద్వారా కొత్త ఒరవడి సృష్టించి అప్పట్లో లక్ష కాపీలు అమ్ముడుపోయిన నాటకంగా దాన్ని చెబుతారు. ఆ తర్వాత వచ్చిన తిరుపతి వేంకట కవుల 'పాండవోద్యోగం' 'పాండవ విజయం' నాటకాలు సామాన్యుడికి కూడా అర్థమయ్యే విధంగా తెలుగనాట ఉన్న పలుకుబడులు 'బావా ఎప్పుడు వచ్చితీవు?' 'అదిగో ద్వారక' 'జెండాపై కపిరాజు' మొదలైన సామాన్య పదాలతో

అల్లినపద్యాలు ఆబాలగోపాలాన్ని అలరించాయి. అనంతరం బలిజేపల్లి లక్ష్మీకాంత కవి 'సత్యహరిశ్చంద్రీయం' అద్భుతమైన కరుణరసం మెలోడ్రామా పండించడం ద్వారా కొత్త ఒరవడి సృష్టించింది. వేదం వెంకటరాయ శాస్త్రి గారి 'ప్రతాప రుద్రీయం', శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారి 'బొబ్బిలి యుద్ధం', ముత్తరాజు సుబ్బారావు గారి 'శ్రీకృష్ణ తులాభారం', పానుగంటి వారి 'పాదుకాపట్టాభిషేకం', 'విప్రనారాయణ', కోలాచలం శ్రీనివాసరావు గారి 'విజయనగర పతనం', రామస్వామి చౌదరి గారి 'కురుక్షేత్ర సంగ్రామం' అద్భుతంగా ప్రదర్శించబడ్డాయి. తర్వాత వచ్చిన కాళ్ళకూరి నారాయణ రావు గారి 'చింతామణి', 'వరవిక్రయం', 'మధు సేవ' మొదలైన సాంఘిక పద్య నాటకాలు అప్పటికి సంఘంలో ఉన్న వేశ్య సంపర్కం, వరకట్నం, బాల్యవివాహాలు మద్యపానం మొదలైన సంఘదురాచారాలపై ఎక్కుపెట్టిన అస్త్రాలుగా కొత్త ఒరవడిని సృష్టించి ప్రేక్షకులకు చేరువయ్యాయి. స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో దామరాజు పుండరీకాక్షుడు వ్రాసిన 'స్వరాజ్య సోపానం' శ్రీ వేదాంతకవి వ్రాసిన 'విశ్వ స్వరాజ్యం' ఇలా ఎన్నో నాటకాలు కొత్త కొత్త ఇతివృత్తాలతో ప్రజలను ఆకట్టుకున్నాయి

> **పద్య నాటకంలో అతిగా చోటు చేసుకున్న ఈ ఆలాపన భాషకి, భావానికి, నటనకి, నాటకీయతకు, తిలోదకాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది**

అనంతర కాలంలో పద్య నాటకాల్లో అతి రాగాలాపన చోటు చేసుకున్నది. అబ్బూరి వరప్రసాద రావు గారితో మొదలైన ఈ ఆలాపన షణ్ముఖి ఆంజనేయరాజు గారితో పెరిగి పెద్ద,ఏవి సుబ్బారావు గారు పి.లక్ష్మణరావు గారు, కురిటి సత్యం నాయుడు గారు, ఎం వై నాయుడు గారు, గుమ్మడి జయరాజు గారు, సీమకుర్తి నాగేశ్వరరావు గారు, విజయరాజు గారు, అరిగెల జేమ్స్ గారు, అనంతర కాలంలో పద్మశ్రీ వై గోపాలరావు గారు, ఏ. వెంకటేశ్వరరావు గారు ఏ. కోటేశ్వరరావు గారు మొదలైన మహా గాయకులు ఆంధ్రదేశాన్ని పద్య సంగీతంలో ఓలలాడించి పద్యం ఆ బాలగోపాలానికి చేరువ కావడానికి దోహదపడిన మాట వాస్తవం. కానీ పద్య నాటకంలో అతిగా చోటు చేసుకున్న ఈ ఆలాపన భాషకి, భావానికి, నటనకి, నాటకీయతకు, తిలోదకాలు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. తర్వాత క్యాస్టింగ్ టిక్కెట్ నాటకాలు ఏర్పడ్డాయి. టిక్కెట్

నాటకాలకి ఎక్కడెక్కడ నుంచో పేరెన్నికగన్న గాయకులను రప్పించి క్యాస్టింగ్ నాటకాలను కాంట్రాక్టర్లు ఆడించడం మొదలుపెట్టారు. ఎవరు ఎక్కువ శృతిలో ఎక్కువ రాగాలాపన చేస్తే వాళ్లకి ఎక్కువ కిరాయి ఇచ్చే పరిస్థితి దాపురించింది. దీని వల్ల సరైన రిహార్సెల్స్ చేయకుండానే ఎవరి హార్మోనియం, క్లారినేట్ వాళ్లు తెచ్చుకొని వాళ్లకి అనుగుణంగా వాయుంప చేసుకుంటూ హెచ్చు శృతులు పెట్టుకుని గట్టి గట్టిగా అరుస్తూ ఒకరి కంటే మరి ఒకరు ఎక్కువగా పాడాలని తీవ్రమైన పోటీ తత్వంతో నాటకాన్ని నాశనం చేసిన మాట కూడా వాస్తవం. అయితే ఆ కాలంలో కూడా బళ్ళారి రాఘవ గారు, పద్మశ్రీ స్థానం నరసింహారావు గారు, బెల్లంకొండ సుబ్బారావు గారు, ఎడవల్లి సూర్యనారాయణ గారు, అద్దంకి శ్రీరామ్ మూర్తి గారు, ఉప్పులూరు సంజీవరావు గారు, కందుకూరి చిరంజీవి రావు గారు, అనంతర కాలంలో డివి సుబ్బారావు గారు, పీసపాటి నరసింహమూర్తి గారు, పొన్నాల రామసుబ్బారెడ్డి గారు, ఆచంట వెంకటరత్నం

నాయుడు గారు, మద్దాల రామారావు గారు, జి. ఎస్. ఎన్. శాస్త్రి గారు, బుర్రా సుబ్రహ్మణ్య శాస్త్రి గారు, కే. నాగేశ్వరరావు గారు, జొన్నలగడ్డ జగన్మోహన్ రావు గారు, గూడూరు సావిత్రి గారు, సురభి యమునా రాయులు గారు, ఆధునిక కాలంలో గుమ్మడి గోపాలకృష్ణ గారు, డాక్టర్ మీగడ రామలింగ స్వామి గారు, డాక్టర్ పివిఎన్ కృష్ణ గారు కొయ్యలగూడెం విజయ్ కుమార్ గారు మొదలైన నటీ నటులు నటనకు భావ స్ఫూర్తి కి ప్రాధాన్యతనిస్తూనే పద్య ఆలాపన చేసి పద్యం కంటే భాష, నటన ద్వారా ప్రజలకు చేరువయ్యారు. మైలవరం బాలభారతి, తెనాలి రామ విలాస సభ, ఆంధ్ర కళాపరిషత్తు, సురభి నాటక సమాజాలు, బందరు రామకృష్ణ నాట్యమండలి, విజయవాడ సాయిబాబా నాట్యమండలి,

మొదలైన ఎన్నో నాటక సంస్థలు ఈ నాటక కళ సజీవంగా వర్ధిల్లడానికి అహర్నిశలు కృషి చేశాయి. హరికథలు, బుర్రకథలు, జానపద కళారూపాలు తప్ప వేరే వినోదం ఎక్కువగా అందుబాటులో లేని ఆనాడు పౌరాణిక పద్య నాటకాలు రంగురంగుల తెరలతో, సురభి నాటక సమాజాల హంగులతో అద్భుతంగా ప్రేక్షకులకు కనువిందు చేశాయి.

నాటక రంగ అభివృద్ధి సంస్థ ద్వారా నంది నాటక ఉత్సవాలను ప్రారంభించి పద్య నాటకానికి సాంఘిక నాటకాలకు నాటికలకు పోటీలు నిర్వహించారు

ఇదంతా గతం. వర్తమాన పరిస్థితులను పరికిస్తే, ఆధునిక పద్య నాటక రంగం గురించి చెప్పవలసి వస్తే ఆంధ్రప్రదేశ్ లో నంది నాటకోత్సవ ప్రారంభానికి ముందు నంది నాటకోత్సవాలు ప్రారంభించిన తరువాత అని చెప్పవలసి ఉంటుంది. మొట్టమొదట 1998వ సంవత్సరంలో ప్రదర్శించిన నాటకాలకు 1999 లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ ద్వారా నంది నాటక ఉత్సవాలను ప్రారంభించి పద్య నాటకానికి సాంఘిక నాటకాలకు నాటికలకు పోటీలు నిర్వహించి సినిమాలకు ఇచ్చినట్లుగానే నంది అవార్డులు ఇవ్వడం మొదలుపెట్టారు. దీంతో నాటక రంగంలో ఒక కొత్త మార్పు మొదలైంది అని చెప్పవచ్చు. అంతవరకు ఆలాపనే ఆలంబనగా ఉత్సవ పందిళ్ళే ఊతగా గంటలు గంటలు సాగిన పద్య నాటకం నటనకు భావ ప్రదర్శనకు ప్రయోగాలకు ప్రాధాన్యత ఇవ్వడం ప్రారంభమైంది. నాటక ప్రదర్శనలకు ప్రథమ ద్వితీయ బహుమతులు ఇవ్వడమే కాక వ్యక్తిగత రంగాల్లో ఉత్తమ రచయిత, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ నటుడు, ఉత్తమ నటి, ఉత్తమ ప్రతినాయకుడు, ఉత్తమ సహాయ నటుడు, ఉత్తమ బాల నటుడు, ఉత్తమ హాస్యనటుడు, ఉత్తమ ఆహార్యం, ఉత్తమ సంగీతం, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ దీపాలంకరణ మొదలైన 14 రంగాలలో బహుమతులు ఏర్పాటు చేసి ఇవ్వడంతో ప్రతి ఒక్కరూ వారి వారి నైపుణ్యాన్ని పెంచుకోవడానికి ఆయా రంగాల కళాకారులు కృషి చేశారు. ప్రత్యేకంగా లబ్ద ప్రతిష్టులైన కళాకారులను న్యాయ నిర్ణేతలుగా నియమించి ఆంధ్ర దేశమంతటా తిరిగి ప్రాథమిక పరిశీలన నిర్వహించి వాటిలో పది నాటకాలు ఎంపిక చేసి మొట్టమొదటిసారి హైదరాబాదు రవీంద్రభారతిలో ప్రదర్శింపచేయడం జరిగింది. 1999లో

తిరుపతి శ్రీ శ్రీనివాస నృత్య కళాభారతి వాళ్లు నిర్మించిన "శ్రీనివాస కళ్యాణం", శ్రీ సాయి విజయ నాట్యమండలి సురభి వారి "శ్రీ షిరిడి సాయిబాబా మహత్యం" పద్య నాటకాలు ప్రథమ ద్వితీయ బహుమతులుగా బంగారు, వెండి నందులను గెలుచుకున్నాయి. అప్పటికి మార్కెట్లో పెద్దపెద్ద నటులుగా చలామణి అవుతున్న వారి నాటకాలు కొన్ని స్క్రీన్లోనే పోగా కొన్ని వేదికపై నిలబడలేక ఓడిపోవడం జరిగింది. దీనితో నటీనటుల్లోనూ, సంస్థల్లోనూ ఒక ప్రత్యేక పట్టుదల నంది అవార్డు సాధించాలని కోరిక కలిగిందని చెప్పవచ్చు. 1999 సంవత్సరంలో శ్రీ సత్య సాయి కళానికేతన్ హైదరాబాదు వారి "శ్రీకృష్ణతులాభారం" సవేరా ఆర్ట్స్ కడప వారి "శ్రీరామ వనవాసం" 2000 సంవత్సరంలో సంస్కార భారతి హైదరాబాద్ వారు నిర్మించిన "మహాకవి కాళిదాసు" శ్రీ విజయలక్ష్మి శ్రీనివాస నాట్యమండలి తెనాలి వారి "తిరుపతమ్మ కథ"

> **నటీనటుల్లోనూ, సంస్థల్లోనూ ఒక ప్రత్యేక పట్టుదల నంది అవార్డు సాధించాలని కోరిక**

2001లో శ్రీ మీరా కళాజ్యోత్స్న విశాఖపట్నం వారి "అశ్వత్థామ" విద్యానగర్ కల్చర్ అసోసియేషన్ హైదరాబాద్ వారి "శ్రీ నాథుడు" 2002 లో కళాతరంగిణి విశాఖపట్నం వారి "శ్రీకృష్ణాంజనేయ యుద్ధం", శ్రీ మీరా కళాజ్యోత్స్న విశాఖపట్నం వారి "గుణనిధి" 2003లో మీరా కళాజ్యోత్స్న విశాఖపట్నం వారి "చిరుతొండనంబి" యువ కళావాహిని హైదరాబాద్ వారి "రాణా ప్రతాప్", 2004లో సురభి కళ నాట్యమండలి హైదరాబాదు వారి "శశిరేఖా పరిణయం" విజేత ఆర్ట్స్ రాజంపేట వారి "భూయో భూయో నమామ్యహం", 2005 లో గంగోత్రి పెదకాకాని వారి "పల్నాటి భారతం", సవేరా ఆర్ట్స్ కడప వారి "వాసవి కన్యక", 2006లో సవేరా ఆర్ట్స్ కడప వారి "సతీ అహల్య", పూర్ణ శ్రీ నాట్య కళా సమితి తెనాలి వారి "శ్రీ వేమన యోగి", 2007లో పి అండ్ టి కల్చరల్ అసోసియేషన్ కాకినాడ వారి "భక్త పోతన", పల్లవి ఆర్ట్స్ ప్రొద్దుటూరు వారి "భీష్మ" నాటకాలు నంది అవార్డులు గెలుచుకున్నాయి. 2008లో డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్య మండలి విజయవాడ వారి "ప్రథమ స్వాతంత్ర్య మహాసంగ్రామం 1857" అప్పటివరకు జరిగిన నాటక రంగంలో ఒక అద్భుత ప్రయోగాన్ని ఆవిష్కరించినది.

60 మంది నటీనటులతో అనేక యుద్ధ సన్నివేశాలు వేదిక మీద ఆవిష్కృతం కావడం అబ్బురపరచినది. యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ కాకినాడ వారి "అల్లసాని పెద్దన" 2009లో వివేకానంద నగర్ కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి "విప్రనారాయణ", డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి "శ్రీ సాయిబాబా", నాట్యమండలి విజయవాడ వారు ప్రదర్శించిన "శ్రీ ఖడ్గతిక్కన", సుబ్బరాజు నాట్య కళాపరిషత్ తిరుపతి వారి "విరాట పాండవీయం", 2010లో సవేరా ఆర్ట్స్ కడప వారి "శ్రీరామ పట్టాభిషేకం", నవ క్రాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి "మహిషాసుర మర్దని", డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి "శ్రీ సాయిబాబా నాట్యమండలి ప్రదర్శించిన "ఉషా పరిణయం", 2011లో సావేరి సంస్కృతిక సంస్థ హైదరాబాదు వారి "వరూధిని", మిర్యాలగూడ సాంస్కృతిక కళా కేంద్రం వారి "రావణ", మయూరి నటనాలయం హైదరాబాదు వారి "వీరపల్నాడు", 2012లో లలిత కళా సమితి కర్నూలు వారి "బభ్రువాహన విజయం", హేలాపురి కల్చర్ అసోసియేషన్ ఏలూరు వారి "మహాసాధ్వి శకుంతల", శ్రీ శ్యామలాంబ ఫైన్ ఆర్ట్స్ అసోసియేషన్ విజయనగరం వారి "యామునాచార్య", 2013లో ది యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ కాకినాడ వారి "దేశమును ప్రేమించుమన్నా", శ్రీ సీతారామ నాట్యమండలి కాకినాడ వారి "నర్తనశాల", గంగోత్రి పెదకాకాని వారి "శ్రీ గురు రాఘవేంద్ర చరితం", 2014లో శ్రీ సాయి శ్రీనివాస కల్చరల్ అసోసియేషన్ విశాఖపట్నం వారి "విష్ణు సాయుధ్యం", టి జి వి కళాక్షేత్రం కర్నూలు వారి "శ్రీకృష్ణాభిమన్యు", నవ క్రాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి "భక్త ప్రహ్లాద", 2015 లో శ్రీ సాయి కళానికేతన్ వెల్ఫేర్ సొసైటీ విశాఖపట్నం వారి "భక్త ప్రహ్లాద", డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి "శ్రీసాయిబాబా" నాట్యమండలి విజయవాడ వారు ప్రదర్శించిన

"పృథ్వీరాజ్ రాసో", అలహాబాద్ క్రియేటివ్ థియేటర్ హైదరాబాద్ వారి "శ్రీకాళహస్తీశ్వర సాయుద్యం", 2016లో లలిత కళాపరిషత్ అనంతపురం వారి "సతీసావిత్రి", లలిత కళా సమితి కర్నూలు వారి "ప్రమీలార్జున పరిణయం", ఖమ్మం కల్చరల్ అసోసియేషన్ వారి "చాణక్య చంద్రగుప్త", 2017లో హేలాపురి కల్చర్ అసోసియేషన్ వారి "ఇంద్ర సింహాసనం", టీజీవి కళాకేంద్రం కర్నూలు వారి "సై సై నరసింహారెడ్డి", జేఎంజే నాట్యమండలి విజయవాడ వారి "రక్త పాశం", నాటకాలు నంది నాటకోత్సవాల్లో ఉత్తమ ప్రదర్శనలుగా నిలిచాయి. కరోనా కారణంగా 2018 నుండి నిలిచిపోయిన నంది నాటకోత్సవాలు తిరిగి 2022 సంవత్సరానికి గాను 2023లో జరిగాయి. అందులో సంస్కార భారతి ఆంధ్ర ప్రదేశ్ వారి 'శ్రీ మాధవ వర్మ' బంగారు నంది కైవసం చేసుకోగా 'యమునాచార్య', 'వసంత రాజీయం' ద్వితీయ తృతీయ బహుమతులను గెలుచుకున్నాయి. ఈ నంది నాటక ఉత్సవాలు పౌరాణిక చారిత్రాత్మక పద్య నాటకాలకు కొత్త ప్రేక్షకులను తీసుకుని రావడంలో కృతకృత్యం అయ్యాయని చెప్పవచ్చు. గతంలో ఈ నంది నాటక ఉత్సవాల్లో బహుమతులు గెలుపొందిన నాటకాలను ప్రభుత్వం స్వంత ఖర్చుతో ఆ సంవత్సరం అంతా ఒక్కొక్కరికి 10 ప్రదర్శనలు ఆంధ్రప్రదేశ్ లో వివిధ పరిషత్తుల సహకారంతో ఇప్పించడం జరిగింది. ఇది పద్య నాటక రంగ అభివృద్ధికి ప్రేక్షకాదరణకు దోహదం చేసిందని చెప్పవచ్చు.

కరోనా కారణంగా 2018 నుండి నిలిచిపోయిన నంది నాటకోత్సవాలు తిరిగి 2022 సంవత్సరానికి గాను 2023లో జరిగాయి

వివిధ నాటక పరిషత్తుల కళా సేవ :

ఈ నంది నాటకాల స్ఫూర్తితో, అంతకుమించిన పారితోషికాలతో, శ్రీ ఈదర హరిబాబు స్థాపించిన ఎన్టీఆర్ కళాపరిషత్ ఒంగోలు వారు "ఎన్టీఆర్ అవార్డ్స్", తిరుమల తిరుపతి దేవస్థానం యొక్క సహాయ సహకారాలతో శ్రీ వెంకటేశ్వర కళాపరిషత్ "గరుడ అవార్డు"లను నెలకొల్పి నంది నాటకోత్సవాలకు ధీటుగా పద్య నాటక ఉత్సవాలను నిర్వహించడం జరిగింది. వీటితో పాటు శ్రీ బియన్ రెడ్డి గారు స్థాపించిన అభినయ ఆర్ట్స్ తిరుపతి "హనుమ అవార్డ్స్", శ్రీకాళహస్తీశ్వర లలిత కళాపరిషత్ శ్రీకాళహస్తి వారు "నటరాజ అవార్డ్స్",

పాతకాలం రచయితల రచనలకు కాకుండా కొత్త రచనలకే బహుమతులు ఇవ్వడంతో కొత్త రచయితలు పుట్టుకొచ్చారు.

సుబ్బరాజు కళాపరిషత్ తిరుపతి వారు "అశ్వం అవార్డ్స్", గత సంవత్సరము నుండి శ్రీ బుర్ర సాయి మాధవ్ గారు "వీణ అవార్డ్స్" అనే పేర్లతో పద్య నాటక పరిషత్తులు స్థాపించి నిర్వహించడం జరుగుచున్నది. ఈ పరిషత్తుల ద్వారా పద్యనాటక నటులు మైకులు దగ్గర మూతి పెట్టి పాడే పరిస్థితి నుంచి బయటపడి నాటకీయతను మెరుగుపరుచుకోవడానికి అలవాటు పడ్డారు. గతంలో కేవలం హార్మోనిస్టులే పద్య నాటక దర్శకులుగా ఉండి పైన పేర్కొన్న అలనాటి పద్య నాటకాల్ని నేర్పించి ఆడించే పరిస్థితి నుంచి బయటపడి కొత్త దర్శకులు ఆవిర్భవించారు. శ్రీ డిఎస్ దీక్షిత్, శ్రీ దుగ్గిరాల సోమేశ్వరరావు, డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ పి వి ఎన్ కృష్ణ, శ్రీ తడకమళ్ళ రామచంద్రరావు, శ్రీ ఆలూరి వెంకటయ్య, శ్రీ సమైక్య భారతి సత్యనారాయణ, శ్రీ ప్రత్తి ఓబులయ్య, శ్రీ జి నారాయణస్వామి, శ్రీ కే కనకరాజు, శ్రీ చిట్టా శివప్రసాద్ మొదలైన దర్శకులు ప్రముఖులుగా ఆవిర్భవించారు. ఎండి కాజావలి, నాయుడు గోపి వంటి సాంఘిక నాటక దర్శకులు కూడా పద్యనాటకాలను డైరెక్ట్ చేసి బహుమతులు పొందారు.

ఇక రచన విభాగంలో పైన చెప్పబడిన పాతకాలం రచయితల రచనలకు కాకుండా కొత్త రచనలకే బహుమతులు ఇవ్వడంతో కొత్త రచయితలు పుట్టుకొచ్చారు. శ్రీ పల్లేటి లక్ష్మి, కుల శేఖర్, డాక్టర్ మీగడ రామలింగస్వామి, డాక్టర్ పివిఎన్ కృష్ణ, డాక్టర్ ఎం పురుషోత్తమాచార్య, శ్రీ బుర్ర సుబ్రహ్మణ్య శాస్త్రి, శ్రీ శారదా ప్రసన్న, శ్రీ తడకమళ్ళ రామచంద్రరావు, శ్రీ ఆకెళ్ళ, శ్రీ ఊటుకూరు సత్యనారాయణ, శ్రీ యార్లగడ్డ సౌమిత్రి , శ్రీ వి లక్ష్మీపతి వంటి పద్య నాటక రచయితలు కూడా ప్రదర్శన యోగ్యత కలిగిన అద్భుత పద్యనాటకాలను వ్రాసి రచయితలుగా బహుమతులు పొందారు.

ఉత్తమ నటులుగా శ్రీ గుమ్మడి గోపాలకృష్ణ, డాక్టర్ మీగడ రామలింగ స్వామి, శ్రీ పి.విజయ్ కుమార్, శ్రీ డిఎస్వి రావు, శ్రీ సుబ్బరాజు, శ్రీ టి రామచంద్రరావు, డాక్టర్ పి.వి.ఎన్.కృష్ణ, శ్రీ ఆచంట బాలాజీ నాయుడు, శ్రీ ఏ. వెంకటేశ్వరరావు, శ్రీ టీ బాబు రాజు, శ్రీ బి శివశంకర శాస్త్రి, శ్రీ వై

గంగాధర్, శ్రీ ఆర్ఎస్ భార్గవ, శ్రీ సాళ్వాచారి, శ్రీ జి శివనాగిరెడ్డి, శ్రీ టీవీ జై ప్రకాష్ రెడ్డి, శ్రీ నెల్లూరు శ్యామలరావు, శ్రీ ఎం. అర్జునరావు, శ్రీ కే. గణేష్ కుమార్, జి అంకయ్య , శ్రీ కే. బాల వెంకటేశ్వర్లు, శ్రీ ఎస్ నరసింహులు మొదలైన నటులు నాయకులుగా ప్రతి నాయకులుగా రాణించి బహుమతులు గెలుచుకున్న వారిలో ముఖ్యులు.

ఇవి అనేక గ్రాఫిక్ సినిమాలు చూసిన నేటి కాలం యువతరాన్ని ఆకట్టుకోలేక పోతున్నాయి.

పద్య నాటక రంగంలో అవసరమైన మార్పులు, నూతన ప్రయోగాలు :

1. సాంకేతికపరమైన మార్పులు ప్రయోగాలు

సుమారు 140 సంవత్సరాల క్రితం ప్రారంభమైన పద్య నాటకం నాటి నుండి నేటి వరకు ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఇప్పటికీ ప్రేక్షకులలో ఆదరణ పొందుతూ ఉండడానికి కారణం ఆయా కాలాలలో, ఆనాటి కాలమాన పరిస్థితులకు అనుగుణంగా రచయితలు, దర్శకులు, నటీనటులు సాంకేతిక నిపుణులు ఎంతో కృషి చేసిన మాట వాస్తవం. కానీ పద్య నాటక రంగంలో సాంకేతికంగా పెద్ద మార్పులు ఏమి చోటు చేసుకోలేదు. నాటి నుండి నేటి వరకు అవే గుడ్డల తెరలు (క్లాత్ కర్టెన్స్) వాడుతున్నారు. ఆనాటి నుంచి ఈనాటి వరకు సురభి వాళ్లు ఏ ట్రిక్కులైతే చేసి ప్రజలను మెప్పించారో – అనగా పక్షులు ఎగరడం, టపాకాయలు కాల్చడం వంటివి – అవే ట్రిక్కులు ఇప్పటికీ ఉపయోగిస్తున్నారు. ఇవి అనేక గ్రాఫిక్ సినిమాలు చూసిన నేటి కాలం యువతరాన్ని ఆకట్టుకోలేకపోతున్నాయి. రంగాలంకరణ దీపాలంకరణలో సాంకేతికంగా పెను మార్పులు రావలసిన అవసరం ఉన్నది. 2023 డిసెంబర్లో జరిగిన నంది నాటకోత్సవంలో డాక్టర్ రామన్ ఫౌండేషన్ వారి 'శ్రీ సాయి బాబా నాట్యమండలి' ఎల్ఈడి స్క్రీన్ తో విజ్ఞాన భారతం అనే నాటకాన్ని ప్రదర్శించి నాటక రంగంలో ఒక కొత్త ఒరవడికి తెర తీయడం జరిగింది. అంతేకాకుండా స్వాతంత్ర్య సంగ్రామం (పార్ట్ 1, పార్ట్ 2), 'జయహో శ్రీ ఛత్రపతి శివాజీ మహారాజ్' మొదలైన నాటకాలు పూర్తిగా ఎల్ఇడి స్క్రీన్ ఆధారంగా సాఫ్ట్వేర్ డిజైన్ చేసి అద్భుతమైన లొకేషన్స్, లైవ్ లైవ్ వీడియోలు ఎల్ఈడి స్క్రీన్ మీద

నడుపుతూ నాటకాన్ని ప్రదర్శించడం ద్వారా మనం ఆ కాలంలోనే ఉన్నాము అనే భావన ప్రేక్షకులలో కలిగించడం జరిగింది. ఇది ఖర్చుతో కూడుకున్న విషయమే అయినా వివిధ కాలేజీలలో మరియు నాగార్జున యూనివర్సిటీ, ఆంధ్ర యూనివర్సిటీ మొదలైన చోట్ల వేలమంది విద్యార్థుల సమక్షంలో విజయవంతంగా ప్రదర్శించగలిగారు. ఒక పద్య నాటకం అంత మంది యువతను మేధావులను అధ్యాపకులను మెప్పించడమే కాక సుమారు మూడు గంటలసేపు కదలకుండా కూర్చుని విద్యార్థులు చూసేటట్లుగా చేశారు. దీనికి కథ,కథనం దర్శకత్వం నటనతో పాటు ఈ సాంకేతిక పరిజ్ఞానం కూడా ఎంతో ఉపకరించిందని చెప్పక తప్పదు.

విమర్శ అనేది ఒక కళ గాని, సాహిత్యం గాని బ్రతికి ఉంది అని చెప్పడానికి ఉదాహరణ.

2. విమర్శనాత్మక మార్పులు, ఆవశ్యకత

విమర్శ అనేది ఒక కళ గాని, సాహిత్యం గాని బ్రతికి ఉంది అని చెప్పడానికి ఉదాహరణ. విమర్శ, ప్రతి విమర్శలు లేకపోతే ఆ కళను పట్టించుకునే వారు లేరు అని అర్థం. చరిత్రలోకి తొంగి చూచినా తెలుగు పద్య నాటక రంగంలో విమర్శ అనేది చాలా తక్కువ; దాదాపు మృగ్యం అని చెప్పవచ్చు. గతంలో కూడా విమర్శ అనేది నాటక శిల్ప విశ్లేషణ తోటే ఆగిపోయింది. పూర్వకాలంలో శ్రీ పురాణం సూరి శాస్త్రి, శ్రీ పసుమర్తి యజ్ఞ నారాయణ శాస్త్రి, శ్రీ ముట్నూరి కృష్ణారావు, శ్రీ భమిడిపాటి కామేశ్వరరావు మొదలగువారు ఈ రంగంలో చాలా కృషి చేశారు. కానీ అది అక్కడ తోటే ఆగిపోయింది. తర్వాత కాలంలో శ్రీ పోణంగి రామ అప్పారావు, శ్రీ కె వి గోపాలస్వామి, శ్రీ శ్రీనివాస చక్రవర్తి, మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి, నేతిపరమేశ్వర శాస్త్రి మొదలగువారు నాటక రంగ చరిత్రపై విమర్శ చేశారు. కానీ అది పరిమితం. ఏదైనా ఒక కళ ప్రాచుర్యం పొందాలంటే దానిమీద విమర్శలు ప్రతి విమర్శలు రావలసిన అవసరం ఉంది. వాటిని చదవడం ద్వారా ఆ కళారూపం చూడాలి అనే ఉత్సుకత ప్రేక్షకులకు కలుగుతుంది. అంతేకాకుండా తాము ఏదైనా తప్పు చేస్తే విమర్శకు గురి కావలసి వస్తుంది అనే భయం కళాకారులు లేదా నిర్వాహకులలో ఉన్నప్పుడు దాన్ని మరింత జాగ్రత్తగా తీర్చిదిద్దుకుంటారు.

> సినిమా రిలీజ్ కాగానే రివ్యూ రాసి రేటింగ్ ఇచ్చినట్లుగానే నాటక విమర్శకులు కూడా రివ్యూ రాసి రేటింగ్ ఇవ్వవచ్చు.

కానీ పద్య నాటకంలో ఈ కాలంలో విమర్శ, ప్రతి విమర్శలు లేకుండా పోయాయి. నాటకాన్ని ఎలా ప్రదర్శించినా కల్చరల్ రిపోర్టర్లు ఏ విధమైన విమర్శ చేయకుండా రెండు ఫోటోలు పేపర్ లో వేసి 'అద్భుతంగా ప్రదర్శించారు' అని వ్రాయడం తప్ప గుణ దోషాలను పరామర్శించడంలేదు. చాలామంది విలేకరులు అసలు నాటకం చూడటం లేదు. నిర్వాహకులు పంపించిన రెండు ముక్కలు పేపర్లో వేసి చేతులు దులుపుకుంటున్నారు. దానితో ఆ న్యూస్ పట్ల ఎవరికి ఆసక్తి ఉండటం లేదు. సాహిత్య రంగంలో తిరుపతి వెంకట కవులు కొప్పరపు కవులు వెంకట రామకృష్ణ కవులు మధ్య నడిచిన విమర్శలు, ప్రతి విమర్శలు కొంత హద్దులు మీరి ఇబ్బంది పెట్టినప్పటికీ ఆనాడు సాహిత్యం పట్ల ప్రతి ఒక్కడు ఆకర్షితుడు కావడానికి ఎంతో దోహదం చేశాయి. పూర్వకాలంలో పద్యనాటకాలను పండితుల నుండి పామరుల వరకు చూసేవారు. ముఖ్యంగా నటులలో ఎవరైనా పద్యాన్ని తప్పు పాడితే వన్స్ మోర్ కొట్టడం ద్వారా దాన్ని సరి చేసుకునే అవకాశం ఇచ్చేవారు. బాగా పాడితే మరొక్కసారి విని అభినందించడానికి కూడా వన్స్ మోర్ కొట్టేవారు. ఇది తర్వాత కాలంలో ఒక దుష్ట సంస్కృతికి దారి తీసింది. ప్రతి నటీనటుడు క్యాస్టింగ్ నాటకాలలో తన వర్గం వారిని కొంతమందిని పక్కన పెట్టుకొని వాళ్ల చేత వన్స్ మోర్లు కొట్టించుకుంటూ డబ్బులు చదివించుకుంటూ తను బాగా పాడుతున్నాడు అనిపించుకోవడానికి పాట్లు పడడం మొదలుపెట్టారు. దానివల్ల నాటక సన్నివేశం రసాన్ని కోల్పోయి రసాభాస జరుగుతుంది. వీటిని విమర్శకులు విమర్శించడం ద్వారా సజీవమైన నాటక రంగానికి ఒక ఆలంబన కావాలి. అలా అని విమర్శ దుమ్మెత్తిపోసేదిగా ఉండకూడదు. నాటకాన్ని చూసి విమర్శించాలి గాని చదివి విమర్శించకూడదు. అందులో ఉన్న గుణదోషాలను నిష్పక్షపాతంగా విశ్లేషించి ఎవరి మనోభావాలు గాయపడకుండా చేసిన విమర్శ సద్విమర్శ అవుతుంది. విమర్శ చేసిన వ్యక్తిపై విమర్శకు గురైన వాళ్ళు కోపాన్ని పెంచుకోకూడదు. అవసరమైతే దానిని ఖండిస్తూ ప్రతి విమర్శ చేయవచ్చు. సినిమా రిలీజ్ కాగానే రివ్యూ రాసి రేటింగ్ ఇచ్చినట్లుగానే నాటక విమర్శకులు కూడా రివ్యూ రాసి

రేటింగ్ ఇవ్వవచ్చు. ఈ కాలంలో శ్రీ ఆకుల మల్లేశ్వరరావు, పెన్మచ్చ శ్రీనివాసరాజు, శ్రీమతి శమంతకమణి, శ్రీ అడవి శంకర్రావు, శ్రీ కళాసాగర్ మొదలగువారు అప్పుడప్పుడు అక్కడక్కడ రివ్యూ రాయడం అంతో ఎంతో తృప్తి కలిగించే విషయం. మరిన్ని రివ్యూలు రావలసిన అవసరం ఉన్నది.

పాఠశాలల్లోనూ కళాశాలలోనూ ముఖ్యంగా తెలుగు పాఠాల్లో పద్య నాటకాన్ని ఒక పాఠ్యాంశంగా చేర్చాలి.

3. సంస్థాగత మార్పులు ఆవశ్యకత

సుమారు 140 సంవత్సరాల చరిత్ర కలిగిన తెలుగు పద్య నాటకం యువతకు దూరమై పోతోంది అని చెప్పక తప్పదు. పద్య నాటకం పునర్వైభవం పొందడానికి ప్రభుత్వాలు పరిషత్తులు వదాన్యులు కలిసికట్టుగా కృషి చేయవలసిన అవసరం ఉంది. ఆంధ్రదేశంలో ప్రస్తుతం పద్య నాటక పరిషత్తుల కొరత విపరీతంగా ఉంది. కేవలం నాలుగైదు పరిషత్తులు మాత్రమే పద్య నాటక పోటీలు నిర్వహించగలుగుతున్నాయి. వీటికోసం ప్రత్యేక కార్యాచరణ ద్వారా మరిన్ని పరిషత్తులు ప్రభుత్వ మరియు ప్రైవేట్ కళా సంస్థల సంయుక్త సహకారంలో ఏర్పాటు కావలసి ఉన్నది. అలాగే నాటక కళాకారులు కొత్త కొత్త ప్రయోగాల ద్వారా ఆధునిక సాంకేతికను ఉపయోగించుకుని నేటి యువతకు నచ్చే విధంగా పద్య నాటకాలను రూపొందించుకొనవలసిన అవసరం ఉన్నది. ఆధునిక నాటకాలు ప్రదర్శించడానికి తగిన వేదికలు ప్రతి పట్టణంలోనూ ఏర్పాటు కావలసిన అవసరం ఉన్నది. అలాగే పాఠశాలల్లోనూ కళాశాలలోనూ ముఖ్యంగా తెలుగు పాఠాల్లో పద్య నాటకాన్ని ఒక పాఠ్యాంశంగా చేర్చాలి. పిల్లలచే పద్యనాటకాలను ఆడించి వాటి పట్ల అభినివేశాన్ని కల్పించాలి. అలాగే చిన్న పిల్లలు ఆడడానికి వీలుగా చిన్న చిన్న పద్యనాటికలు రచించి పిల్లలకు అందజేయాలి. ముఖ్యంగా పాఠశాలలోను మరియు కళాశాలలోనూ తెలుగు పండితులు మరియు ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్ టీచర్లు కలిసి ఈ పద్య నాటికలు పిల్లల చేత ప్రదర్శింప చేయడానికి కృషి చేయాలి.

4. ప్రభుత్వపరంగా విధానపరమైన మార్పులు, ఆవశ్యకత

నంది నాటకోత్సవాలను ప్రభుత్వాలు క్రమం తప్పకుండా నిర్వహించాలి. ఇటీవల వాటిలో పిల్లల నాటికలు కళాశాల యువ నాటికలు ప్రవేశపెట్టారు సంతోషం. కానీ పెద్దల విభాగంలో నాటకాలు, పద్య నాటకాలు వేర్వేరుగా పోటీలు పెడుతున్నారు. కానీ చిన్నపిల్లల విభాగంలో ఈ విభజన లేదు. దానివలన పిల్లలకు పద్య నాటకాలు నేర్చుకునే అవసరం అవకాశం లేకుండా పోతున్నాయి. కాబట్టి పిల్లల మరియు కళాశాల విభాగంలో కూడా పద్య నాటికలు సాంఘిక నాటికల విభజన చేసి పద్యనాటికలు ప్రత్యేకంగా నిర్వహించడం ద్వారా పిల్లల్లో పద్యనాటకం పట్ల అభిరుచిని కలిగించవచ్చు. అలాగే పద్యనాటకానికి రచయితల కొరత విపరీతంగా ఉంది. కాబట్టి ప్రతి సంవత్సరం పద్య నాటక రచనల పోటీలను కూడా ప్రవేశపెట్టి నిర్వహించడం ద్వారా ఎక్కువ మంది రచయితలు ఈ పద్య నాటకం వైపు రావడానికి అవకాశం ఉంటుంది. అలాగే పద్య నాటకాలు ప్రదర్శించడానికి తగిన వేదికల కొరత చాలా ఉంది. పల్లెటూర్లలో రెండు ట్రాక్టర్లు లేదా నాలుగు ఎడ్ల బళ్ళు ఒకదానికి ఒకటి కలిపి కట్టి వేదికగా తయారుచేసి నాటకాలు ఆడే (పాడే) పరిస్థితి ఉంది. ఈ పరిస్థితి పోవాలంటే కనీసం ప్రతి మండల హెడ్ క్వార్టర్ లోను నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలతో పాటు విధిగా కళావేదిక కూడా నిర్మితం కావలసిన అవసరం ఉంది. అలాగే జిల్లా పరిషత్ హైస్కూల్లో గతంలో జిల్లాస్థాయి సాంగ్ అండ్ డ్రామా కాంపిటేషన్ నిర్వహించబడేది. కాలక్రమేణ ఇది పోవడంతో విద్యార్థులు కళలకు దూరమైపోయారు. ఈ పోటీని పునరుద్ధరించవలసిన అవసరం ఉన్నది.

> ప్రతి మండల హెడ్ క్వార్టర్ లోను నిర్మించే ప్రభుత్వ కార్యాలయాలతో పాటు విధిగా కళావేదిక కూడా నిర్మితం కావలసిన అవసరం ఉంది.

5. ప్రదర్శన పరమైన మార్పులు

సినిమాలు, టీవీ సీరియల్స్ ఎంత గొప్పగా వచ్చినా ప్రత్యక్షంగా ఒక నాటకాన్ని చూసిన ఆనందాన్ని అనుభూతిని కలిగించలేవు. మంచి స్పందన

కలిగించే నాటకాన్ని చూడ్డానికి ప్రజలు ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. వారిని స్పందింపజేసే స్థాయిలో మన నాటకం ఉండేలా కళాకారులు కళా సంస్థలు కూడా ప్రయత్నం చేయాలి.

పద్య నాటక రంగంలో నటీనటుల కొరత వల్ల వయసుకు తగని పాత్రలు వేయటం పరిపాటి గా మారిపోయింది.

చాలామంది గొప్పగా పాడగలరు కానీ నటించలేరు. మరికొందరు గొప్పగా నటించగలరు కానీ పాడలేరు. ఈ రంగంలో ఆధునిక సాంకేతికతను ఉపయోగించుకొని చక్కగా పద్యాలను పాడి రికార్డ్ చేసిన నాటకాలను యువత మరియు విద్యార్థులు ప్రాథమిక స్థాయిలో సాధన చేయడానికి ఉపయోగించవచ్చు. అలాగే పద్యనాటకానికి ప్రాణం హార్మోనియం. ఈ హార్మోనియం వాయించే కళాకారుల కొరత చాలా ఉంది. భవిష్యత్తులో కూడా విపరీతంగా పెరుగుతుంది. హార్మోనియం అంతరించిపోకుండా చూసుకోవాలి. కానీ అదే సమయంలో కీబోర్డ్ వైలెన్ మొదలైన ఇతర వాద్య పరికరాల సహాయం రీ రికార్డింగ్ కు తీసుకోవాలి సాంఘిక నాటక రంగంలో ఈ కీబోర్డు ద్వారా సంగీతాన్ని సమకూర్చుకోవడం జరుగుతుంది కానీ పద్య నాటకంలో చాలామంది ఇప్పటికీ కీబోర్డును వాడటం లేదు. కేవలం హార్మోనియం మాత్రమే వాడుతున్నారు పద్యాలకు హార్మోనియం అత్యంత ఆవశ్యకం అయినా దానితోపాటు కీబోర్డును కూడా ఉపయోగించుకోవడం ద్వారా మరింత భావయుక్తమైన సంగీతాన్ని సమకూర్చవచ్చు. పద్యనాటకం ఒక సమాహార కళ ఇందులో సంగీతం సాహిత్యం నృత్యం శిల్పం చిత్రలేఖనం అన్నీ ఉపయోగించుకోవచ్చు. వాటిని ఉపయోగించుకోవడం తెలియాలి. పద్య నాటక రంగంలో నటీనటుల కొరత వల్ల వయసుకు తగని పాత్రలు వేయటం పరిపాటి గా మారిపోయింది. యుద్ధాలు గాని నృత్యాలు గాని వేదిక మీద చేసేటప్పుడు ఆయా కళల లో నిష్ణాతులైన వారిని ఉపయోగించుకోవాలి. అంతే కాకుండా పద్యాలు పాడగలిగిన వాళ్ళని ఎంపిక చేయాలి. పాత్రోచితమైన నృత్యాలు యుద్ధాలు చేయించడం ద్వారా పద్య నాటకం మరింత ఉద్దీపన చెంది ప్రేక్షకులకు చేరుతుంది.

6) ప్రాధాన్యత మార్పు ఆవశ్యకత

ఏదైనా ఒక రంగానికి ప్రభుత్వం ఇచ్చే ప్రాధాన్యత ఆధారంగా ఆ రంగ అభివృద్ధి ఉంటుంది. ప్రస్తుతం పర్యాటక రంగానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. పర్యాటక రంగంలో ఆంధ్రదేశంలో ప్రధానమైనది తీర్థయాత్రలు (టెంపుల్ టూరిజం) మాత్రమే. తీర్థయాత్రకు వెళ్లిన వ్యక్తి అక్కడ స్థానిక దేవాలయ చరిత్రను కానీ పురాణ ప్రసిద్ధమైన నాటకాన్ని గాని చూచి వచ్చేలా ప్రధాన దేవాలయాలు ఏర్పాట్లు చేయాలి. దాని ద్వారా మన కళల యొక్క మరియు సంస్కృతి యొక్క గొప్పతనం పర్యాటకులకు తెలుస్తుంది. టూరిజం కూడా అభివృద్ధి చెందుతుంది. అంతేకాకుండా ప్రతి పండుగలోనూ దేవాలయ ఉత్సవాలలోనూ పురాణ గాథలను ప్రత్యక్షంగా చూపించే పౌరాణిక పద్య నాటకాలను విరివిగా ఆడించే ప్రక్రియను చేపట్టడం ద్వారా పద్య నాటకాన్ని అజరామరంగా కొనసాగించవచ్చు.

"పారదర్శకమైన నిర్బంధాలే
అక్వేరియంలో చేపకు
జీవితంలో మనిషికి"

"బల్లికి చిక్కిన పురుగు
ఓటమి తప్పదని తెలిసినా పోరాటం
ఆపలేదు"

"సుడిగాలి-
కొమ్మని ఊపేస్తున్నానని
పిట్ట గర్విస్తోంది"

– డా. పెన్నా శివరామకృష్ణ

మానవ రుగ్మతల చికిత్సకు అవసరమైన ఔషధీయ చికిత్సా విధానాలు - 1988 సంవత్సరపు నోబెల్ పరిశోధన

డా. చాగంటి కృష్ణ కుమారి
98851 63304

1988 సంవత్సరపు వైద్యశాస్త్ర విభాగానికి చెందిన నోబెల్ బహుమతి ముగ్గురికి లభించింది. ఈ ముప్పావురూ కూడా విద్యాసంస్థలకు చెందినవారుకారు; ఔషధ పరిశ్రమలలో పనిచేస్తూ పరిశోధన చేసినవారే!

ఆ ముగ్గురు ఎవరంటే



Sir James W. Black
జేమ్స్ బ్లాక్

Gertrude B. Elion
గ్రెట్రూడ్ ఇలియాన్



George H. Hitchings
జార్జ్ హిచింగ్స్

వీరు తాము కనుగొన్న చికిత్సావిధానాల సూత్రాలననుసరిస్తూ పలు రోగాలకు ప్రభావవంతమైన మందులను కూడా కనుగొన్నారు. కానీ, వీరి ఔషధీయ చికిత్సా విధానాల సూత్రాలకు గల ప్రాముఖ్యత బాగా విస్తారమైనది కావటంవల్ల, మార్గదర్శకాలుగా నిలిచాయి కనుక చికిత్సావిధానాల ఆవిష్కరణకే 1988లో నోబెల్ ని ప్రదానంచేసారు. పురస్కారాన్ని ముగ్గురూ 1/3 వంతు చొప్పున పంచుకొన్నారు.

ఈ విధానాలు కనుగొనక పూర్వము సహజంగా లభించే రసాయనాల అణువుల సంఘటనలో (Composition) మార్పులు చేసి మందులు తయారు చేయడానికి ప్రయత్నించేవారు. ఈ ప్రయత్నాలలో సరియైన మందు తయారు కావచ్చు, కాకపోవచ్చు ! కాకపోతే మళ్ళీ మరో ప్రయత్నం! ఇది "యత్నదోష పద్ధతి". అలా కాకుండా, హేతుబద్ధమైన ఔషధ రూపకల్పన పద్ధతిని వీరు అవలంబించదలిచారు.

వీరి హేతుబద్ధ యోచనలేమిటో వాటిని ఎలా అమలు పరుస్తూ మందులు తయారు చేయగలిగారో క్లుప్తంగా తెలుసుకొందికి ప్రయత్నిద్దాం.

జేమ్స్ బ్లాక్ పరిశోధన : అతను రూపొందించిన మందులు

సర్ జేమ్స్ బ్లాక్: నోబెల్ బహుమతి గెలుచుకున్న మార్గదర్శక స్కాటిష్ శాస్త్రవేత్త

1958లో జేమ్స్ బ్లాక్ ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ICI)లో చేరారు. అక్కడ పని చేస్తూండగా జేమ్స్ బ్లాక్ శారీరక ప్రక్రియల సంవిధానాలను (physiological mechanisms) క్షుణ్ణంగా అధ్యయనంచేసాడు.

కణ ఉపరితలంపైనా, కణ ఉపరితల గ్రాహకాలపైనా బాగా దృష్టి సారించాడు వాటిని బాగా అర్థంచేసుకున్నవాడిగా పేరు పొందాడు. కణ ఉపరితలగ్రాహకాలు మానవ జీవకణపు ఉపరితలంపైనున్న నిర్మాణాలు. ఇవి ప్రోటీనులు అనే తెగకు చెందిన రసాయనాలు.

జీవరసాయన ప్రతిస్పందనలను కలుగచేసే స్థానాలు ఇవే!. ఉదాహరణకి ఈ కింది పటములో ఒక కణ ఉపరితల గ్రాహకము పై వైరస్ చేరడాన్ని చూడండి. ఈ రకమైన చేరిక అవాంఛనీయ ప్రతిస్పందనలకు కారణమవుతుంది.



Illustration taken from: https://thenativeantigencompany.com/cellular-receptors-for-viral-entry

కణ ఉపరితలంపైనా, కణ ఉపరితల గ్రాహకాలపైనా బాగా దృష్టి సారించాడు కనకనే జేమ్స్ బ్లాక్ ఈ దిగువనిచ్చిన అనారోగ్య పరిస్థితులకు అనువైన మందులను రూపొందించగలిగాడు.

* ఆక్సిజన్ అందక గుండె కండరాలు నష్టపోయే పరిస్థితి – angina pectoris:
* గుండె పోటు – heart attack
* అత్యధిక రక్తపోటు – high blood pressure
* ద్వాదశాంగుళంలోనూ (చిన్నప్రేగు మొదటి భాగం –సుమారుగా 12 అంగుళాలు వుంటుంది), జీర్ణాశయములోనూ ఏర్పడే పుండ్లు – peptic ulcers

ప్రొపానొలోల్ హైడ్రోక్లోరైడ్ ఔషధ రూప కల్పన

మన శరీరంలో జరిగే చాలా ప్రక్రియలను హార్మోనులు అదుపుచేస్తూ వుంటాయి. వీటిని కణపరితలంపై నున్న కణ గ్రాహకాలు శోషించు (absorb) కొని హార్మోన్లు కలుగచేసే ప్రతిస్పందనలకు మధ్యవర్తిత్వం వహిస్తాయి.

Raymond Perry Ahlquist
(1914 – 1983)

శారీరక ప్రక్రియలపై అడ్రనలీన్ అనే సహజ హార్మోను కలుగచేసే ప్రభావాలకు రెండురకాల గ్రాహకాలు మధ్యవర్తిత్వాలుగా వ్యవహరిస్తాయని --- అవి ఆల్ఫా, బీటా గ్రాహకాలనీ ఆలక్విష్ట్ (R.P. Ahlquist) అదివరలో చెప్పివున్నాడు. జేమ్స్ బ్లాక్ తన పరిశోధనకు ఈ విషయాన్ని ప్రాతిపదికగా తీసుకొన్నాడు .

అడ్రినలిన్ (adrenaline) హార్మోనును "పోరాడు లేదా పలాయనం చిత్తగించు" (fight or flight) హార్మోను గా వర్ణిస్తారు. అత్యవసర హార్మోను అనికూడా అంటారు. ఇది మన గుండెకాయ బాగా కష్ట పడుతూ రక్తాన్ని తోడుకు పొయేలా చేస్తుంది. ఉదాహరణకి మనలను ఎవరైనా తరుముతున్నారనుకొన్నప్పుడు భయంతో పరుగు పెడితే గుండె వేగంగా కొట్టుకొంటుందికదా, ఫలితంగా రక్తపోటు పెరుగుతుంది. కానీ అధిక గుండెపోటు ఒక రోగంగా వున్నప్పుడు దాని చికిత్స అవసరంవుతుంది. అప్పుడు అడ్రినలిన్ (Adrenaline) హార్మోన్ యొక్క ప్రభావాలను నిరోధించే మందు అడ్రినలిన్ గ్రహకము యొక్క అవాంఛనీయ ప్రతిచర్యను అడ్డగించేదిగా రూపొందించాలి. ఈ దిశగా ఉద్దేశ్యపూర్వకంగా కృషి చేసి జేమ్స్ బ్లాక్ ప్రొపానొలోల్ హైడ్రోక్లోరైడ్ మందును తయారు చేసాడు. ఇది అడ్రినలిన్, నోరడ్రినలిన్ల గ్రాహక స్థానాలను మూసి వేయడం ద్వరా వాటి ప్రతిచర్యలను నిరోధిస్తుంది. ఫలితంగా అధిక రక్తపోటు తగ్గుతుంది. గుండె కండరాలు నష్టపోయే పరిస్థితిని దాటించి అనగా అవసరానికి మించిన ఆక్సిజన్ గుండెకు చేరకుండా చేసి గుండె కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. బీటా గ్రాహకస్థానాలను మూసివేసే మందులను బీటా అడ్డగింతలు (Beta blockers) అంటారు.



Propranolol $C_{16}H_{21}NO_2$

1964 లో ఈ మందు ఇండిరాల్ (Inderal) అని పిలువబడె విక్రేత ఉత్పత్తి నామం (brand name) తో వాడుకలోకి వచ్చింది. ప్రొపానొలోల్ హైడ్రోక్లోరైడ్ గుండె కి సంబంధించిన రుగ్మతలైన --- ఆక్సిజన్ అందక గుండె కండరాలు నష్టపోయే పరిస్థితి, గుండె పోటు, అత్యధిక రక్తపోటు, అసాధారణమైన లయతో గుండె కొట్టుకోవడము (abnormal heart rhythm), ఒకానొక రకానికి చెందిన తీవ్రమైన తలనొప్పి (migraine) చికిత్సలకు ప్రభావవంతమైన మందుగా చెలామణీలోవుంది. గుండెపోటుతో మరణించేవారి సంఖ్యకూడా ఈ మందు వాడకంవల్ల బాగా తగ్గినట్టు కొన్ని పరిశీలనలు చెప్పేయి .

హిస్టమిన్ హార్మోన్ పై పరిశోధన, సిమిటిడిన్(cimetidine)మందు రూపొందించుట:

ఈ విజయం తరువాత 1964లో ఇంపీరియల్ కెమికల్ ఇండస్ట్రీస్ (ICI) నుండి ఉద్యోగాన్ని విరమించి అమెరికా లోని Smith, Kline & French మందుల కంపెనీలో జేమ్స్ బ్లాక్ చేరాడు. అడ్రినలిన్ పై చేసిన పరిశోధనలో గడించిన అనుభవంతో హిస్టమిన్ హార్మోన్ (hhistamine)పై పరిశోధన ప్రారంభించాడు.

కొన్ని రకాల పదార్థాలు మనకు వికటిస్తాయి. అనగా వాటివల్ల మనశరీరంలో ప్రతికూల స్పందనలు వస్తాయి. ఉదాహరణకి పుప్పొడి, ధూళి వంటివి కొందరికి పడకపోవచ్చు. అప్పుడు వారికి ముక్కు కారడం, తుమ్ములు,

దురద, చర్మం పై దద్దుర్లు, కన్ను, ముక్కుల శ్లేష్మ పొరలు ఎర్రబడడం మొదలైన ప్రతిస్పందన ఫలితాలు కనపడతాయి. కొన్ని రకాల పూల పుప్పొడి, ఎండుగడ్డిల నుండి లేచే ధూళి వల్ల గవత జ్వరం(hay fever) వస్తుంది. ఈ రకానికి చెందిన ప్రతిస్పందనను వికటత్వము (allergyy)అంటాము. వికటత్వములో హిస్టమిన్ హార్మోన్ ఎక్కువగా ఊరుతుంది.

కడుపులో జఠర రసము (gastric juice) బాగా ఎక్కువగా ఊరినప్పుడు ద్వాదశాంగుళంలోనూ, జీర్ణాశయములోనూ పుండ్లు(peptic ulcers) ఏర్పడతాయి. జఠర రసాలను ఊరించే హార్మోను కూడా హిస్టమిన్ హార్మోనే! వికటత్వ నివారణకి వాడే ఔషధం కడుపులో ఏర్పడే పుండ్లకు పని చేయదు. ఇది గమనించిన బ్లాక్ రెండు రకాల కణ గ్రాహకాలు హిస్టమిన్ న్ను బంధిస్తాయని ఊహించాడు. ఒకటి శ్వాసకోశ మార్గాలలో (respiratory passages) మరొక కణ గ్రాహకం జీర్ణకోశ గోడ పుడుగునా (cells lining the gut wall) వుంటుంది.వీటిని H1 గ్రాహకము H2 గ్రాహకము (H 1-receptors H2-receptor)ల ని అన్నాడు. వికటత్వ నిరోధానికి వాడే మందులు కేవలము H1 గ్రాహకమును మాత్రమే అడ్డగిస్తాయి. 1972 నాటికి బ్లాక్, అతని సహచరులు జీర్ణకోశ గోడ హిస్టమిన్ గ్రాహక లక్షణం శ్వాసకోశ మార్గ హిస్తమిన్ గ్రాహకం కంటె భిన్నమైన లక్షణం గలదని అధికారికంగా ప్రతిపాదించారు. 1975లో పుండునిరోధక మందు సిమిటిడిన్(cimetidine) ను రూపొందించారు. సిమిటిడిన్ మందు హిస్టమిన్ H2 గ్రాహకమును అడ్డుకొంటుంది. ఈ గ్రాహకమే అధికంగా జఠరరసం ఊరడానికి కారణం.ఈ మందు హిస్టమిన్ H2 గ్రాహకానికి అడ్డగింతగా పనిచేయడంవల్ల కడుపులోని జఠరరసం తగ్గుతుంది.



Cimetidine, $C_{10}H_{16}N_6S$

1977నుండి ఈ మందు టగమెట్ (Tagamet) అనే విక్రేత ఉత్పత్తి నామంతో విజయవంతంగా వాడుకలోకి వచ్చింది.

గ్రెట్రూడ్ ఇలియాన్, జార్జ్ హిచింగ్స్‌ల పరిశోధన

1944లో బూరోస్ వెల్కమ్ ఫార్మసూటికల్ కంపెనీ లో (Burroughs Wellcome & Co pharmaceutical company) జార్జ్ హిచింగ్స్ దగ్గర గ్రెట్రూడ్ ఇలియాన్ చేరింది. వీరువురూ 40 సంవత్సరాలపాటు కలసి పరిశోధనలను నిర్వహించారు. గ్రెట్రూడ్ 125 పరిశోధనాపత్రాలను ప్రచురించింది.

ఈ జంట శాస్త్రవేత్తలు కేంద్రక ఆమ్లాల జీవక్రియలో ప్యూరీనల పాత్రను అధ్యయనం చేసారు. బ్యాక్టీరియా కణాలు DNA ను తయారుచేసుకోవడానికి నిశ్చిత మైన ప్యూరీన లే అవసరమవుతున్నాయని తెలియవచ్చింది. ఈ అధ్యయనంలో వీరిద్దరూ సాధారణ మానవ జీవకణాలను, కాన్సర్, ప్రోటోజోవా, బ్యాక్టీరియా, వైరస్ కణాల తో పోల్చి చూడడం మొదలు పెట్టేరు. రకరకాల కణాలలో న్యూక్లిక్ ఆమ్లాలు జీవక్రియలను జరుపుకొనడంలోని తేడాలను తెలుసుకోవాలన్నది వారి పరిశోధన లక్ష్యం. ఏదో యత్నదోష పద్ధతిలో రోగాలకు మందులను కనుగొనడం కాదూ, హేతుబద్ధ మైన యోచనను వాడుతూ రోగానికి తగ్గ మందును సృజించాలని వారి యోచన. మనుషులకూ, వ్యాధికారక జీవులకు గల తేడా తెలిసినప్పుడు ప్రత్యేకించి ఒకానొక రోగానికి చికిత్సచేయగల సరికొత్త ఔషధాణువు సృజన విజయవంతమవగలదు. మానవ జీవ కణాలకు హాని చేయకుండా, వ్యాధి కారక జీవకణాలను నాశనము చేయగల మందులను వీరు కనుగొన్నారు .

తెల్ల రక్త కణాల క్యాన్సర్ - లుకోమియా

ఇలియాన్ ప్రధాన మైన ఆవిష్కరణ 1950 లో 32 వయసులో వుండగా చేయగలిగింది. హిచ్చింగ్స్ ఆమెను ప్యూరీన్ లపై పరిశోధన చేయమని చెప్పాడు. ప్యూరీన్ తెగకు చెందిన సమ్మేళనము అయిన 6-mercaptopurine, (6-MP) మందును ఆమె తయారు చెసింది. ఇది లుకేమియా కణాలు ఏర్పడడంలో జోక్యం కలిగించు కొనడంద్వరా తెల్ల రక్త కణాల క్యాన్సర్ అయిన లుకోమియాను నిరోధించ కలిగింది.



ఆరోజులలో లుకోమియా కాన్సర్ వ్యాధి తో చాలామంది చిన్నపిల్లలు చనిపోయేవారు. అందువల్ల హుటాహుటిన ఈ మందును అంగటిలో పెట్టేరు. కానీ దీని ప్రభావము తాత్కాలికమని తెలిసిరావడంతో, ఇలియాన్ ఎక్కువ కాలంపాటు పని చేసే మరొక మందు thioguanine తయారు చేసింది. 6-MP లేదా thioguanine ను ఇతర మందులతో కలిపి ఇచ్చినప్పుడు లుకేమియాపై ఎక్కువ ప్రభావంతంగా పని చేస్తుందని చికిత్స చేసిన వైద్యులు తమ అనుభవాన్ని పంచుకున్నారు.

శరీరంలో యూరిక్ యాసిడ్ ఎక్కువగా పేరుకుపోయినప్పుడు గౌట్, అనగా కీళ్ల వ్యాధి వస్తుంది. ఈ పరిస్థితి కాన్సర్ రోగులకు ప్రాణాంతకము. కాగలదు. ఇలియాన్ : allopurinol (C5H4N4O) ను సృజించింది. ఇది శరీరము యూరిక్ ఆమ్లాన్ని అధికంగా తయారుచేయడాన్ని అడ్డుకొంటుంది. అలా కీళ్ల వ్యాధికి మందుగా పనిచేస్తుంది.



allopurinol

సర్పి వైరస్ లు(herpes virus)

ఇలియాన్ ఆమె సహపరిశోధకులు వైరస్సులకు ప్రతికూల క్రియాశీలతను చూపే ప్యూరీన్ ల పై తన దృష్టి సారించి, అరాబినోసిల్ డై అమినో ప్యూరీన్(arabinosyl diamino purine) సమ్మేళనంలో గల పార్శ్వ మాళికలను మార్చి ఒక కొత్త రసాయన సమ్మేళనము acyclovir ఏర్పరిచారు. ఇది సర్పి వైరస్ లు(herpes virus) శరీరంలో వృద్ధి చెందకుండా అడ్డుకోగలిగే మందుగా నిరూపించగలిగారు.



acyclo guanosine, also known as acyclovir (Zovirax) molecule

సర్పి వైరస్సు వల్ల వచ్చే అంటు వ్యాధికి ఒక ఉదాహరణ



ఆటాలమ్మ (Chickenpox), వరిసెల్లా–జోస్టర్ వైరస్ (VZV) లకు కూడా ఈ మందు పనిచేసింది.ఈ పరిశోధన వల్ల ఒకానొక రోగ తెగకు ప్రత్యేకించి ఒకానొక మందు పదార్థం పనిచేస్తుందన్న సంగతి తేటతెల్లమయింది. ఈ ఆవిష్కరణతో వైరల్ నిరోధ చికిత్సావిధానాల సరికొత్త యుగం అరంభమైంది. ఏడ్స్ రోగ చికిత్సకి అజైడో థైమిడీన్ / జిడోవిడీన్ తయారైంది,

అజిథైపీన్ azathioprine(AZA) అనె మరో మందును ఎలియన్ సృజించింది దీని వ్యాపారనామము ఇమ్యురాన్ .శరీరంలోని పాడైపోయిన కిడ్నీల స్థానంలో వాటిని తొలగించి కొత్తవాటిని అమర్చినప్పుడు అందుకు



అజిథైపీన్
azathioprine(AZA)

శరీరం సమ్మతించేలా ఇమ్యురాన్ పని చేసింది. ఈ విధంగా ఎలియాన్, హిచ్చింగ్స్ ల పరిశోధనా ఫలితాలు పెద్ద విప్లవాన్ని తీసికొచ్చి అనేక మందులను వారే రూపొందించడానికి దారితీసాయి.

వివిధ అనారోగ్య పరిస్థితులైన తెల్ల రక్త కణాల క్యాన్సర్ leukemia,అవయవ మార్పిడిని శరీరం తిరస్కరించడం rejection of transplanted organs,కీళ్ల వ్యాధి gout, మలేరియా malaria,బ్యాక్టీరియాలు,వైరస్సుల వల్ల వచ్చే అంటువ్యాధులు bacterial and viral infections కి ప్రభావంతమైన మందులు వాడుకలోకి వచ్చాయి.

1988లో నోబెల్ కమిటి వారు వీరికి బహుమతిని అందజేస్తూ , వీరి కనుగొన్న ప్రతీ ఒక్క మందు నోబెల్ కి అర్హమైనదే! అనడం వీరి పరిశోధనాల ప్రాముఖ్యతని తెలియచేస్తుంది.

★★★

References:

https://www.nobelprize.org/prizes/medicine/1988/summary/

https://www.nobelprize.org/prizes/medicine/1988/press-release/

https://www.science.org/doi/10.1126/science.3051384

https://garfield.library.upenn.edu/essays/v12p201y1989.pdf

https://pubmed.ncbi.nlm.nih.gov/3051384/

Gertrude B. Elion." National Academy of Sciences. 2000. Biographical Memoirs: Volume 78

ప్రత్యేక విభాగం

హైకూ కవిత

హైకూ కవిత- లక్షణాలు, నిర్మాణ వైవిధ్యం

డా. తలతోటి పృథ్విరాజ్
8074004711

తెలుగు సాహిత్యంలో ఛందస్సుతో కూడిన పద్య కవిత్వం సంప్రదాయ సాహిత్యంగా మనకు ఎంత ప్రాచీనమో, ప్రసిద్ధమో.... జపాన్ దేశంలోనూ రాచరిక కాలంనుండి రాజులచే ప్రోత్సహింపబడుతూ, ఆ దేశంలో అనేకమంది కవులచేత అనుసరింపబడుతూ, ఆదరించబడుతూ, నేడు దేశ దేశాలలో, అనేక భాషలలో అనుసరింపబడుతూ, ప్రపంచ కవితా ప్రక్రియగా గుర్తింపు పొందినదే హైకూ ప్రక్రియ.

(అ) హైకూ కవి లక్షణాలు:

హైకూ ప్రపంచ కవితా ప్రక్రియ. అతి ప్రాచీన కవితా ప్రక్రియ. నిజమైన హైకూ కవి నిరంతరం హైకూలు రాస్తూనే ఉంటాడు. హైకూ కవి అనిపించుకోడానికీ, హైకూ పుస్తకాలు వేసుకోవడానికి కొన్ని హైకూలు రాసి మౌనం వహించరు. ఎందుకంటే ప్రకృతి ప్రేమికులే హైకూ కవులు. ప్రకృతిని ఎవరూ పార్ట్ టైంగా ప్రేమించరు. హైకూ కవి నిరంతరం ప్రకృతి నుంచి అనుభూతి పొందుతాడు. పొందిన అనుభూతితో హైకూలు రాస్తాడు. వివిధ కవులచే రాయబడుతున్న హైకూలపై అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంటాడు. విమర్శకునిగా హైకూలను విశ్లేషిస్తాడు. వ్యాసకర్తగా హైకూలపై వ్యాసాలు రాస్తాడు. హైకూ చరిత్ర, పరిణామ క్రమ వికాసాన్ని అధ్యయనం చేస్తాడు.

జపనీయ ప్రాచీన హైకూ కవులను అధ్యయనం చేశాక నాకు తెలిసిన విషయం చెప్పాలంటే–నిజమైన హైకూ కవి అయి ఉంటే.... ఆతను చనిపోయే ముందు రాసిన చివరి కవిత కూడా హైకూనే అయివుంటుంది. బాషో, మసోక షికీ, అరాయు షికీ మొదలగున్న హైకూ కవులు మరణ శయ్యపై ఉండి కూడా వారి చివరి హైకూను వినిపించారు. నిజమైన హైకూ కవి హైకూనే ప్రపంచంగా

బ్రతుకుతాడు. బుసన్ 3 వేలకంటే ఎక్కువ హైకూలు రాశాడని – హైకూ చిత్రాలు గీశాడని అంచనా!. మసోక షికి 20 వేలు హైకూలు రాశాడని, తానెడ సంతోక 80 వేలు హైకూలు రాశాడని అంచనా. పక్షవాతం వచ్చి కుడిచేయి పడిపోయినా సంకల్ప బలంతో ఎడమ చేతితో హైకూలు రాసింది ప్రసిద్ధ హైకూ గురువు క్యోషి తకహమ రెండవ కుమార్తె తత్సుకో హోషినో.

సంప్రదాయ హైకూలు రాయాలనుకునే వారు వారి హైకూలలో ఆ దేశ సంస్కృతి... సంప్రదాయాలు ప్రతిబింబింప చేయాలి.

బాషో తన మరణానికి ముందు రాసిన కవిత:

"నేను ప్రయాణం చెయ్యడం వల్ల
అనారోగ్యానికి గురవుతున్నాను
నా కలలు పొడిపొలాలలో తిరుగుతాయి" అని హైకూగా అంటాడు.

మసోకా షికి క్షయ వ్యాధిగ్రస్తునిగా మరణ శయ్యపై ఉండికూడా మూడు హైకూలు కంపోజ్ చెయ్యగా ఆతని శిష్యుడు హెకిగోటో కవాటో బ్రష్ అందించడంలో సహకరించాడు.

"నిన్నగాక మొన్నటి నుంచి
పాము పొట్లకాయ నీళ్లు కూడా
సేకరించలేదు" అని షికి హైకూ రాస్తాడు. గొంతులోని కఫము బయటికి వచ్చేందుకు జపనీయులు ఈ పొట్లకాయ లూఫా నీరు సేకరించి సేవించే జానపద వైద్య ఆచారం ఈ హైకూలో కనిపిస్తుంది.

(ఆ) హైకూలలో దేశ సంస్కృతి... సంప్రదాయాలు :

సంప్రదాయ హైకూలు రాయాలనుకునేవారు వారి హైకూలలో ఆ దేశ సంస్కృతి... సంప్రదాయాలు ప్రతిబింబింప చేయాలి. హైకూ పితామహునిగా చెప్పబడే బాషో మొదలు క్యోరై ముకై, హట్టోరి ఆరాషియుకి, మోరికావా కొరోకు మొదలగు హైకూ మాస్టర్స్, ఎందరో కవుల హైకూలను మనం పరిశీలిస్తే ఋతువులను సూచించే పదాలతో (కిగో) హైకూలు రాయడమే గాకా, ఋతువులకు అనుగుణంగా ఆ దేశప్రజలు అనుసరించే ఆ దేశ సంస్కృతీ, సంప్రదాయాలను హైకూగా కవిత్వీకరించి చెప్పేవారని అర్థం

అవుతుంది. దేశ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా జపానీయ హైకూ కవులలా మనమూ హైకూలు రాయాలనేది గ్రహించాలి. ఉదా :

> జపాన్ చరిత్రలో ముఖ్యమైన కాలం యాయోయి కాలం. యాయోయి వసంతఋతువును సూచించే పదం.

"నూత్న సంవత్సరం:
ఎండిన అన్నం కేకు
యాయోయి కాలం"

అనే మోరికావా కొరోకు హైకూను మనం గమనించవచ్చు. జపాన్ చరిత్రలో ముఖ్యమైన కాలం యాయోయి కాలం. యాయోయి వసంతఋతువును సూచించే పదం. ఎడో కాలంలో ప్రజలు ఇంట్లో మోచీ అనే కేకును అన్నంతో చేసుకునే సంప్రదాయాన్ని ఈ హైకూ గుర్తుచేసింది. ఇలా చాలామంది కవులు వారి హైకూలలో దేశ సంస్కృతీ, సంప్రదాయాలను ప్రతిబింబించారు.

చరిత్రకారులు పరిపాలకుల కాలం, పాలనా విధానాలు మొదలగు విశేషాలతో చరిత్ర రాస్తే... హైకూ కవులు వారి సంస్కృతీ, సంప్రదాయాలను హైకూలు రూపంలో రికార్డ్ చేశారు. బాషో మొదలుకొని ఆధునిక హైకూ కవి గొసెంగోకు ఉడ వరకు ప్రజలచే గౌరవ మర్యాదలు అందుకున్నారు. జపనీయుల విశ్వాసాలను బట్టి వారి ఖననాలు, సమాధుల నిర్మాణం దేవాలయ స్మశానవాటికల్లో జరిగాయి. వారి శిల్పాలు, వారికి మెమోరియల్ హాల్స్ మ్యూజియమ్స్ నిర్మించబడ్డాయి. వారి నివాసాలు చారిత్రిక ప్రదేశాలుగా ప్రభుత్వంచే గుర్తించబడ్డాయి.. ఇవన్నీ తమ వారసత్వ సంపదగా జపనీయ ప్రజలు భావిస్తారు. అంతగా హైకూ జపాన్ లో ఆరాధనీయమైంది.

(ఇ) గురువు వద్ద శిష్యులుగా హైకూ కంపోజ్ చెయ్యడం, అభ్యసించడం...:

జపనీయ ప్రాచీన హైకూ కవులు, హైకూ కవులుగా అవతరించిన నేపథ్యాన్ని పరిశీలిస్తే ప్రతి హైకూ కవి గురుతః కంజీ లిపిని మాత్రమే కాక, హైకూ రచనలో మెళకువలు నేర్చుకుని రాసినవారే! వారి వద్ద మరికొందరు శిష్యులు చేరి వారు గురువులైనవారే!

యాత్రల అనుభూతిలోంచి ప్రాచీన హైకు కవులు హైకూలు రాస్తే, ఇప్పటి కవులు వారు చూసిన, అనుభూతి చెందిన ప్రకృతి – దృశ్యాలపై, వారి ప్రయాణాలలో పొందిన అనుభూతులను హైకూలుగా రాస్తున్నారు. నిశిత పరిశీలన, ప్రకృతి పట్ల సున్నితత్వం, శక్తివంతమైన భావోద్వేగాలను హైకులలో ప్రదర్శించడం, అక్షరాలతో దృశ్యాన్ని చిత్రించగలగడం, నిశ్శబ్దాన్ని శక్తివంతమైనటువంటి సాధనంగా హైకూకి ఉపయోగించడం మొదలైనటువంటివి హైకూ కవి అలవర్చుకోవాల్సిన లక్షణాలు, గుణగణాలు. అలా రాసినవారే బాషో... మొదలగున్న జపనీయ హైకూ కవులు.

తకరై కికాకు గురువు బాషో. వారు పొలాల గుండా వెళుతున్నప్పుడు ఒక తూనీగ గడ్డి పూల గుండా వెళ్లడం గమనించి

(ఈ) హైకూ అభ్యాసం వల్ల కలిగే ప్రయోజనం:

కిగిన్ కితామురా అనే గురువు వద్ద బాషో హైకూను అభ్యసించాడు. జపనీయ ప్రాచీన హైకూ కవులు గురుతః హైకూలను అభ్యసించి రాయడం ప్రారంభించారని ముందు ప్రస్తావించాను. ఇలా చేయడం వల్ల మంచి హైకులు రాయడంలో గురువుల నుంచి ఎటువంటి మెళకువలు శిష్యులు నేర్చుకుంటారో ఒక సంఘటన ఆధారంగా తెలుసుకుందాం.

తకరై కికాకు గురువు బాషో. వారు పొలాల గుండా వెళుతున్నప్పుడు ఒక తూనీగ గడ్డి పూల గుండా వెళ్లడం గమనించి

“ఎర్ర తూనీగ!
దాని రెక్కలను తొలగించండి –
ఒక మిరియాలు పాడ్!”

అని కంపోజ్ చేసి గురువు ఆమోదం కోసం ప్రక్కనే ఉన్న బాషో వైపు చూస్తాడు. శిష్యుడు రాసిన హైకూలో రెక్కలు తొలగించడం తూనీగా మరణించడమే..., రూపం కోల్పోవడమే! హైకూ జీవితాన్ని సృష్టించాలి కానీ, జీవితాన్ని చెరిపేదిగా... నాశనం చేసేదిగా ఉండకూడదని గురువు చెబుతూ–

"ఎర్ర మిరియాలు కాయలు!
రెక్కలు వేసి,
ఇదిగో, తూనీగ!" అని శిష్యుడు తకరై కికాకు రాసినదానిని బాషో సవరించి అద్భుతమైన రీతిలో హైకూకి జీవం పోయడమే కాకుండా, పదచిత్రంగా రూపొందించాడు.

బాషో వద్ద తకరై కికాకు, మసొాక షికి వద్ద క్యోషి తకహామా వంటి వారు శిష్యరికం చేసిన అనేకులు ఆ తర్వాత గురువు పాత్రను పోషించారు.

గురుతః హైకూల్లో ప్రవేశం ఉన్న వారికి హైకూను అభ్యసించడం వల్ల కలిగే ప్రయోజనాలు ఎన్నో. బాషో వద్ద తకరై కికాకు, మసొాక షికి వద్ద క్యోషి తకహామా వంటి వారు శిష్యరికం చేసిన అనేకులు ఆ తర్వాత గురువు పాత్రను పోషించారు. ప్రయాణంలో చెప్పిన హైకూలు, వారి అవసాన దశలో వ్యక్తీకరించిన హైకూలను బట్టి హైకులు ఎలా రాయాలో తెలుసుకున్న వారే! కొబయాషి ఇస్సా, మసోకా షికి, కురిబయాషి, షిబా ఫుకియా, కబుటో అకావో వంటి అతికొద్దిమంది మినహా అనేకులు గురువు ముఖతహా హైకూలు అభ్యసించి రాసినవారే! క్యోషి తకహామా గురువు పాత్రను అతి సమర్థవంతంగా పోషించిన హైకూ మాస్టర్ గా మనం గుర్తించవచ్చు.

(ఉ) బాషో "హొక్కు" మసోక షికి చే "హైకూ" గా నామకరణం :

7వ శతాబ్దం నాటి 'వాకా' అనే కవిత రూపంలో 5-7-5-7-7 సిలబల్స్ తో, ఐదు పాదాలలో 31 అక్షరాల సెట్ చొప్పున పునరావృతం అయ్యే ఛందస్సు ప్రాథమిక ఛందస్సుగా అనుసరింపబడేది. ఈతరహా ఛందస్సులోని కొన్ని మార్పులతో కటౌట, సెడోకా, చోకా ఇలా మరికొన్ని ప్రక్రియలు జపాన్ సాహిత్యంలో ఉన్నాయి. "వాకా" ప్రక్రియ 10వ శతాబ్దంలో "తంకా" ప్రక్రియగా మారింది.

5-7-5-7-7 అక్షర నియమంతో రాయబడుతూ హాస్య ధోరణితో పరిణమించే "రెంగా"లోని మొదటి మూడు పాదాలైన 5-7-5 ను తీసుకొని 17 అక్షరాలతో 17వ శతాబ్దంలో "హొక్కు" అనే స్వతంత్ర కవితా ప్రక్రియగా సరళతా – సహజ ప్రకృతి దృశ్యాలు – భావోద్వేగాలతో మత్సువొ బాషో చేత ఉన్నతీకరించ బడినదే హైకూ.

బాషోచే "హొక్కు/హైకై" అనే కవితా ప్రక్రియగా ఏర్పడి, తన శిష్యులు... తన తదనంతరం కవులచే అనుసరింపబడే కవితా ప్రక్రియకు 19వ శతాబ్దానికి చెందిన హైకూ కవి మసోక షికి "హైకూ" అని నామకరణ చేసాడు. హొక్కు లేదా హైకై పర్యాయపదమే హైకూ అని అందరూ గ్రహించాలి!

హైకూ అక్షర నియమం విషయంలో వెసులుబాటు తీసుకున్నా, హైకూను మూడు పాదాల్లో రాయక పోవడం నియమ ఉల్లంఘనే!

(ఊ) సంప్రదాయ హైకూ లక్షణాలు:

హైకూ పితామహుడైన బాషో హైకూలను అనుసరించి సంప్రదాయ హైకూకి ఉండాల్సిన లక్షణాలు ఈ విధంగా ఉండాలి –

(1) మూడు పాదాలలోనే హైకూ రాయాలి:

అందరూ విధిగా పాటించాల్సిన నియమం ఇది. జపనీయులు తమ కంజీ లిపిలో హైకూలను నిలువుగా, అడ్డుగా ఒకోపాదం మధ్య స్పేస్ ఇస్తూ రాసినప్పటికీ ఒక పాదంగా పొరపాటుగా భావించి కొందరు పాశ్చాత్య హైకూ అనువాదకులలో కొందరు ఒక పాదం, రెండు పాదాలలో హైకూలను అనువదించారు. వాటిని చూసి మనవారిలో కూడా కొందరు అలాగే రాశారు. ఇంకొందరు నాలుగు పాదాలలో కూడా హైకూలు రాసినవి లేకపోలేదు. మరికొన్ని డి.టి.పి అలైన్ మెంట్ పై దృష్టి పెట్టక పోవడం వల్ల పొడవైన పాదం నాలుగవ పదంగా మారిపోవడంగా నేను గుర్తించాను.

హైకూ అక్షర నియమం విషయంలో వెసులుబాటు తీసుకున్నా, హైకూను మూడు పాదాల్లో రాయక పోవడం నియమ ఉల్లంఘనే!

"దోసిట్లో నీళ్లు –
ముఖ చిత్రం కరిగి
కారిపోతోంది"
–పెన్నా శివరామకృష్ణ (రహస్య ద్వారం).

"అమాయకపు పిచ్చుక
పచ్చి ఇటుక పేర్పులో

గూడుకడుతోంది "

– గోపిరెడ్డి రామకృష్ణారావు (వెన్నెలగా ఉంది)

పెన్నా శివరామ కృష్ణ 5-7-5 సిలబల్స్ తో బొమ్మకట్టించే హైకూ లక్షణాన్ని అనుసరించి హైకూను కంపోజ్ చేస్తే , గోపిరెడ్డి 5-7-5 అక్షర నియమం పాటించకున్నా పిచ్చుక అమాయకత్వాన్ని చక్కని హైకూగా ప్రదర్శించాడు.

(2) నియమ విరుద్ధమైన ఏకపాద హైకూలకు ఉదా:

1) "అహో పైరగాలి'.

2) "అయ్యో వెన్నుపోటు"

– శంకర వెంకట నారాయణరావు . ఇలా శంకర వెంకట నారాయణ ఏకపాద హైకూలు "హైకూ సమయం" అనే తన హైకూ సంపుటిలో చాలా రాశాడు.

(3) నియమ విరుద్ధమైన రెండు పాదాల హైకూలకు ఉదా:

రెండు పాదాలలోనూ శంకర వెంకట నారాయణరావు హైకూలను రాశారు. తెలుగులో ద్విపద కవిత ప్రక్రియ ఉంది.

1) "ఎక్కడో పిడుగు / ఒళ్ళు ఝల్లు" – శంకర వెంకట నారాయణరావు (హైకూ సమయం)

2) "పాము జడ / మొగలి పరిమళం" – శంకర వెంకట నారాయణరావు (హైకూ సమయం)

3) "అందమైన నవ్వు / పెదవులపై విరిసే పువ్వు!" –మాకినీడి సూర్య భాస్కర్ (హైకూ చిత్రాలు)

(4) నియమ విరుద్ధమైన నాలుగు పాదాల హైకూలు:

హైకూను నాలుగు పాదాలలో రాయడం కూడా చెయ్యకూడదు. నాలుగు పాదాల్లో నానీలు వ్రాసే ప్రక్రియ ఉంది.

1) "ఇంతదాక ఎక్కడ దాచుకుంది

ఈ దొంగాకాశం

చంద్రుడు ముందు విప్పింది
పేలాలపొట్లం" – లంకా వెంకటేశ్వర్లు (ఆకాశం నేలపాలైంది)

2) "పిల్లి పిల్లల్ని పెట్టింది.
పిల్లలు చుట్టూ మూగి–
పిల్లికూనలు అరుపుల్ని
అనుకరిస్తున్నారు" – పి. శ్రీనివాస్ గౌడ్ (దిగులు వర్ణాలు)

3) "పాత పాటలు, వేల ఆటలు,
అలరించే మనసులు,
అన్నింటినీ ఇచ్చింది
ఒకప్పటి విలువైన వయసులే" – సాయి మల్లిక పులగుర్త (నల్ల మబ్బు పిల్ల)

పైవిధంగా ఒకటి, రెండు, నాలుగు పాదాలలో హైకూలు రాసే విధానాలను అనుసరించకూడదని హైకూ కవులు గ్రహించాలి.

(5) మూడు పాదాల హైకూ నిర్మాణంలో యూనిట్స్:

హైకూలోని ఒకటవ పాదం ఒక యూనిట్ అయితే, ఆ తర్వాతి రెండు పాదాలు ఒక యూనిట్ గా..., లేదా మొదటి రెండు పాదాలు ఒక యూనిట్ అనుకుంటే ఆ తర్వాతి పాదం ఒక యూనిట్ గా రాసే శైలిని అవలంబించాలి.

మొదటి పాదం ఒక యూనిట్ గా ...:
"మండు వేసవి:
జిల్లేడు దూదిపింజ
గాలి అలల్లో... " –డాక్టర్ తలతోటి పృథ్విరాజ్ .

పై హైకూలో మొదటి పాదం ఒక యూనిట్ గా, రెండు, మూడు పాదాలు రెండవ యూనిట్ గా చేసుకొని కంపోజ్ చేసిన హైకూ. అక్షర నియమాన్ని పాటించి రాయడమేగాకుండా హైకూ చదివే పాఠకుడికి అతని కళ్ళముందు ఒక దృశ్యాన్ని ఆవిష్కరింపజేశాడు కవి. వేసవిలో ఎండిన జిల్లేడు కాయలు పగిలి అందులో దూదితో కూడిన గింజలు గాలివాటం వైపుకు ఎగిరి పోవడం గుర్తుకు వస్తుంది దృశ్యంగా!.

మూడో పాదం రెండవ యూనిట్ గా ...:

"నీళ్లు తాగేందుకు
తల పైకెత్తితే ఎదురుగా చంద్రుడు :
వెన్నెల్ని తాగుతున్నా" –డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ .

హైకూ పాదాన్ని ముగించే నియమమే కిరేజీ. దీనినే కటింగ్ వర్డ్స్ అంటారు.

పై హైకూలో మొదటి రెండు పాదాలు ఒక యూనిట్. మూడో పాదం రెండవ యూనిట్. ఇలా హైకూ కవులు హైకూ యూనిట్ విధానాన్ని అనుసరించి రాయాలి. హైకూలో కటింగ్ వర్డ్స ఉపయోగించినప్పుడే హైకూ నిర్మాణం ఈ రూపాన్ని సంతరించుకుంటుంది.

(6) హైకూలలో కిరేజీ (కటింగ్ వర్డ్స) వినియోగం :

హైకూ పాదాన్ని ముగించే నియమమే కిరేజీ. దీనినే కటింగ్ వర్డ్స అంటారు. హైకూలోని మూడు పాదాలను ఏకబికిగా పాఠకుడు చదవకుండా... ఏ పాదం దగ్గర ఆగి అనుభూతి చెందుతూ మిగతా భాగాన్ని కొనసాగించాలో తెలియజేసేవి కిరేజీ. కటింగ్ వర్డ్స కు ప్రత్యామ్నాయంగా ఆంగ్లంలో ఫంక్చుయేషన్ మార్క్, ఎక్సిలిమేషన్ మార్క్స ఉపయోగించే విధానాన్ని అనుసరిస్తున్నారు. ఫంక్చుయేషన్ మార్క్ తరచుగా రెండవ పంక్తి చివరిలో ఉంచబడుతుంది. ఇది పాఠకుల దృక్పథాన్ని మార్చే చిన్న విరామం లాంటిది. జపాన్ హైకూ సాహిత్యంలో 48వరకు కిరేజీలు ఉన్నాయి. 18వరకు శాస్త్రీయమైన కిరేజీలను కొందరు సూచించారు. ఉదా : కన, మోగానా, షి, జీ, యా, కెరి, యో, జో, త్సు, సే, జు, రే, ను, హే కే ,హౌ అనేవి కిరేజీలు. వీటిని కిరే అనికూడా పిలుస్తారు.

జపనీయుల కిరేజీలకు ప్రత్యామ్నాయంగా పాశ్చాత్యులు పంక్చుయేషన్ మర్క్స లేదా విరామ చిహ్నాలు ఉపయోగిస్తున్నారు. .(ఫుల్ స్టాప్), ,(కామా), : (కోలన్), ; (సెమీ కోలన్), – (డాష్ లేదా హైఫెన్), ... (ఎలిప్సిస్), ? (క్వశ్చన్ మార్క్), ! (ఎక్స్క్లమేషన్ మర్క్స లేదా ఆశ్చర్యార్థకం), ' (అపాస్ట్రోఫీ), ... (ఎల్లిప్సిస్ పాయింట్). ఉదా :

"కీచురాళ్ళారా...

ఎందుకు మౌనంగా వున్నారు?

ఇదిగో, నేను వెళ్తున్నాను. " అని పి. శ్రీనివాస్ గౌడ్ 'ముంజంత మృదువైన హైకూ' అనే తన హైకూ సంపుటిలో అంటాడు. ఈ హైకూలో ... (ఎలిప్సిస్), ? (క్వశ్చన్ మార్క్), ,(కామా), .(ఫుల్ స్టాప్) వంటి పంక్చుయేషన్ మర్క్స్ ను ఉపయోగించడం ద్వారా పాఠకుడు హైకూను ఎక్కడెక్కడ ఆపుతూ చదువుతూ అనుభూతి చెందాలో ఇవి తెలియజేస్తాయి.

"దొంగలు
తీసుకెళ్లలేక పోయారు –
కిటికీలో చంద్రుణ్ణి" అని ర్యోకాన్ రాసిన హైకూను గాలి నాసర రెడ్డి అనువదించాడు. ఈ హైకూలో – (డాష్ లేదా హైఫెన్) ఉపయోగించాడు అనువాదకుడు.

"వొలికింది వెన్నెల
చెట్టు గుబురులో ;
ధవళ ఛత్రం " అని తన 'సంపెంగ లోలకం' హైకూ సంపుటిలో డాక్టర్ డి రూప్ కుమార్ రాసిన ఈ హైకూలో (సెమీ కోలన్) ఉపయోగించారు. ఏయే పంక్చుయేషన్ మర్క్స్ ఏ సందర్భాలలో వాడాలో వివరిస్తే వ్యాసం నిడివి పెరుగుతుందని ముగిస్తున్నాను.

(7) 17 సిలబల్స్ హైకూలు:

హైస్కూల్లో అక్షర నియమం పాటించాలనుకునేవారు ఒకటి-మూడు పాదాలు 5 అక్షరాలతో, రెండవ పాదం 7 అక్షరాలతో రాయాలి.

కొన్ని అక్షరాలు కలిసి పదం. కొన్ని పదాలు కలిసి వాక్యం. జపనీయులు ఒంజి (Onji) ని ఇంగ్లీషువారు సిబల్ గా అనుసరిస్తున్నారు. ఉచ్చారణ రీత్యా పదంలోని కొన్ని అక్షరాలను ఒక యూనిట్ గా పలికే విధానమే సిలబల్. శ్వాస నిడివిగా కూడా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు ఇంగ్లీష్ లోని book (బుక్) అనే పదాన్ని పరిశీలిస్తే నాలుగు అక్షరాలు కలిగినప్పటికీ Book ను ఒక ఉదుటున ఒక యూనిట్ గా పలకగలుగుతాము. కనుక ఇది ఒక సిలబల్. ఇదే Book ను మనం తెలుగులో "పుస్తకం" అంటాము. ఉచ్ఛరణ రీత్యా పు-స్త-కం అని

పలుకుతాము. దీన్ని బట్టి పుస్తకం మూడు సిలబల్స్. ఇదే పుస్తకాన్ని జపాన్లో హాన్ (hon) అంటారు. వారి కంజి లిపిలో ఈ పదం ఒక సిబల్ మాత్రమే.

కనీసం రెండు మూడు అక్షరాలు కలిసి ఒక పదంగా ఏర్పడే విధానం ఇతర భాషల్లో ఉంటే..., జపనీయులు భాషలో ఒక అర్థాన్ని ఇచ్చే ఏకాక్షర

పదాలు చాలా ఉన్నాయి. అందువల్ల 17 సిలబల్స్ లో వారు చక్కని అభివ్యక్తితో హైకూలు కంపోజ్ చేయగలుగుతున్నారు. వారికున్న భాషా సౌలభ్యత అది. బాషో ప్రసిద్ధ హైకూ ఈ అక్షర నియమానికి ఉదాహరణగా ఇక్కడ వివరిస్తాను.

"Fu–ru–i–ke–ya = 5 ఒంజిలు
ka–wa–zu–to–bi–ko–mu = 7 ఒంజిలు
mi–zu–no–o–to = 5 ఒంజిలు . మొదటి పాదం లోని చివరి అక్షరం 'య' అనే కిరేజీ ని ఉపయోగించి కూడా వెరసి 17 ఒంజిలతో హైకూను కంపోజ్ చేసాడు. జపాన్లో హైకూలలోని మూడు పాదాలను వరుస క్రమంగా కమిగో, నకషిచి, షిమోగో అని పిలుస్తారు.

ఈ హైకూ ఆంగ్లానువాదకులు సిలబల్స్ అనుసరించకుండా ఆంగ్లంలోకి అనువదిస్తే –

"The old pond–
a frog jumps in,
sound of water"

ఇదే హైకూని సిలబల్స్ తో అనువదించేందుకు ఈ క్రింది విధంగా అవసరంలేని పదాలతో హైకూను సాగదీసిన విధానాన్ని గమనించ వచ్చు.

There is the old pond!
Lo, into it jumps a frog:
hark, water's music"

"పాత కోనేట్లో
కప్ప దుమికినది–
నీళ్లచప్పుడు" అనితెలుగులో అనువాద హైకుగాసిలబల్లోచెప్పుకోవచ్చు.

17 అక్షరాలా నియమంలో అవగాహన లేమి: అక్షర నియమం పాటించని హైకూలు, హైకూలు కావని చాలామంది వారి వ్యాసాలలో విమర్శించిన సందర్భాలు లేకపోలేదు. అక్షర నియమంతో హైకులుగా రాసేవారు తనలా రాయనివారి హైకులను విమర్శించిన సందర్భాలు కూడా లేకపోలేదు. హైకూ తత్వంతో హైకూ రాశావా లేదా అనేదే ముఖ్యం. 17 అక్షరాలా సిలబల్ నియమం అనుసరించి రాయాలా? రాయకూడదా అనే విషయంపై అవగాహనా లేమితో కొందరు చేసే విమర్శలను నేను చూస్తూ వస్తున్నాను. ఈ సందర్భంగా ఫ్రీ రిథమ్ హైకూల గూర్చి వివరిస్తాను.

జపానేతర హైకూ కవులు... తెలుగు వారు... మిగతా భారతీయ భాషలవారు అక్షర నియమాన్ని ఉల్లంఘించినట్లు విమర్శలు వస్తున్నాయి.

(8) 5-7-5 రిథమ్ హైకూ, ఫ్రీ రిథమ్ హైకూ:

జపానేతర హైకూ కవులు... తెలుగు వారు... మిగతా భారతీయ భాషలవారు అక్షర నియమాన్ని ఉల్లంఘించినట్లు విమర్శలు వస్తున్నాయి. హైకూ అధ్యయనం లేకపోయినా అందరూ ప్రముఖ విమర్శకులే. మనం రాసింది ప్రచురించే పత్రికలు ఉంటే చాలు మనం చెప్పింది... రాసింది ప్రామాణికం అన్నట్లు సాగిపోతుంది.

ఫ్రీ రిథమ్ హైకూలలో 17 అక్షరాలకు తక్కువగా ఉన్న వాటిని షార్ట్ టెంపర్మెంట్ హైకులనీ, 17 అక్షరాలకు మించిన హైకూలను లాంగ్ టెంపర్మెంట్ హైకూలు అంటారు. అంతేకాదు... కాలానుగుణ పదాలు వాడకుండా, సామాజిక ఇతివృత్తాలతో రాయబడిన హైకూలను ఫ్రీ రిథమ్ హైకూలుగా చెప్పుకోవాలి. జపాన్లో తైషో శకం తర్వాత ఫ్రీ రిథమ్ హైకూలు ఇప్పెకిరో నాకట్సుకా, ఇసెన్సుయ్ ఒగివారా, కబుటా కనెకో , హౌసింగ్ కెన్షిన్, మికియో నరిటా, టోమిజావా రెడ్ ఎల్లో మ్యాన్, హౌయా ఓజాకి, తానెడ సంతోకా, కురిబయాషి ఇక్కేకీజీ, యుమిచి హషి మోటో మొదలగు హైకూ ఉద్దండులు హెకిగోటో కావాటో (1873-1937) ప్రతిపాదించిన ఫ్రీ రిథమ్ హైకూలను అనుసరించారు. ఈ నియమం ప్రకారం రుతు

పదాలను ఉపయోగించే (కిగొ) విధానాన్ని, 17 అక్షర నియమాన్ని పాటించకుండా హైకూలు రాయవచ్చు అని అర్థం చేసుకోవాలి. ఈ విధానాన్నే అన్ సీజన్డ్ ఫ్రీ – టెంపర్డ్ హైకూ అని కూడా అంటారు.

సుదూర పర్వతాలు మన కళ్ళకు ఆకాశంలా నీలిరంగుతో కనిపిస్తాయి. ఎంత నడుస్తున్నా... సమీపిస్తున్నా నీలంగానే కనిపిస్తాయి.

"పిచ్చుక పిల్లా
ఆ మార్గంలోంచి పో, ఆ మార్గంలోంచి పో !
గుర్రం వెళ్తుంది" అని కొబయాషి ఇస్సా వంటి ఉద్దండ జపనీయ హైకూ కవే తాను భాషలో 5–8–5 సిలబల్స్ తో భావోద్వేగమైన ఫ్రీ రిథమ్ హైకూ రాసాడు. జపనీయుల కిగో ప్రకారం పిచ్చుక వసంత రుతు పదం. త్వరగా ఆ ప్రదేశం నుంచి బయటపడక పోతే ఆ మార్గంలో వచ్చే గుర్రాల చేత తొక్క బడతావు అని ఆ మార్గంలోంచి పో ! అనే పాదాలను పునరావృతం చెయ్యడం ద్వారా నొక్కి వక్కాణిస్తూ అల్పజీవులపట్ల కవికున్న ప్రేమను ఈ హైకూ ద్వారా చాటుకున్నాడు కవి ఇస్సా.

"నేను లోపలి ప్రవేశించినా
నేను లోపలి ప్రవేశించినా –
నీలంగానే పర్వతం!"
(wakeittemo / wakeittemo / aoiyama)
–తానెడ సంతోకా.

సుదూర పర్వతాలు మన కళ్ళకు ఆకాశంలా నీలిరంగుతో కనిపిస్తాయి. ఎంత నడుస్తున్నా... సమీపిస్తున్నా నీలంగానే కనిపిస్తాయి. "నేను లోపలి ప్రవేశించినా" అని రిపీట్ చెయ్యడం నొక్కి వక్కాణించడం. హైకూ అభివ్యక్తిలో అనేక మెళకువలు ప్రదర్శించారు జపనీయ కవులు. 5–7–5 సిలబల్ కాకుండా జపనీయ భాషలో 5–5–4 సిలబల్స్ తో ఫ్రీ రిథమ్ హైకుగా కవి ఈ హైకూను రాశాడు. మన మాటల్లో అక్షర నియమాన్ని అతిక్రమించి రాసిన హైకూ.

వీటిని బట్టి మనం గ్రహించాల్సిన విషయాలు ఏమిటంటే... 17

సిలబల్స్ ను అనుసరించడంలో హైకూ పుట్టిన జపాన్ లోనే 19వ శతాబ్దం లోనే హెకిగోటో కావాటో (1873-1937) ప్రతిపాదనతో సిలబల్స్ లో మార్పులు సంతరించుకున్నాయని అర్థం చేసుకోవాలి. గ్రహించాల్సిన రెండో విషయం ఏమిటంటే... 17 సిలబల్స్ కూడా వాడకుండా తక్కువ సిలబల్స్ లోనే మంచి హైకూలు రాయడమే ప్రధానం అని గ్రహించాలి. దీర్ఘాక్షరాలు రెండు మాత్రలుగా, హ్రస్వాక్షరాలు ఒక మాత్రగా భవిస్తూ ఇలా 17 మాత్రలతో రాయడమే హైకూ అనే అపోహతో ఉప్పల ధడియం వెంకటేశ్వర రావు వంటివారే కాదు; వసుధ బసవేశ్వర రావు వంటి వారు కూడా "చస్తూనే / ఎండుటాకులు / శాపాలు" అని రాసిన హైకూలు తెలుగులో లేకపోలేదు.

(9) సిలబల్స్ పాటించాలనే ప్రయత్నంలో భాషలో కృత్రిమత్వం :

సిలబల్ విధానాన్ని అనుసరించి నేను హైకూ రాశానని గొప్పగా చెప్పుకోడానికి కొందరు హైకూ కవులు నానా పాట్లు పడుతూ భాషతో ఫీట్లు వేస్తుంటారు. 'హరివిల్లు' అనే తన హైకూ సంపుటిలో డా. శిరీష ఒక హైకూను ఇలా రాసాడు -

"చిరాకు చీకట్లో
వెల్గు చిత్రం వెత్కుతూ
దీపావర్త్రాత్రి" అని రాస్తాడు. వెలుగు అని రాయాల్సిన చోట 'వెల్గు' గా కుదించడం..., వెతుకుతూ అని రాయాల్సిన చోట 'వెత్కుతూ' అని కుదించడం..., దీపావళి రాత్రి అని రాయాల్సిన చోట 'దీపావర్త్రాత్రి' అని 17 అక్షరాలలో హైకూను ఇమిడ్చినా భాషలో కృత్రిమత్వం స్పష్టంగా కనిపిస్తుంది. ఇలా చాలామంది హైకూలు పేర్కొందగిన సమాచారం ఉంది.

(10) హైకూలలో రుతు పదాల (కిగో) వినియోగం:

సంప్రదాయ హైకూ లక్షణాలను అనుసరించి బాషో , తదనంతర జపనీయ హైకూ కవుల శైలిలోనే హైకూలు రాయాలంటే రుతుపదాలు లేదా కాలానుగుణ పదాలను ఉపయోగిస్తూ హైకూ రాయాలి. ఇటువంటి వాటిని జపాన్ భాషలో కిగో అంటారు. ఇటువంటి పదాలతో కూడిన నిఘంటువునే సెజికి అంటారు. ఇండియన్ సెజికి (రుతు పదాల నిఘంటువు)ని నేను

రూపొందించాను. ప్రచురించాల్సి ఉంది. ఉదా:

"పూల మేఘం.
గంట యునో నుండా
అసకుసా నుండా?!" అని బాషో ఒక హైకూలో రాస్తాడు. చెర్రీ పూలను పూల మేఘాల్లా కవి భావించాడు. ఇవి ఆ దేశ వసంత ఋతువులో పూసే చెర్రీ పూలను గుర్తుకు తెస్తాయి. వినబడే గుడిగంటల శబ్దం ఉయోనోలోని కనీజి ఆలయం నుండి వస్తుందా లేదా అసకుసా లోని సెన్సోజీ ఆలయం నుండి వస్తుందా అనే భావన, అనుమానం చక్కని హైకూ అభివ్యక్తిగా బాషో వ్యక్తీకరించాడు. ఈ హైకూలో వసంతం అని రుతువును నేరుగా ప్రస్తావించకపోయినా... పూల మేఘం అనే పద ప్రయోగం ద్వారా పరోక్షంగా వసంత ఋతువు ప్రస్తావనతో హైకూ రాసాడు. ఇలా ఋతుపదాలను ఉపయోగిస్తూ హైకూలు రాయాలి. ముందు ప్రస్తావించినట్లు వారి సంస్కృతిలో భాగమైన దేవాలయాలను, పర్వతాలను, పండుగలను కూడా హైకులలో వర్ణించాడు బాషో.

ఇస్మాయిల్ గారి మాటల్లో పాఠకుడు హైకూ చదువుతుంటే బొమ్మకట్టాలి. అంటే దృశ్యం కనిపించాలి.

(11) హైకూలలో ఆబ్జెక్టివ్ స్కెచింగ్ :

ఇస్మాయిల్ గారి మాటల్లో పాఠకుడు హైకూ చదువుతుంటే బొమ్మకట్టాలి. అంటే దృశ్యం కనిపించాలి. మసోకా షికి శిష్యుడు క్యోషి తకహామా. ఇతని వద్ద శిష్యరికం చేసిన హైకూ కవులకు ఆబ్జెక్టివ్ స్కెచింగ్ విధానాన్నే నేర్పించాడు. వాస్తవిక కవితా శైలిని సాంప్రదాయ హైకూ విధానాన్ని నేర్పించాడు. కాలానుగుణ ఋతుపదాలను వినియోగించడం, పూలూ , పక్షుల ప్రస్తావన హైకూలలో ఉండేలా చేసాడు. ప్రకృతి స్పందన హైకూలో బంధించే విధానాన్ని సమర్ధించాడు.

"ఆవులు, గుర్రాలు మరియు
వంతెన క్రింద ప్రజలు :
పొలాలలో వర్షం" అకస్మాత్తుగా వర్షం కురిసేటప్పుడు రవాణాకు, వ్యవసాయానికి ఉపయోగించే గుర్రాలు, ఆవుల్ని వంతెన క్రిందకు

తోలుకుపోయి తలదాచుకునే సన్నివేశాన్ని ఒక చిత్రంగా ఈ హైకూలో క్యోషి తకహామా ప్రదర్శించాడు.

షింకో హైకూ యుద్ధం మరియు యుద్ధ వ్యతిరేక భావాలతో కూడి ఉండడం కారణంగా అణిచివేశారు.

(12) హైకూ కవిత వస్తువులు :

హైకూ కవితా వస్తువులు తరచుగా ప్రకృతి మరియు సహజ చిత్రాలపై రాయబడతాయి. రుతువుల భావాన్ని మరియు సహజ ప్రపంచం యొక్క అందాన్ని రేకెత్తిస్తుంది. దేశ సంస్కృతి సంప్రదాయాలు హైకూలలో ప్రతిబింబిస్తాయి. మానవ ఉద్వేగాలను ప్రతిబింబిస్తాయి. సామాజిక అంశాలపై కూడా తెలుగులో హైకూలు రాయబడుతున్నాయి. దీనిమీదకూడా పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి.

"కొంతకాలానికి దీపానికి
యుద్ధ భూమి యొక్క లోతైన
చీకటి వస్తుంది " అని జపనీయ హైకూ కవి అకా -కి ఒటోకో 1938లో యుద్ధ భూమిలో రాసిన హైకూ ఇది. ఋతుపదాలను ఉపయోగించకుండా హైకూ వస్తు తత్వాన్నికి భిన్నంగా పూర్తి సామాజిక అంశంపై ఎప్పుడో హైకూలు రాయడం హైకూ పుట్టిన జపాన్ లోనే మొదలైనదని గుర్తించాలి.

1940 ప్రాంతంలో జపాన్ లో హైకూ మ్యాగజైన్‌లు మరియు కొత్త వ్యక్తీకరణ రూపాలను ప్రయత్నించిన హైకూ కవులను ప్రభుత్వ సైద్ధాంతిక నియంత్రణలో అణచివేయబడ్డారు. యుద్ధ సమయంలో, ప్రజల మనోధైర్యాన్ని పెంచడానికి ప్రభుత్వం సమాచారాన్ని నియంత్రించింది. షింకో హైకూ యుద్ధం మరియు యుద్ధ వ్యతిరేక భావాలతో కూడి ఉండడం కారణంగా అణిచివేశారు. అనేక మంది హైకూ కవులను నిర్బంధించారు, అరెస్ట్ చేశారు. అనేక పత్రికలను నిషేదించారు. చిన్న హైకూ కూడా నాటి ప్రభుత్వాన్ని గడగడలాడించింది.

(13) హైకూలలో జెన్ తత్త్వం:

జెన్ లక్షణాలలో మరొకటి జాజెన్. ధ్యానంలో ఇది ఒక టెక్నిక్. నిశ్శబ్దంగా కూర్చుని శ్వాసపై దృష్టిపెట్టడం

జపనీయుల హైకూ కవిత్వం రాయాలంటే ప్రతివారు తెలుసుకోవాల్సిన మొదటి అంశం జెన్ తత్త్వం. బౌద్ధం భారతదేశం నుండి చైనాకు వెళ్ళి చాన్ బౌద్ధంగా, చైనానుండి జపాను వెళ్ళి జెన్ బౌద్ధంగా మారింది. జపాన్లో జెన్ బౌద్ధతత్వంగా, మతంగా రూపుదాల్చింది. జెన్ విధానాన్ని అనుసరిస్తూ జెన్ బౌద్ధమత విధానంలో ఒకటైన జాజెన్ వంటిదానిని అభ్యసిస్తూ ఒకరి స్వంత శరీరంద్వారా బుద్ధుని జ్ఞానోదయాన్ని పునరుద్ధరించాలని లక్ష్యంగా పెట్టుకుని శిక్షణా ప్రక్రియలలో పదాలద్వారా వ్యక్తీకరించలేనిదానిని పొందడం. దాదాపు 7వ శతాబ్దంలో జపనీయులకు జెన్ ఫిలాసఫీ పరిచయం కాబడింది. తర్వాత అది మెల్లగా తన రూపాన్ని మార్చుకుంటూ మతపరమైన శాఖగానే కాకుండా జపనీయుల సంస్కృతికి సంబంధించిన అనేక అంశాలను ప్రభావితం చేసింది అని చెప్పుకోవచ్చు.

జెన్ అనేది బౌద్ధమతం తత్త్వశాస్త్రం. మనస్సు యొక్క నిజమైన స్వభావాన్ని అన్వేషించడం, జ్ఞానోదయాన్ని సాధించడం గూర్చి నొక్కి చెబుతుంది. జెన్ తత్త్వం అనేది అభ్యాసం మరియు అంతర్గత దృష్టిద్వారా సత్యాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. సిద్ధాంతంపై ఆచరణాత్మక అనుభవాన్ని నొక్కిచెబుతుంది. జన్ బౌద్ధంలో ముషిన్ మరియు శూన్యత భావనలు ఉన్నాయి. మనిషి అనుబంధాలు, పక్షపాతాలనుండి విముక్తిపొందే స్వచ్ఛమైన మానసిక స్థితిని తెలియజేసేదే ముషిన్.

జెన్ లక్షణాలలో మరొకటి జాజెన్. ధ్యానంలో ఇది ఒక టెక్నిక్. నిశ్శబ్దంగా కూర్చుని శ్వాసపై దృష్టిపెట్టడం ద్వారా మనిషి ప్రశాంతత, అంతర్గత శాంతిని అనుభవించడం, లోతైన జ్ఞానోదయాన్ని పొందడం జరుగుతుంది. జాజెన్ అనేది ధ్యాన పద్ధతి మాత్రమే కాదు; ఇది రోజువారి జీవితంలో మనస్సును నియంత్రించుకునేందుకు కూడా ఉపకరించేది. జాజెన్లో అభ్యాసకులు ముఖాముఖి కూర్చుంటారు. ఎక్కువసేపు కదలకుండా కాళ్ళపై కూర్చోవడమే జాజెన్ అంటారు. ఈ జాజెన్ సమయంలో స్వప్రయోజనకరమైన

ఆలోచనలనుండి, శోధించడం నుండి బుద్ధిహీనమైన ప్రయత్నాలు చేయకుండా మన అసలు స్వభావానికి తిరిగి రావడమే జాజెన్. జెన్ నుండి విడదీయరానిది జాజెన్. జాజెన్ వల్ల జెన్ యొక్క అభ్యాస ఫలితం ఒకరి అంతరంగంపై మాత్రమేకాకుండా ఇతరుల సంబంధాలపైకూడా దృష్టిసారింపజేస్తుంది. ఇతరులతో సంఘర్షణ, పోటీకంటే సామరస్యం, సహజీవనం కొనసాగించేలా చేస్తుంది. ఇది మనల్ని స్వీయ కేంద్రీకృత ఆలోచనలనుండి విముక్తి చేస్తుంది. విశాలమైన దృక్పథాన్ని, దయగల హృదయాన్ని కలిగి ఉండడానికి అనుమతినిస్తుంది. జాజెన్ వల్ల జెన్ యొక్క అభ్యాస ఫలితం ప్రకృతితో ఏకత్వం. మానవులుకూడా ప్రకృతిలో భాగమే గనుక ప్రకృతి నియమాల ప్రకారం జీవితంచడం చాలా ముఖ్యమైనది. ప్రకృతితో సామరస్యం ద్వారా మనం జీవిత సారాంశాన్ని అర్థంచేసుకోవచ్చు. లోతైన జ్ఞానోదయాన్ని చేరుకోవచ్చు. పైవిధంగా జెన్ నిజమైన స్వభావాన్ని అన్వేషిస్తుంది. నిజమైన స్వేచ్ఛ, శాంతిమార్గాన్ని చూపుతుంది. ఈ తత్వం హైకూలలో ప్రతిబింబించాలి.

జెన్ నిజమైన స్వభావాన్ని అన్వేషిస్తుంది. నిజమైన స్వేచ్ఛ, శాంతిమార్గాన్ని చూపుతుంది. ఈ తత్వం హైకూలలో ప్రతిబింబించాలి.

“మందలో నుండి
తప్పిన గొర్రె ఏమో–
ఒంటరి మొర” అని కవి డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ ‘నీలాకాశం’ అనే తన హైకూ సంపుటిలో 17 సిలబల్స్ తో రాస్తాడు. ఒక మూగ జీవి స్థితి దయను పుట్టించే తత్వాన్ని హైకూలో అభివ్యక్తీకరించాడు కవి.

“రక్తపుటేరులు
పరివర్తన
బుద్ధం...శరణం... గచ్ఛామి” అని డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ తన “రోజుకో సూర్యుడు” అనే హైకూ సంపుటిలో కరుణ భావాన్ని, బౌద్ధ తత్వాన్ని హైకూగా అభివ్యక్తీకరించాడు .

(14) మీదైన హైకూ అభివ్యక్తి, శైలి:

మాత్సువో బాషో తన హైకూలలో జెన్ ఫిలాసఫీ, మానవతా అనే బౌద్ధ విధానాన్ని అనుసరిస్తూ ట్రిగ్గర్ శైలితో హైకూను కంపోజ్ చేసేవాడు. ఇతని శిష్యుడు క్యోరై ముకై –

అనవసరమైన ప్రాణహానిని నివారించే తత్వమే బౌద్ధం.

"నిన్నటి రోజు,
పర్వతాలు పూర్తిగా
వికసించాయి" అని గంభీరమైన,సొగసైన,స్వచ్ఛమైన, నిశ్శబ్దం అనే పదాల ద్వారా వ్యక్తీకరింపబడే "కోగ సీజను" శైలిని అనుసరించాడు. హట్టోరి ఆరాషియుకి అనే బాషో శిష్యుడు –

"వెనుతిరిగొచ్చే
అడవి బాతులు బహుశా –
తీర్థయాత్రకు" అని సొగసైన, పురాతనమైన, ప్రశాంతమైన సున్నిత శైలిని అనుసరించి హైకూలు రాసాడు. తీర్థయాత్రలు చేసే జపానీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబింపజేసాడు. బాషో శిష్యులలో అత్యంత నిష్ణాతుడైన సంప్రదాయ హైకూ కవి బాషో తర్వాత గ్రామీణ ప్రాంతాలపై దృష్టి కేంద్రీకరించి హైకూలు రాసినవాడు తకరై కికాకు. అందుకే ఒక హైకూలో –

"కొత్త సంవత్సరం రోజు:
పదిమంది బొగ్గు అమ్మకం దారుల
నల్లటి వేళ్ళు" అని సహజ హైకూ చిత్రాన్ని ప్రదర్శించాడు.

నాకు నచ్చిన, నేను మెచ్చే కవి కోబయాషి ఇస్సా. సునిశిత ప్రకృతి పరిశీలన, సామాన్యుడి దృక్కోణంలో అల్పమైన క్రిమి కీటకాలపట్ల దయ కలిగిన అభివ్యక్తితో హైకూలు చెప్పడం ఇతని శైలి. అనవసరమైన ప్రాణహానిని నివారించే తత్వమే బౌద్ధం.

"హే... నన్ను కొట్టవద్దు :
ఈగ తన చేతులు కాళ్ళూ
రుద్దుతోంది" అనే హైకూలో ఈగ సహజ ప్రవర్తనను అత్యంత హృద్యంగా అభివ్యక్తీకరిస్తూ రాసాడు. నన్ను కొట్టకు అని మనిషిలా చేతులు

జోడించి ప్రాధేయపడుతున్నట్లు అభివర్ణించాడు కవి. జీవరాసుల్ని ప్రేమించే గుణాన్ని బోధించే బౌద్ధ తత్వంతో –

"ఓ చిన్ని
అనాథ పిచ్చుక –
వచ్చి నాతో ఆడుకో" అని అంటాడు. తన మూడేళ్ళ వయసులోనే తల్లిని కోల్పోయినవాడు కవి. అనాధగా ఆ బాధను ఇలా స్వీయానుభవాలను హైకూగా వ్యక్తీకరించాడు. కీటక ప్రపంచాన్ని సైతం ప్రేమించిన వాడు ఇస్సా. చెవిదగ్గరకు వచ్చి రొదచేసే దోమను ఉద్దేశించి ఇస్సా –

"చెవిదగ్గర దోమ.
నేను చెవిటివాడ్నని
తాననుకుంటుందా?!" అని అల్ప ప్రాణుల పట్ల కరుణ భావంగల కవిగా... అవే తన హైకూ కవితా వస్తువులుగా చేసుకుని అద్భుతమైన హైకూలు రాసిన కవి కోబయాషి ఇస్సా.

హైకూలను ప్రేమించే కవికి, ఇస్సాలా సునిశిత పరిశీలన ఉండాలి. హైకూ విమర్శకులు , ప్రసిద్ధ హైకూ కవి ఇస్మాయిల్ తన "నత్త ప్రణయ యాత్ర" హైకూ సంపుటిలో –

"కుడికంటితో ఓసారి
ఎడం కంటితో ఓసారి
పరీక్షించింది కాకి నన్ను" అనే హైకూ రాశారు. ఈ దృశ్యాన్ని మనం ఎన్నో మార్లు చూసినప్పటికీ హైకూగా అభివ్యక్తీకరించ లేకపోయాము.

"స్మశానం పొదలో చిక్కుకుని
బుల్లి పూల చొక్కా
రెపరెపా ఆడుకుంటోంది" అని 'వెన్నెలగా ఉంది' అనే తన హైకూ సంపుటిలో కవి గోపిరెడ్డి రామకృష్ణారావు భావోద్వేగానికి సంబంధించిన హైకూని రాసాడు.

"చేలో నీరు
కొంగలు
అంగలతో కొలుస్తున్నాయి" అని ఆబ్జెక్టివ్ స్కెచింగ్ తో "ఆకాశ దీపాలు"

అనే తన హైకూ సంపుటిలో లలితానంద్ దృశ్య హైకూ రాశారు. ఇదే శైలిలో 'దృశ్యాదృశ్యం' అనే తన హైకూ సంపుటిలో కవి బి. వి. వి. ప్రసాద్ –

"దూరంగా దీపం.
దానిని కాపాడుతూ
అంతులేని చీకటి" అనే హైకూ రాసాడు .

ఇలా తెలుగులోనూ అద్భుతమైన హైకూలు రాసినవారు ఉన్నారు. హైకూలు అధ్యయనం చేస్తే చక్కని హైకులను కంపోజ్ చెయ్యగలుగుతారు. వర్ధమాన హైకూ కవులు ఈ ప్రయత్నం చెయ్యాలి

(ఎ) లక్షణ విరుద్ధ హైకూలు :

హైకూ లక్షణాలకు విరుద్ధంగా, సాధారణ లఘు కవిత్వంలా రాసే వాటిని హైకూలుగా పరిగణించ కూడదు .

1) ఒకో హైకూకి ఒకో శీర్షిక ఉండరాదు:

ఒక అంశంపై పదుల హైకూలు రాయాలనుకున్నప్పుడు ఒక శీర్షికగా పెట్టుకొని కొన్ని హైకూలు రాసుకోవచ్చుగాని... ఒకో హైకూకి శీర్షికపెట్టి రాయడం చెయ్యకూడదు. సింగిశెట్టి సంజీవ రావు పాలపుంతను వర్ణిస్తూ "పాలపుంత" శీర్షికగా పెట్టి

"ఆకాశమిల్లు / మిణ్ణుర్లు కలబోసి / కల్లాపు జల్లు" అని రాశాడు. 17 అక్షరాలకు కూడా పాట్లు పడ్డారు.

2) అంత్య ప్రాసతో రాస్తేనే హైకూ కాదు:

"చెప్పేవి నీతులు / తీసేవి గోతులు / బల్ల కింద చేతులు" అంటూ అంత్యప్రాసతో హైకూగా రాశారు భరద్వాజ. మినీ కవితలా అంత్యప్రాస ప్రధానం కాదు హైకూలో!

3) కవితాత్మక పదాలు హైకూలు కావు :

"సూర్యుడు కన్ను మూసాడు / నీడలన్నీ కలిసి /
రాత్రిని ప్రకటించినై " అని 'ఆకాశం నేలపాలైంది' అనే హైకూ సంపుటిలో కవి లంకా వెంకటేశ్వర్లు రాసాడు. 'ప్రకటించినై' పదప్రయోగంతో కవిత్వ భాష వచ్చింది

4) అభిప్రాయలు హైకూలు కావు :

"వార్తాపత్రికకు / నిన్నటి వైభోగం / నేడు లేదు" అని మాధవీ సనారా 'రెక్కల గుర్రం' అనే తన హైకూ సంపుటిలో రాస్తారు.

ఇలా హైకూ లక్షణాలకు విరుద్ధమైన ఈ తరహా హైకూలను వర్ధమాన హైకూ కవులు ఎవరూ అనుసరించవద్దు.

(ఏ) తెలుగునాట హైకూ విషయంలో ఇన్నాళ్లు జరిగింది ఇదే:

హైకూ అంటే మూడు పాదాలలో రాయడమే కదా... 'ఇక చూడూ' అంటూ రామకోటిలా హైకూలు రాసినవారు అనేకులు. కాస్త అధ్యయనం చేసిన వారు కరువు. మా బోటివారిని అడిగినవారు లేరు. నన్ను కొందరు ముందుమాట రాయమని కోరితే హైకూలు సరిచేయమని సలహా ఇస్తే చిన్నబుచ్చుకొని మరొకరి చేత పొగిడించుకుంటూ ముందుమాట రాయించుకుని పుస్తకం వేసినవారు చాలామంది. కనీసం హైకూలలో పట్టు వున్న కవులను ప్రేరణగా తీసుకునేవారు కూడా లేరు. పైగా తెలుగులో హైకూ భజన మండళ్లు ఉన్నాయి . ఒకరినొకరు పొగుడుకోవడం , ఒకరిపై ఒకరు ఆర్టికల్స్ రాయించుకోవడం జరిగింది. హైకూను ఒకరి ఆస్తిలా ఒకరికి వీలునామా రాసినట్లు పబ్లిక్ గా ఒక సీనియర్ కవి సామాజిక మాధ్యమాల్లో రాయడాన్ని నేను ఆక్షేపించిన సందర్భం కూడా ఉంది. జపనీయ కవితా ప్రక్రియలైన హైకూ , ఫోటో హైకూ, సేన్ ర్యూ, తంకా, హైగా, హైబున్ ప్రక్రియలను అనుసరించిన హైకూ కవిగా, హైకూ క్లబ్ అధ్యక్షునిగా నేను ఇన్నాళ్లూ గమనిస్తూ వస్తున్న విషయాలు ప్రస్తావించాల్సిన సందర్భం. నేను ఇక్కడ ఎవరి పేర్లు ప్రస్తావించ కుండా మార్పును కాంక్షిస్తూ ముగిస్తున్నాను.

మనసు

శ్రీ శేఖర్ మంత్రి ప్రభాకర్, ✆ 98858 74474

1
మనసే మూలం
అన్ని అనర్థాలకు
నిలకడ లేక

2
మనసు లేని
మనిషంటూ ఉంటాడా
రాక్షసుడేను

3
ఒక్కటైతేనే
ఇద్దరి మనసులు
సహచరణం

4
మనసు చెర్వు
ఆలోచన అలలు
కల్లోల రాగం

5
మన్మథ బాణం
ఆమె కొసరి చూపు
మనసు బలై

6
మనిషితనం
నిరూపించుకుంటుంది
మంచి మనస్సు

7
త్యాగధనులు
సమాజ వృక్షానికి
జీవనాడులు

8
మనసు లోకి
చొచ్చుకుని పోయేది
మనసొక్కటే

9
ప్రేయసి వద్దే
మనసు దాచిపెట్టా
తిరిగివ్వలేదు

10
మనసు భాష
మౌన రాగాల గానం
భావాలే లిపి

హైకు - ఒక పరామర్శ

డా. రూప్ కుమార్ డబ్బీకార్
99088 40186

జపానీయ సాహిత్యంలో ప్రసిద్ధి పొందిన 'హైకు' కవిత మూడు పాదాలతో, 17 మాత్రల (Syllables) తో రూప నిర్మాణం కలిగివుంటుంది. మొదటి పాదంలో ఐదు, రెండవ పాదంలో ఏడు, మూడవదైన చివరి పాదంలో ఐదు మాత్రలతో మొత్తంగా 5–7–5 పద్ధతిలో హైకు సాగుతుంది. ఈ విషయం సాధారణంగా అందరికి తెలిసినదే. హైకు రూప పరంగా చిన్నదైనా దాని చరిత్ర అంత చిన్నది కాదు, నిర్లక్ష్యం చేసేది కాదు. ప్రాకృతిక దృశ్యం, పదదృశ్యంగా పరిణామం చెందుతున్న దశలో కవి పొందే అనుభూతి, అనుభవం హైకుగా రూపుదిద్దుకుంటుంది. 'హైకు' మూడు మాత్రల పదం. జపాన్ భాషాపదమైన 'హైకై' నుండి వచ్చింది. 'హైకై' అనగా వ్యుత్పత్తి అర్థంలో 'సరదా' అని అర్థం. 'హైకై' కు మూలమైన 'హైకై రెంగ' అనే పద్య శైలిని మొదటగా యమజకి సోకన్ (1465 –1553) మరియు అరకిడ మొరిటెకె (1473 –1549) అనే ఇద్దరు కవులు ప్రధానంగా చమత్కార శైలితో సాహితీ లోకానికి అందించారు. అది పదహారవ శతాబ్దంలోని మధ్యకాలం – మ్యూరోమచి కాలానికి చెందినది. 17వ శతాబ్ది ప్రారంభంలో మత్సుంగ టైటొకు (1570 – 1654) ద్వారా హైకై మరింతగా వ్యాప్తిలోకి వచ్చింది. ఇతను హైకై శైలిని హృద్యంగా తీర్చిదిద్దాడు. ఐనా హాస్యం, చమత్కార ధోరణి వెన్నుదన్నుగా వుండేది. ఈ శైలి 'కోఫు' శైలిగా పిలువబడేది. దీనినే 'టైమన్–నొ– హైకై' అని కూడా పిలిచే వారు. తర్వాత నిషియమ సొయిన్ (1604–1682) ద్వారా 'డానిన్' శైలిగా హైకై మరో రూపు దాల్చింది. ఇందులో హాస్యం, సరదా అంశాలుగా వున్నా స్వచ్ఛత, నిర్మలత్వం అనేవి ప్రధాన ఆకర్షణలుగా వుండి జనాదరణ పొందాయి. ఈ డానిన్ శైలినే మత్సువొ బషో పూర్తిగా మార్చివేసి హాస్యం, ఛలోక్తులు మారుగా గరిమ, అనుభూతి, అనుభవం, ఆలోచన ప్రధానంగా ఉండేటట్లు

'హైకై' ని సంస్కరించి ప్రపంచ సాహిత్యంలోకి వెళ్ళడానికి మార్గం సుగమం చేసాడు. ఇతను వస్తువు, విషయి, సరియైన పదాల ఎంపికకు అవకాశాన్ని కలిగించాడు. బషో శైలి 'షోపు' శైలిగా పేరు పొందింది.

హైకు నిజానికి అనేక తాత్విక, సాంకేతిక పదాలతో చాలా సంక్లిష్టంగా వుంటుంది.

జపానీయ కవితా రూపాలలో 'తంక', 'చోక' అతి పురాతనమైన రూపాలు. ఈ రెండు రూపాల నుండి 'రెంగ', 'హైకై' అని పిలువబడే గొలుసు పద్యాలు రూపుదిద్దుకున్నాయి. 'తంక', 'చోక' రూపాలు 13వ శతాబ్ది వరకు జనాదరణ పొందిన శైలులు కాగా 13 నుండి 19వ శతాబ్ది వరకు 'రెంగ', 'హైకై' పద్యమాలికలు రాజ్యమేలాయి. 'తంక' అనే పద్య రూపంలో రెండు పద్యాలుంటాయి దీనిలో మొదటి పద్యం 5–7–5 మాత్రలతో వుండి మూడు పాదాలతో 'కామి నొ కు' గా, రెండవ పద్యం రెండు పాదాలతో 7–7 మాత్రలతో 'షిమొ నొ కు' గా పిలువబడుతుంటాయి. ఈ రెండు పద్యాలను కలిపితే 'తంక' ఏర్పడతుంది. అనగా ఐదు పాదాలు వుండి 5–7–5– 7–7 నిర్మాణంతో ఉంటాయి. ఈ పద్యాలు ఇదే నిర్మాణంతో నూరు పద్యాల మాలికతో అల్లబడి వుంటే 'రెంగ' అని, 36 పద్యాలతో ఉంటే 'హైకై' గా పిలుచుకుంటారు. 'తంక' ఐదు పాదాలుగా అనగా 'కామి నొ కు' (5–7–5) 'షిమొ నొ కు' (7–7)ల కలయికతో ఏర్పడుతుందన్న విషయం తెలిసింది. అలాగే అనేక 'తంకాల' కలయికతో 'రెంగ', 'హైకై' లు ఏర్పడతాయన్న విషయాన్ని మనం గమనించవచ్చు. ఇందులో ప్రారంభ పద్యమైన 'కామి నొ కు' (5–7–5) ను 'హొక్కు' గా పిలుస్తారు. హొక్కు అనగా ప్రథమ పద్యం. ఈ హొక్కు అనే పదమే తరువాత కాలంలో మసవొక షికి అనే కవి ద్వారా అతని 'Hiaku Reform Movement' ఫలితంగా 'హైకు'గా మారి 19, 20 వ శతాబ్దిలో చాలా ప్రాచుర్యానికి వచ్చింది. 'తంక' హ్రస్వ రూపంతో వుండే కవిత, 'చొక' దీర్ఘ కవితా రూపం. 'చొక'లో మొదటి పాదం ఐదు మాత్రలతో, రెండవ పాదం ఏడు మాత్రలతో వుండి అలా ఎంత పొడవైన సాగుతుంది. కానీ చివరి పాదం అనగా ముగింపు పాదం అదనంగా ఏడు మాత్రలతో వుండి పద్యం పూర్తవుతుంది. హైకు నిజానికి అనేక తాత్విక, సాంకేతిక పదాలతో చాలా సంక్లిష్టంగా వుంటుంది. దీని చరిత్ర, రూపనిర్మాణాల లోతుల్లోకి వెళితే

అనేక సాంకేతిక పదాలతో విభిన్నమైన శైలులు,లక్షణాలు తెలుస్తాయి. స్థూలంగా కొన్ని ముఖ్యమైన విషయాలను మాత్రం ఇక్కడ ప్రస్తావిస్తాను.

> **హైకు ధోరణి అంటే అనుభవాన్ని దాని నిజ స్థితిలోనే స్వీకరించడానికి తెలిపే సంసిద్ధత.**

హైకు మౌలిక అంశాల్లో ముఖ్యమైనది సౌందర్య ధోరణి. ఎందుకనగా హైకు మౌలికంగా సౌందర్యాశ్రయి. ఉదాహరణకి ఒక కవి తన ఇద్దరు మిత్రులతో ఒక ఎండాకాలపు సాయంత్రం వరి పొలాన్ని దర్శించాడనుకుందాము. ఇద్దరు మిత్రుల్లో ఒకరు రైతు, వరిపొలం యజమాని. మరొకరు కీటకాలపై పరిశోధనలు చేసే శాస్త్రవేత్త. ఆ సమయంలో ఒక ఎర్రని తూనీగ వచ్చి ఒక వరిమొక్క అంచు మీద వాలుతుంది. తూనీగ అందాన్ని ఆస్వాదించినా, రైతు వరి పంటను చూసి వచ్చే లాభాలను ఊహించుకుంటూ సంబరపడిపోతాడు. శాస్త్రవేత్త, శాస్త్రీయపరమైన అంశాల గురించి ఆలోచిస్తూ వుంటాడు. పక్కనే వున్నకవి కూడా తూనీగను గమనిస్తాడు. కానీ అతని అభిముఖ్యత మాత్రం తూనీగ రంగు, రూపం, గుణం మీద మాత్రమే వుండి వైయక్తిక భావనను కలిగిస్తుంది. రైతుది వ్యాపారాత్మక ధోరణి కాగా శాస్త్రవేత్తది శాస్త్రీయ ధోరణి అవుతుంది. కానీ, కవి వస్తువును వస్తుగతమైన స్థితిలోనే చూడగలగడం, కేవలం సాక్షియై ఆ వస్తువుని దర్శించడాన్ని 'సౌందర్య ధోరణి' అంటారు. దీనినే 'హైకు ధోరణి' అని కూడా అంటారు. 'హైకు ధోరణి' అంటే అనుభవాన్నిదాని నిజస్థితిలోనే స్వీకరించడానికి తెలిపే సంసిద్ధత. ఎందుకనగా హైకు కవి, కవిగా మనగలుగుతున్నంత వరకు తన వ్యక్తిగత లేదా అహంభావపు అవసరాలను అతనికి అతని అనుభవపు నిజస్థితికి మధ్య చొరబడనీయడు. ఎప్పుడైతే మనం ప్రకృతి ముందు స్వేచ్ఛగా, భయరహితంగా, నిజాయతీగా, వినమ్రతతో ఉంటామో, ఎప్పుడైతే మనం ప్రకృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచుకొని ఒకటిగా మమేకమై పోతామో, ఎప్పుడైతే మనకు తోచిన కాల్పనిక ఊహల్ని ప్రకృతిలోకి ప్రవేశపెట్టమో అప్పుడు ' హైకు ధోరణి ' ఏర్పడడానికి మార్గం సుగమమవుతుంది. ఒట్సుజి ప్రసిద్ధ కవి, హైకు సైద్ధాంతీకుడు; ఇతనంటాడు, " హైకు కవి, వస్తువు లేదా దృశ్యం తన అనుభవంలోకి రావడానికి ముందుగానే తనదైన మేధాపరమైన ఊహల్ని త్యజించాలి. కవి తన వ్యక్తిగతమైన, స్వీయ సిద్ధాంతాలను హైకు రచనలోకి

జొప్పించరాదు. ఎందుకనగా అలాంటి ఆలోచనలు తార్కిక సిద్ధాంతంపై ఆధారపడి హైకుకు ప్రధాన ప్రేరణయైన అనుభూతిని నాశనం చేస్తాయి.”

హైకు లక్షణాల్లో మరో ముఖ్యమైన విషయం ఋతువుని సూచించే పదం. ఋతువుని సూచించే పదాన్ని జపాన్ భాషలో ‘కిగో’ అంటారు. ఉదాహరణకు ‘సోడో’ అనే కవి హైకులో ఎండాకాలపు ప్రారంభ దశను తెలిపే మూడు ప్రతీకలను ఈ కింద చూడవచ్చు.

Me ni aoba
Yama–hototogisu
Hatsu katsuo
–Sodo

Green leves to see ,
A mountain Cuckoo and the first
Bonito–all three
– H.G.Henderson (ఆంగ్లానువాదం)

పచ్చనాకులు
అడవి కోకిల, ముందుగా
చేపల గుంపు ...
అనువాదం : డి . రూప్ కుమార్

పై హైకు లో సమానమైన ప్రతీకలను వైవిధ్యమైన అనుభూతులతో ఒకదాని పైన ఒకటి కూర్చడం కనబడుతోంది.

(‘Hototogisu’ అనేది జపాన్ లో వుండే ఒక జాతి కోకిల. చిన్నశరీరంతో అందంగా ఉంటుంది. సాయంసంధ్య వేళల్లో కూస్తుంది. కానీ కోకిల స్వరం విషాదాన్ని వ్యక్తీకరించే ధ్వనితో ఉంటుంది. అందుకే ఆ కోకిలది భగ్నప్రేమగా (disappointed love) అక్కడి జనం భావిస్తారు.)

హైకు కవి ప్రధానంగా తాను దర్శించిన వస్తువు, ఆ వస్తువు పరిసర వాతావరణాన్ని, ఆ వాతావరణంలో అతను పొందిన అనుభవాన్నివ్యక్తీకరించడానికి ప్రయత్నం చేస్తుంటాడు. ఇందుకు స్థలం, కాలం

ప్రధాన ప్రేరకాలుగా ఉంటాయి. ఇక్కడ అనుభవాన్ని వ్యక్తీకరించడమంటే కవి తన అనుభవాన్ని వివరించడం కాదు. కవి తానే ఒక అనుభవంగా మారడం అన్నది అర్థం చేసుకోవాలి. అలా హైకు పితామహుడిగా గుర్తించబడిన బషో ఒక దృశ్యాన్ని తన అనుభవంలోకి తీసుకోగలిగి మరచిపోలేని సంఘటనగా హైకులోకి మార్చగలిగాడు.

Kare eda ni
karasu no tomarikeri
aki no kure
– బషో

On the withered branch
A crow has perched;
The autumn evening.
– (ఆంగ్లానువాదం – David)

ఎండుకొమ్మ పై
ఒంటరిగా కాకి
శిశిర సంధ్య – (అనువాదం : రూప్ కుమార్ డబ్బీకార్)

పై హైకుకి ఎండు కొమ్మ, కాకి, సంధ్యా సమయం ప్రధాన కారకాలుగా వున్నాయి. ఇవి లేకుండా సౌందర్యానుభూతిని పొందడం కష్టం. ఇక్కడ కాకి నలుపు రంగు, ఎండిన కొమ్మ కాంతి హీనత, జీవం లేని స్థితిని తెలుపుతున్నాయి. శిశిర ఋతువు సంవత్సరాంతాన్ని సూచిస్తుంది. సంధ్య మసక వెలుతురు, పగటి చివరి దశను సూచిస్తూ.., అలా మూడు పాదాలలో దృశ్యాలు ఒకదానికొకటి సమన్వయంగా ఉంటూ హైకు పాదాలకు బలాన్నిస్తున్నాయి.

జపాన్ జీవనశైలి, కళలు, సంస్కృతులు, సాంప్రదాయాలపై షింటోయిజం, టావోయిజం, కన్ఫ్యూషియనిజంతో బాటు బుద్ధిజానికి చెందిన అనేక శాఖల ప్రభావం వుంది. హైకు తరువాత వచ్చిన 'సెన్ ర్యూ' లాంటి రూపాలు ప్రధానంగా లౌకిక నేపథ్యాన్ని కలిగివుంటాయనే అభిప్రాయమున్నా ఈ రూపాలు కూడా పై నాలుగు సాంప్రదాయాలను ఇముడ్చుకొని వుంటాయి.

జపానీస్ హైకును వెలుగులోకి తెచ్చిన నలుగురు ప్రముఖులలో 'మత్సువొ

బషో' ప్రథముడు. హైకు పితా మహుడిగా పరిగణించబడే బషో (Basho) జపాన్‌లోని ఐగ ప్రావిన్స్ (Iga Province), యూఎనో (Ueno) ప్రాంతంలో 1644 సంవత్సరంలో జన్మించాడు. నవంబర్ 28,1694లో మరణించిన బషో, ప్రపంచ సాహిత్య చరిత్రలో జపానీయ హైకు కవిగా చిరస్థాయిగా నిలిచిపోయాడు. తన జీవిత కాలంలో అధిక భాగం అనేక దేశాల పర్యటనలు, యాత్రలు చేయడంతో గడిపేవాడు. అలా తన యాత్రా కాలంలోని అనుభవాలు, సంఘటనలను తెలుపుతూ చేసిన ప్రసిద్ధ గ్రంథం "హొకు నొ హొసొమిచి" (Oku no Hosomichi – The narrow road to the deep north). అంతర్జాతీయ కవుల దృష్టి నాకర్షించిన బషో ప్రసిద్ధ హైకులను వారి కోణంలో పరిశీలిద్దాం:

బషో హైకుల్లో 'The Old Pond', ఇప్పటికీ సాహితీ చర్చల్లో దాని ప్రస్తావన వస్తూ వుంటుంది. జపానీస్ భాషలో ఈ హైకు:

Furu ike ya
kawazu tobikomu
mizu no oto –

Old pond...
a frog jumps in
water's sound – ఆంగ్లానువాదం by Robert Hass:

పాత కోనేరు
కప్ప దుమికింది
నీళ్ల చప్పుడు – తెలుగు అనువాదం : ఇస్మాయిల్

పై హైకుని కాస్త విశ్లేషణాత్మకంగా చూద్దాం .

Old pond – పాత కోనేరు

సాధారణంగా చూస్తే పై హైకులో ప్రత్యేకత ఏమీ కనిపించదు. హైకును అంతర్వీక్షణం చేయాలంటే కవి సృష్టించిన దృశ్యాన్ని పాఠకుడు కూడా అనుభవంలోకి తెచ్చుకోవాలి. పై హైకు పాత కోనేటిని, కప్ప సృష్టించిన ధ్వనిని/శబ్దాన్ని ఆలంబనగా చేసుకుంటుంది. ఈ హైకులో రెండు స్పష్టమైన దృశ్యాలున్నాయి. ఒకటి–నిశ్చలమైన కోనేరు (static image), రెండు–

కప్ప దుమకడం అనే క్రియాశీలక చర్య (Dynamic image). అలాగే కప్ప నీటిలోకి దుముకడం వలన ఏర్పడిన శబ్దం ద్వారా సృష్టించబడిన ధ్వన్యాత్మకమైన చర్య. పాఠకుడు హైకును చదువుతున్నప్పుడు పద దృశ్యాలను తన మనో పలకంపై తెచ్చుకోకపోతే కవిత అంతరాత్మను స్పర్శించలేడు. హైకు లోతుల్లోకి వెళ్తే 'పాత కోనేరు' – ఒక పురాతనమైన జలాశయం, జనావాసానికి దూరంగా లేదా చాలా కాలం నుండి అలా పడివుంది. ఆ తర్వాత కప్ప నీటిలోకి దుమకడం. ఇక్కడ రెండు విషయాలు కనబడతాయి. అవి – ఋతు సంబంధమైనవి; కప్ప నీటిలోకి దుమకడానికి చూడవలసిన కారణం. చివరగా నీటి శబ్దం పాఠకుడి మనసులో ప్రతిధ్వనింపజేయడం. ఈ ధ్వనియే లోతైన అర్థాన్ని కలిగివుంది. విశ్లేషిస్తే ఈ హైకు క్లుప్తత, సాంద్రతలో భిన్న పార్శ్వాల అర్థం నిబిడీకృతమై వుంది.

ఇక్కడ కప్ప కూడా ఒక metaphor. మానవ స్పృహను చైతన్య పరచడానికి వాడబడే క్రియాసాధనం, ప్రేరణ.

హైకు కి ఉండాల్సిన ప్రధాన లక్షణాలుగా 5–7–5 శిల్ప నిర్మాణం, 'కిరేజి' (Kireji – రెండు దృశ్యాలను విభజించే పదం, ఆంగ్లభాషలోని విరామ చిహ్నంలాంటిది) ద్వారా ఒక దృశ్యం నుండి మరో దృశ్యంలోకి మారడం (Shifting of image), అలాగే 'కిగో ' (Kigo) అనగా ఋతు సంబంధమైన పదం – 'కప్ప' కలిగివున్నాయి. కప్ప సాధారణంగా వర్ష ఋతువు లేదా వసంత ఋతువును సూచిస్తుంది. కానీ ఇక్కడ కప్ప ద్వారా సృష్టించబడిన ధ్వని మాత్రమే వ్యక్తమవుతోంది . ఇతర శబ్దాలు లేకుండా ఉండటం వలన 'కిగో'ను ఇక్కడ వసంత ఋతువుకు ప్రతీకగా తీసుకోవచ్చని జపానీయ విశ్లేషకులు అభిప్రాయపడతారు. Pond is a metaphor for subconscious mind అని భావిస్తారు. కోనేటిని ఒక అంతశ్చేతన – మానసిక స్థితిని సూచించే పదంగా చెప్పవచ్చు. Old pond – ఒక personification ను చూపిస్తుంది. అనగా ఒక నిర్జీవమైన లేదా అచేతనమైన వస్తువుకు మానవీయ లక్షణాలను ఆపాదించి ఒక సజీవ దృశ్యాన్ని సృష్టించడం. ఆ విధంగా బషో పాత కోనేరును personify చేసాడు.

ఇక్కడ కప్ప కూడా ఒక metaphor. మానవ స్పృహను చైతన్య పరచడానికి

కప్ప, చెరువు ప్రశాంతతను భగ్నం చేస్తుంది. కప్ప స్వాభావికంగానే దుముకుతుంది.

వాడబడే క్రియాసాధనం, ప్రేరణ. ప్రకృతిలో ఒక వస్తువు లేదా ప్రాణి ద్వారా సృష్టించబడే సహజమైన ధ్వని ని 'Onomatopoeia' అంటారు. ఇది ఒక సాహితీపరమైన ప్రక్రియ. ఇక్కడ కవి 'నీటి ధ్వని' ద్వారా ఈ ప్రక్రియను సాధించాడు. దృశ్యాన్ని ప్రభావితం చేయడానికి వాడబడినదని ఫుమికో సైషో (Fumiko Seisho) వ్యాఖ్యానిస్తాడు. పాత కోనేరు ఎక్కడో అడవి ప్రాంతంలో, లేదా జనావాసాలకు దూరంగా ఉండాలి. ఎందుకనగా బషో నీటి చప్పుడు మినహా ఎలాంటి ఇతర శబ్దాలు వినలేదు. కావున కోనేరు ఎక్కడో దూరంగా, ప్రశాంతమైన వాతావరణంలో, నిశ్శబ్ద వాతావరణంలో వుంది అని భావించాడు. 'పాత ' అనే పదంతో కాలానికి తట్టుకొని నిలబడింది; కవి ఈ కోనేటితో ఒక అవినాభావ సంబంధం కలిగివున్నాడు. స్వభావాలలో దగ్గరితనం వుంది. కవి, కోనేరు నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వున్నారు. 'పాత కోనేరు' అంతశ్చేతనకు ఒక ప్రతీక లాంటిది (symbol of sub-conscious mind). నిశ్శబ్దత, పాత కోనేరుకు వున్న అంతశ్చేతన అలాగే కవికి ప్రతీక. కవి ఇక్కడ మరెవరో కాదు స్వయంగా బషో.

Frog jumps in : కప్ప దుమికింది

కప్ప, చెరువు ప్రశాంతతను భగ్నం చేస్తుంది. కప్ప స్వాభావికంగానే దుముకుతుంది. కప్ప ఎందుకు దుమికింది? హైకు పతాక స్థాయిని అర్థం చేసుకోవాలంటే ముందుగా పాఠకుడు ప్రశ్నించుకోవాలని విశ్లేషకులు అంటారు. కప్ప గుడ్లు పెట్టడానికి నీటిలోకి దుమికిందా అని అనుకోవడానికి వీల్లేదు. ఎందుకనగా వర్ష ఋతువు లేదా వసంత ఋతువు గుడ్లు పెట్టడానికి అనువైన ఋతువు కాదని భావిస్తారు. అది కేవలం biological instinct – దైనందిన జీవన చర్య, సహజ స్వభావం. కోనేటి నీటిలో దూకి తాను తిరిగి తన సుషుప్తి అవస్థను చైతన్యపరుచుకోవడం సూచిస్తుంది.

Sound of water : నీళ్ల చప్పుడు

ఇక్కడ ధ్వని ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. సృష్టించబడిన ధ్వని కృతకమైనది కాదు. ధ్వని సృష్టించ బడటానికి బాహ్య చర్య కారణమైంది.

కప్ప నీటిలోకి దుమికినపుడు క్షణకాలం కోసం ధ్వని పుట్టింది. It is not shrill. It is not deep. ధ్వని తరంగాలు నీటి మధ్య భాగంలో కేంద్రీకృతమై వున్నాయి. ఆ ధ్వని ప్రభావం వలన కవి మనసు జాగృదావస్థలోకి చేరుకుంటుంది. కానీ కవి ఏకాగ్రతను భంగపరచదు. అందుకు విరుద్ధంగా కవిని సమాధిలోని (trance) ఉచ్ఛస్తితికి చేర్చుతుంది. మరో ఉన్నత దశకు చేరుకుంటుంది. ఇలా హైకు తాత్వికమైన లోతైన అర్ధాన్ని అర్ధం చేసుకున్న పాఠకుడు హైకు ను ఆనందిస్తాడు. (ప్రతి హైకును విమర్శకులు భిన్న కోణాలలో విశ్లేషించుకోవచ్చు. ఇదే హైకును మరో విధంగా కూడా విశ్లేషించుకోవచ్చు).

> **నిశ్శబ్ద ప్రపంచంలోని ప్రశాంతతను ఒక చిన్న జీవి భంగపరిచిందనే భావన మాత్రమే అతని మనసులో కలిగింది**

ఈ హైకును ఆంగ్ల కవులు అనేక రకాలుగా ఆంగ్లంలో అనువదించారు, విశ్లేషించారు. బషో తన 43 వ ఏట బహుశా 1686 లో హైకు కవుల సమ్మేళనంలో ఈ హైకును చెప్పినట్లు అభిప్రాయపడతారు. కొందరు 'ధ్వని'కి ప్రాధాన్యతనిచ్చి విశ్లేషించగా మరి కొందరు 'నిశ్శబ్దం' అనే వస్తువునకు ప్రాధాన్యతనిచ్చారు. చాలా వరకు, చివరికి జపానీయ కవులు కూడా, బషో స్వానుభవంతో దృశ్యంలో తానే వున్నప్పుడు కలిగిన అనుభవంతో ఈ హైకు రాసాడనుకుంటారు. కాని అది వాస్తవం కాదని కొందరి అభిప్రాయం. హైకు సమ్మేళనం బషో ఆశ్రమానికి (అరటి కుటీరం) దగ్గరగా జరిగినపుడు అక్కడ ఓ కోనేరు కూడా ఉండేది అంటారు. హైకు కవులకు ఆ రోజు సమ్మేళనానికి ప్రత్యేకమైన అంశం ఎన్నుకున్నారు. అది 'కప్ప' అనే అంశం. ఫలితంగా బషో తన హైకులో కప్పను ప్రవేశపెట్టాడు అని కూడా అంటారు. అతని ఆశ్రమానికి దగ్గరలో కోనేరు ఉండటం వలన నీటి చప్పుడు వినే అవకాశం ఉంది. కాని ఈ హైకు రాసినప్పుడు ఆ కోనేరు బషో దృష్టిలో లేదు. బషో శిష్యుడు షికొ రికార్డు ప్రకారం బషో "కప్ప దుమికింది /నీళ్ల చప్పుడు" అనే పంక్తులు మాత్రమే మొదటగా రాసాడు, ఆ తరువాత హైకును చేసినపుడు బషో పాత కోనేరును చేర్చడానికి నిర్ణయించుకున్నాడని తెలుస్తుంది. నిశ్శబ్ద ప్రపంచంలోని ప్రశాంతతను ఒక చిన్న జీవి భంగపరిచిందనే భావన మాత్రమే అతని మనసులో

కలిగింది అని భావిస్తాడు. ఇలా హైకు విశిష్టతను బషో హైకుల్లో చూడవచ్చు.

బషో తర్వాత ద్వితీయ స్థానంలో వున్న యొస బుసొన్ (1716–1783) విషయానికి వస్తే ఇతని హైకు ప్రకృతిని, మానవ నైజాన్ని ఏకీకృతం చేయడమే గాకుండా వాటి సారాంశాన్ని చిత్రపటాలుగా తీర్చి దిద్దుతాయి. అంటే బుసొన్ హైకు ప్రాకృతిక అనుభవాన్ని బొమ్మ కడతాయి .

ఒంటరితనంలో
నా కర్రనెక్కడో మర్చిపోయాను
శిశిర సంధ్య – (అనువాదం : గాలి నాసరరెడ్డి)

తృతీయ స్థానంలోని వాడైన కొబయషి ఇస్సా (1763–1827) పసి హృదయంలాంటి నిష్కల్మషమైన అమాయకత్వపు ముద్రను ప్రకృతితోను, మానవ ప్రకృతితోను ముడిపెట్టి హైకు చెప్పేవాడు .

నశ్వరలోకంలో
చిన్న పిట్టకూడా
గూడు కట్టుకుంటోంది – (అనువాదం : గాలి నాసరరెడ్డి)

నాల్గవ స్థానంలోని వాడైన మసవొక షికి (1867– 1902) హైకు పదానికి ప్రాచుర్యాన్ని అందించిన వాడు. ఆధునిక హైకుకి ఆద్యుడని చెబుతారు. సామాజిక వస్తువును, వ్యంగాన్ని హైకులలో వాడేవాడు.

పిచ్చుక గెంతుతోంది
వరండా పొడవునా
తడి కాళ్లతో – (అనువాదం : గాలి నాసరరెడ్డి)

తెలుగు సాహిత్యంలో హైకు ప్రస్థానం :

తెలుగు సాహిత్యాన్ని పరిశీలిస్తే 20వ శతాబ్ది ప్రథమార్థంలోనే తెలుగులో జపానీయ హైకు (హొక్కు) కవిత్వం గురించి దువ్వూరి రామిరెడ్డి ప్రస్తావించిన దాఖలాలున్నాయి. 1923లో ఈయన రాసిన 'మర్మ కవిత్వం' అనే వ్యాసంలో ఒక జపానీయ చిత్రపటం గురించి వివరిస్తూ "జపాను కవుల హొక్కు కవిత్వమునందు ఈ చిత్ర పటము నందును అనవసర కళాప్రదర్శనమౌ నాకగుపడలేదు" అన్నారు. పాద సూచికలో హొక్కు కవితా రూపాన్ని

పరిచయం చేస్తూ ఉదాహరణగా ఒక కవితను అనువదించి కూడా చూపారు. ఆ అనువాదం:

"కాలి పోయెను శాల; రాలెడు పూవు
లెంత నిశ్చల కాంతి నెసగెడు నిపుడు"

అలాగే రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మ "గాథా సప్తశతి "లోని కొన్ని భాగాలను తెలుగులో అనువదించి 'శ్రీ శాలివాహన గాథా సప్తశతీసారము' పేరుతో 1931లో తొలిసారిగా ముద్రించారు. ఈ పుస్తకానికి రాసిన ప్రస్తావనలో కట్టమంచి రామలింగారెడ్డి జపాన్ దేశీయుల కవిత్వాన్ని ప్రశంసిస్తూ ఒక హైకును అనువదించి ఉదాహరణగా చూపారు. ఆ అనువాదం:

ఇండియన్ హైకు క్లబ్ 2002లో స్థాపించారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలోనే తొలి తెలుగు హైకు సాహిత్య మాస పత్రిక 2003 లో ప్రారంభమైంది.

"తుమ్మెదలబట్టుచు మఱచి తొలగి యెటకు
బోయినాడొకొ నేడు నా ముద్దు కొడుకు"

హైకును అనువాద రచనలుగా గాకుండా తెలుగులో మొదటగా రాసిన కవి గాలి నాసర రెడ్డి. వీరి తెలుగు హైకులు మొదటగా 1990 మార్చ్ లో ఆంధ్రభూమి దినపత్రిక, ఆదివారం అనుబంధం సంచికలో అచ్చయ్యాయి. ప్రసిద్ధ కవి ఇస్మాయిల్ హైకులు 1991 జులైలో ఆంధ్రజ్యోతి దినపత్రికలో వచ్చాయి. పెన్నాశివరామకృష్ణ 'రహస్య ద్వారం' (1991) తెలుగులో మొదటి హైకు సంపుటి కాగా మాకినీడి సూర్య భాస్కర్ 'హైకు కవిత్వం, అనుశీలన:ఒక అవగాహన' (1999) మొదటి వ్యాస సంపుటి. కానీ, హైకుకు సంబంధించిన చరిత్ర, నేపథ్యం, కవిత్వ లక్షణాలు, స్వభావాలు ఇత్యాది వివరాలతో వచ్చిన మొదటి హైకు వ్యాస సంపుటి 2009 లో వచ్చిన డా. రూప్ కుమార్ డబ్బీకార్ 'హైకు సారస్వతం'. హైకు పరివ్యాప్తికై అనకాపల్లిలో వ్యవస్థాపక అధ్యక్షులుగా ప్రముఖ కవి డా.తలతోటి పృథ్వీరాజ్ 'ఇండియన్ హైకు క్లబ్' 2002లో స్థాపించారు. ఈ క్లబ్ ఆధ్వర్యంలోనే తొలి తెలుగు 'హైకు సాహిత్య మాస పత్రిక' 2003 లో ప్రారంభమైంది. జాతీయ స్థాయిలో అనేక కవులు చెప్పిన హైకులతో 'అరటి కుటీరం' అనే సంపుటిని 2004 లో తీసుకు వచ్చింది. 'తెలుగు హైకు

– ఒక పరిశీలన 'అనే అంశంతో పరిశోధన చేసిన కవి సత్రీ పొట్టి శ్రీ రాములు విశ్వ విద్యాలయం నుండి Ph.D తీసుకున్నారు. గూగుల్, ఇంటర్నెట్ లలో లభ్యమైన ఆంగ్ల సాహిత్యంలోని సమాచారంతో హైకు ప్రక్రియకు సంబంధించిన విషయాలను తెలుసుకోవడం మినహాయించి మరే ఇతర ప్రామాణికమైన గ్రంథాలు తెలుగులో లేకపోవడంతో తమకు అందిన మేరకు దొరికిన సమాచారాన్ని స్వీకరించి వీలైనంత వరకు హైకు రాయడానికి కవులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటి వరకు హైకుకు సంబంధించిన అనేక విషయ వివరణలతో తెలుగులో వచ్చిన ఏకైక గ్రంథం డా. రూప్ కుమార్ డబ్బీకార్ రచన ' హైకు సారస్వతం' మాత్రమే. ఎందరో ఈ పుస్తకాన్ని Reference Book గా చదువుతున్నారు.

హైకును స్థూలంగా అర్థం చేసుకునే ప్రయత్నం దిశగా ఈ వ్యాసం రాయడం జరిగింది. హైకును సాధారణంగా తాత్విక చింతనతో, ప్రకృతితో మమేకమై ప్రకృతి, పరిసరాలను జీవితంతో సమన్వయం చేసుకుంటూ ముద్రాస్థితిలో అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తే పాఠకుడు హైకును సరియైన రీతిలో ఆస్వాదించగలడు, ఆనందించగలడు . ఒక హైకును పాఠకులు వివిధ రీతుల్లో తమ అనుభవంలోకి తీసుకొని విశ్లేషించుకుంటారు. ఆంగ్ల సాహితీ కారులు, విమర్శకులు కూడా చాలా వరకు తమదైన రీతిలో స్పందించారు. పై హైకుల వివరణలలో ప్రముఖ జపానీయ, ఆంగ్ల,విమర్శకుల ఆలోచనలు కూడా ఇమిడి వున్నాయి. హైకును అర్థం చేసుకోవాలన్న, అందుకోవాలన్న పాఠకుడు కూడా కవి మనోస్థాయిని అందుకోవాల్సి ఉంటుంది. హైకు కు సంబంధించిన అనేక విషయాలను ఇక్కడ ప్రస్తావించడం కుదరదు కనుక ఇది సమగ్రమైన వ్యాసం అని చెప్పను. ఒక విధంగా హైకును అర్థం చేసుకునే దిశగా హైకు ప్రక్రియకు సంబంధించిన విషయాలను ప్రస్తావించి కొంత సమాచారం అందించే ప్రయత్నం చేసాను .

★★★

'హైకూ'ల ప్రకృతి ప్రయాణం

డా. తన్నీరు సురేశ్
8790569436

విభిన్న ప్రక్రియలతో కొనసాగుతున్న తెలుగు సాహిత్యంలో 'హైకూ' కూడా ఒక సారవంతమైన సంక్షిప్త రూపం. 'హైకూ' జపాన్ దేశ కవిత్వం నుంచి తెలుగులోకి వచ్చింది. అయినా తెలుగులోనే స్వతంత్రంగా ఏర్పడ్డదా అన్నంతలా స్థిరపడింది. 'బషో'ను హైకూ కవితా పితామహునిగా పిలుస్తారు.

పెన్నా శివరామకృష్ణ 'రహస్యద్వారం' పేరుతో 1991 అక్టోబర్ లో హైకూ సంపుటి తెచ్చారు. తొలి హైకుల సంపుటి ఇదే. ఇందులో 5-7-5 నియమాన్ని అనుసరిస్తూ 130 హైకులున్నాయి. ఉదాహరణకు అందులో నుండి ఒకటి– " తలపై రవి / చుట్టూ నీడల పద్మం / నేనే కేసరం. తరువాత బి.వి.వి. ప్రసాద్ 1995 ఏప్రిల్లో 'దృశ్యాదృశ్యం' అనే సంపుటి తెచ్చారు. ఇందులో 120 హైకులున్నాయి. పాదాలు మూడున్నప్పటికి 5-7-5 నిర్మాణం లేదు. " చినుకు నగ్నంగా సిగ్గుపడి / విత్తనంలోంచి / పచ్చదనం కప్పుకొచ్చింది. ఇస్మాయిల్ 126 హైకులతో 1997జనవరిలో ' కప్పల నిశ్శబ్దం' అనే సంపుటి రాశారు. "తెల్లారు ఝాము రైలు / తూర్పు దిగంతాన్ని చీలుస్తుంది / అప్పుడు బైటపడతాడు సూర్యుడు". ఇలా గాలి నాసర రెడ్డి, బి.వి.వి. ప్రసాద్, ఇస్మాయిల్ గార్ల అడుగుజాడల్లో ఎందరో యువకులు హైకులు రాశారు ఇది ఒక మంచి కవితా రూపంగా తెలుగులో స్థిర పడింది.

తెలుగులో పెన్నా శివరామకృష్ణ, తలతోటి పృథ్విరాజ్, లంకా వెంకటేశ్వర్లు,రత్నమాల, రూప్ కుమార్, భగ్వాన్, రత్నమాల లాంటి చాలామంది హైకూ రూపంపట్ల అంకితమై రాసారు. ఇందులో తలతోటి , పెన్నా, రూప్ కుమార్, మాకినీడు సూర్య భాస్కర్ హైకులపై పరిశోధనాత్మకమైన కృషి సలిపారు. తలతోటి శాశ్వతంగా హైకూ క్లబ్ స్థాపించాడు.

హైకూ నిర్వచనం:

హైకును వివిధ కవులు, విమర్శకులు వివిధ రకాలుగా నిర్వచించారు. ముఖ్యమైనవి గమనిస్తే– " కవి ప్రకృతిలో తాదాత్మ్యం చెందినపుడు కలిగిన అనుభూతి వ్యక్తీకరించే సంక్షిప్త కవితల్ని హైకులంటారు"—ఇస్మాయిల్. హైకూ రూపాన్ని ప్రాకృతికతత్వాన్ని పట్టి ఇచ్చే నిర్వచనం ఇది. ఇస్మాయిల్ నిర్వచనంలోని ప్రకృతికి మానవ ప్రకృతిని కూడా జత చేస్తూ "ప్రకృతిలోని, మానవ ప్రకృతిలోని అతి సున్నితమైన ప్రకంపనలని పదచిత్రాలుగా ప్రదర్శించేది హైకూ"– అని బి.వి.వి. ప్రసాద్. నిర్వచించారు." హైకూ అంటే క్షణంలో యుగాన్ని దర్శించడం"– అద్దేపల్లి రామమోహనరావు. క్షణం కాలానికి సంబంధించిన కొలత. ఏ వస్తువైనా, దృశ్యమైనా, సంఘటన అయినా క్షణంలో దృష్టికి అందుతుంది. అలా అందినవి కవితాత్మక వ్యక్తీకరణ పొందినప్పుడు ఆయా దృశ్యాలు యుగంలో భాగమవుతాయి. ప్రతిదీ కాలంతో కలిసి పోయేవి. వీటికి మరే ఇతర ప్రత్యేక అస్తిత్వం ఉండదు. కానీ కవితగా మారినప్పుడు తరాలకు వ్యాపిస్తుంది. అలా మారిన, గడచిన దృశ్యం వస్తువు కాక యుగం తాలుకు భాగం అవుతుంది. పైగా పాఠకుని పరంగా క్షణంలో హైకుని చదవటం పూర్తి చేసి, అందులోని అనుభవాన్ని మాత్రం శాశ్వత అనుభూతిగా పట్టుకుంటాడు.

> హైకూ మూడు పాదాలతోనే సమస్త లోకవృత్తాన్ని ఆవరించగల త్రివిక్రమ పరాక్రమంగల ప్రక్రియ

"హైకూ మూడు పాదాలతోనే సమస్త లోకవృత్తాన్ని ఆవరించగల త్రివిక్రమ పరాక్రమంగల ప్రక్రియ."– కాత్యాయనీ విద్మహే. ఇందులో మొదటి భాగం రూపానికి, రెండవ రూపం వస్తువుకు ప్రాతినిధ్యం వహిస్తుంది. శ్రీ మహావిష్ణువు వామనావతారమైనా, అన్నిలోకాలను ఎలా వ్యాపిస్తాడో, హైకూ రూపం చిన్నదే అయినా ఏ వస్తువునైనా సమగ్రంగా ప్రదర్శించగలదు అని అర్థం. పైగా బలి చక్రవర్తి దగ్గరకు విష్ణువు వామన రూపంలో కాక మహారూపంలో వస్తే దానం ఇచ్చేవాడా ? అలాగే పరిమాణంలో పెద్దగా ఉంటే పాఠకుడు దాన్ని చదవడేమో కదా! అందుకే సూక్ష్మం ప్రతిసారి మేలైనది.

హైకూ నిర్మాణం:

హైకులో మూడు పాదాలుండాలి. పదిహేడు అక్షరాలుండాలి.

అవి మొదటి పాదంలో అయిదు, రెండవ పాదంలో ఏడు, మూడవ పాదంలో అయిదు (5-7-5) అక్షరాలుగా విభజితం కావాలి. హైకూ రచనలో స్థలం,కాలం,విషయాల సంయోజనం కనిపిస్తుంది. జెన్ బౌద్ధ తాత్విక భూమిక, ప్రాకృతిక ప్రేరణ, దృశ్యచిత్రణ, సజీవ పదచిత్రాలు అత్యంత ప్రాధాన్యం. ఇవన్ని కూడితేనే హైకూ శిల్పం రసవంతంగా ఉంటుంది. దీన్ని మరింత లోతుగా పరిశీలిద్దాం.

అప్పుడప్పుడే మాత్రాచందస్సు నుండి తెలుగు కవిత బయటకు వచ్చి వచన కవిత వెలువడింది.

జపాన్ హైకులో పదిహేడు 'ఒంజీ'లు ఉండాలి అనేది నియమం. దీనికి జెన్ బౌద్ధంతో సంబంధం ఉంది. జెన్ బౌద్ధంలో చైతన్యం పొందటానికి పట్టే కాలం 17 చిత్త క్షణాలని విశ్వాసం. అందుకే హైకులో 17 చైతన్యానికి ప్రతీకగా ఏర్పడింది. ఇదే తెలుగులో అక్షరాలుగా ప్రవర్తితమయింది. అయితే అక్షరాలు 'ఒంజీ'లకు సరైన సమతూకం కాదు. జపాన్ లో ఏకవర్ణ (Mono syllables) పదాలెక్కువ, తెలుగులో బహువర్ణ పదాలు(Poly syllables) ఎక్కువ. కనుక జపాన్ లో హైకూ రచనకి 17 ఓంజిలు సరిపోయాయి. కానీ తెలుగులో కాస్త ఇబ్బందిగా మారడం గమనించవచ్చు. ఒక రకంగా అక్షరాలు కాక మాత్రలు 'ఒంజీ'లకు సమానం అవుతాయి. ఎందుకంటే ఒక్కోసారి ఒక ఒంజీలో 3 అక్షరాల వరకు ఒదుగుతాయి. ఒంజీలకు అక్షరాల కన్నా మాత్రా విధానం సరిగ్గా సరిపోతుంది. ఉదాహరణకు 'మ్నే' అనేదానిలో అక్షరం 1 అదే మాత్రలు మాత్రం 3.మొదటే తెలుగులో మాత్రా విధానంలో హైకులు రాయబడితే బాగుండేది. అలాకాక అక్షర కొలమానమే స్థిరపడింది. అప్పుడప్పుడే మాత్రాచందస్సు నుండి తెలుగు కవిత బయటకు వచ్చి వచన కవిత వెలువడింది. తిరిగి తెలుగు కవిత్వాన్ని మాత్రాచంధస్సులోకి నడిపించడం ఇష్టం లేకపోవడం ఇందుకు ఒక కారణం అయి ఉండచ్చు.

17 అక్షరాల నియమాన్ని చాలామంది కవులు పాటించక, కేవలం మూడు పాదాల నియమాన్ని పాటించారు. తెలుగులోనేకాదు 17 నియమాన్ని జపాన్ కవిత్వంలోను వదిలేసి రాసిన హైకులు ఉన్నాయి. అంతేకాదు మూడుపాదాల నియమాన్ని వదిలేసి కూడా హైకులు రాసారు. 'New Trend School' వాళ్ళు నాలుగు పాదాలతో హైకూ రాసి దానికి 'Rectangular Form' అని

పేరుపెట్టారు. ఇలా ఇతర ధోరణులు కూడా హైకుల్లో వచ్చాయి.

మూడు పాదాలుండాలనేది హైకూ మరో నియమం. మూడు పాదాలనుచూసి మొదట హైకును ద్విపదను అనుసరించి త్రిపదులు అని కూడా పిలిచారు. అద్దేపల్లి రామమోహనరావు గారు అనుభూతి ఏదైనా అడుగు పెట్టడం, కొద్దికాలం నిలవడం, మళ్ళీ క్షణంలో ముగియడం అనేమూడు దశల్లో ఉంటుంది. అన్నారు. సాధారణంగా తెలుగుకు ద్విపదలు, చతుష్పాదులు పాత సంప్రదాయమే. మూడు పాదాల నియమం కొత్త అనుభూతి.

వేమన పద్యాల్లో చివరి మకుటం వదిలితే, హైకూల లోలాగే మిగిలేది మూడు పాదాలే.

వేమన పద్యాల్లో చివరి మకుటం వదిలితే, హైకూల లో లాగే మిగిలేది మూడు పాదాలే. కాబట్టి వేమన పద్యాలతో హైకు లను పోల్చడం ఆకర్షణీయంగా కనిపించవచ్చు. కానీ వేమన పద్యానికి హైకుకి చంధస్సులోనే కాదు వస్తు వ్యంజనలోను తేడా ఉంది. వేమన మూడు పాదాల్లో విభిన్న వస్తువుల కలయిక ఉంటుంది. మొదటి రెండు పాదాల్లో ఒక విషయం చెప్పి దానికి సమర్థకంగానో, నిదర్శనంగానో మరో వస్తువుతో పాదం చెప్తాడు. ఉదాహరణకు "అనువుగాని చోట అధికుల మనరాదు/ కొంచెముండుటెల్ల కొదువకాదు/ కొండ అద్దమందు కొంచెమై ఉండదా" ఇందులో మొదటి రెండు పాదాలు సందేశం. చివరిపాదం దానికి నిదర్శనం. వేమన పద్యాలన్నీదాదాపు ఇలాగే ఉంటాయి. హైకూలో అలాకాక ఒకేవిషయ ప్రస్తావన ఉంటుంది. విభిన్న వస్తువులను, దృశ్యాలను ఏక కాలంలో అందించదు. ఉదా: "కిటికీ సందుల్లోంచి/బుగ్గల్ని తడుముతూ/ వెన్నెలదొంగ/ " (రూప్ కుమార్– సంపెంగ లోలకం). దీని పట్ల అవగాహన లేని తెలుగు కవులు కొందరు మినీ కవితలాగా, నానీలలాగా, ఒకే హైకులో విభిన్న అంశాలను జోడించారు. అప్పుడు హైకూ రసస్ఫూర్తి సహజంగానే లోపిస్తుంది.

సంక్షిప్తత- సమర్థత:

కొందరు హైకులోని 17అక్షరాలు, మూడుపాదాలు అనే నియమం మరీ సంక్షిప్తమైనది. దీనివల్ల కవిత రాయలేమని, రాసినా శోభిల్లదని విమర్శించారు. అంటే కవిత్వం తాలుకు అనుభూతిని వ్యక్తం చేసేంత నిడివి లేదని వీరి ఆలోచన. హైకూ స్నాప్ షాట్ లాగా, స్టిల్ ఫోటోగ్రఫిలా ఉంటుంది. హైకూ విషయాన్ని

సమగ్రంగా అందించదు, ఒక్కోసారి ఏమి రాయబడిందో తెలియక కేవలం అక్షరాలుగానే మిగులుతుంది అని ఇలాంటివారి వాదన.

హైకూ ఊహకాదు ప్రత్యక్ష దృశ్యానికి సంకేతం. హైకూ ఆలోచన కాదు, భౌతిక అనుభవం.

నిజానికి హైకులోని సంక్షిప్తత ఇబ్బంది పెట్టేది ఎంతమాత్రం కాదు. చైనాలిపి చదవడం రాని తెలుగు అక్షరాస్యుడు చైనీస్ ఎలా చదవలేడో హైకూ చదవడం తెలియని వ్యక్తీ అంతే. హైకూ అనేది పూర్తిగా ఒక ప్రత్యేక కవితారూపం. దీన్ని నిబిడీకృతం చేసుకున్న కవికి అయినా, పాఠకుడికి అయినా ఇబ్బంది అనేది రాదు. అందుకే బి.వి.వి ప్రసాద్ "హైకులో కవి తక్కువ రాసినట్టు కనిపించి, దానినుంచి పాఠకుడు ఎక్కువ అనుభూతి పొందే అవకాశం ఇవ్వాలి" అంటాడు. ఇక్కడ కవి పాఠకుని తనకంటే ఉన్నతమైన కవిగా భావించాలి. హైకూ రాసే కవికి గల స్పృహ పాఠకునికి కూడా ఉండాలి. అలా ఉన్నప్పుడే హైకూ పాఠకుణ్ణి చేరుతుంది. ఇంకా చెప్పాలంటే పాఠకుడే హైకును చేరతాడు. ఇందులోని సంక్షిప్తత వస్తువు సూచ్యమూ, దృశ్యచిత్రణ మాత్రమే కాని, పూర్తి వర్ణనకాదు. ఈ సంక్షిప్తతపై బౌద్ధవిధానపు 'అన్వీక్షకీ' ప్రభావం ఉంది. వస్తు, భావ విశ్లేషణ హైకూ ఇవ్వదు. వస్తు, భావ దర్శనం మాత్రమే ఇస్తుంది. పాఠకుని అనుభూతికి బలాన్ని చేకూర్చే దృశ్యాన్ని ఇస్తుంది. తద్వారా విశాలమైన ఆలోచనా ప్రపంచానికి, అంతకు మించిన అనుభూతిసీమకు తీసుకు పోతుంది.

హైకూ రాసేప్పుడు హైకూకవి ఏ సన్నివేశాన్ని చూస్తాడో దాన్ని అతడు అనుభవించేలోపే హైకుగా రూపొందుతుంది. తక్షణ అనుభవమే హైకూ పరమపద సోపానం. మళ్ళీ పాఠకుడు హైకును చదివినప్పుడు అందులోని పదచిత్రం, స్థల, కాల, విషయాల ద్వారా ఆ సన్నివేశాన్ని పట్టుకొని తాను దాన్ని అనుభవిస్తాడు. హైకూ ఊహకాదు ప్రత్యక్ష దృశ్యానికి సంకేతం. హైకూ ఆలోచన కాదు, భౌతిక అనుభవం. హైకూ నిర్మాణం పాఠకుణ్ణి ఇబ్బంది పెట్టదు. హైకూ తెలియని కవి, హైకుల పేరిట రాసిన ఇంకేవో ఇబ్బంది పెడతాయి అంతే.

ప్రాకృతిక ప్రేరణ:

హైకూ రచనకు, ప్రాకృతిక ప్రేరణ నేపథ్యం ప్రధాన ఆధార భూమికగా నిలుస్తుంది. ప్రకృతి కవిత్వంలో ఈనాటి కవితా వస్తువు కాదు. ప్రకృతి

ఎప్పటినుంచో కవులకు అత్యంత ఆరాధనీయ వస్తువు. ప్రకృతి మనిషి భౌతిక, మానసిక అస్తిత్వానికి ఒక ఆధారం. ప్రకృతి అనంతమైనది మానవుడే కాక ప్రతి ప్రాణి ఇందులో పుట్టి ఇందులోనే మరణిస్తుంది. అయితే హైకులో ప్రకృతి కేవలం ఒక వస్తువుగా కనిపించదు. హైకూ పుట్టుకకే ప్రకృతి కారణంగా నిలుస్తుంది. హైకుకు ప్రకృతికి గల సంబంధం కవిత–వస్తువు బంధం కాదు. కవిత–ఆధార సంబంధం. మరోలా చెప్పాలంటే, హైకునే ప్రకృతి, ప్రకృతినే హైకూ. హైకూ ప్రకృతినుండి ప్రకృతి కొరకు ప్రకృతిగా ఉద్భవించే కవిత. హైకూకవి ప్రకృతిని చూసి తన అస్తిత్వాన్ని కోల్పోయి అందులో లీనమై హైకూ చెప్తాడు. చూసేంత వరకే అది ప్రకృతి. హైకుగా మారాక హైకూ దాన్నిరాసిన కవీ కూడా ప్రకృతిలో భాగాలే. రూసో చెప్పిన ప్రకృతిలోకి తిరిగి పోదాం (Go back to nature) సిద్ధాంతంలా ఉంటుంది హైకూ. "వెన్నెల్లో/ ఏటి పళ్లాన్ని/ మూతితో జరుపుతోంది గుర్రం" (సులోచానాలు). ఇలా ప్రకృతిలో జరిగే ప్రతి కదలిక హైకూగా మారుతుంది.

రాత్రిని, చంద్రుణ్ణి, నక్షత్రాలను, వర్షాన్ని వర్ణించని కవి ఉండడు. హైకుల్లో వీటికి ప్రాధాన్యత ఎక్కువ.

సూర్యుడు ప్రకృతిలో ఒక ఉత్తేజకరమైన అంశం సూర్యోదయాన్ని పెన్నా శివరామకృష్ణ "తెల్లవారింది/ చీకటి అనేక ఆకృతులుగా/ కత్తిరించబడింది". అంటాడు తెల్లవారిన తర్వాత నల్లని వస్తువులను చీకటిగా చూడటం ఇందులోని కవిసమయం. లంకా వెంకటేశ్వర్లు "ఈ ఉదయపు/ తొలికిరణం/ ఎక్కడ ముద్దాడిందో" అంటాడు. సూర్యుడు ఉద్యమానికి కుడా ప్రతీక. "కళ్ళు తెరుస్తూ/ పసిగుడ్డు/ తూర్పుదిక్కున (సంబోధి). ఇక్కడ రక్తం విప్లవానికి, కళ్ళు తెరవడం ఉద్యమానికి సంకేతం. మంచికి చెడుకు ఎవరి మొహాన్ని చూశానో అనుకోవడం మనిషి సహజంగా చేస్తుంటాడు. అందుకే ఒక హైకూ కవి "తెల్లవారింది / పిట్ట పాడింది/ ఇంకేం కావాలి" అంటూ ప్రకృతే తనకు మంచి శకునం అంటూ నిర్ధారిస్తాడు.

రాత్రిని, చంద్రుణ్ణి, నక్షత్రాలను, వర్షాన్ని వర్ణించని కవి ఉండడు. హైకుల్లో వీటికి ప్రాధాన్యత ఎక్కువ. "నీళ్ళ కుండలో/ కనిపిస్తూ జాబిలి/ నీళ్ళు అమృతం అంటాడు రూప్ కుమార్. హైకూ కవులు చందమామను వర్ణించిన తీరును చెప్తూ కాత్యాయనీ విద్మహే ఇలా అంటారు – " చందమామ

హైకూ కవులను మొహమాట పెట్టిన అంశాలలో ఒకటి. చందమామ చిటారు కొమ్మన వికసించిన పువ్వుగా అనిపిస్తుంది ప్రసాద్ కి. నిండు పున్నమి నాటి వెన్నెల తొణికిసలాటను ఇస్మాయిల్ కాలువ వెంబడే నడుస్తూ ఆకాశంలో చంద్రుడిని కాలువలో ప్రతిబింబించిన చంద్రుడిని వెంట తెచ్చుకొని మహాదానందాన్ని అనుభవిస్తాడాయన. మబ్బులు కప్పిన చంద్రుడిని మబ్బునురగ చాటు కనబడే అరిగిపోయిన సబ్బుబిళ్ళగాను, చందమామను చింతన శిరీష "కోద్దామని చెట్టెక్కి / అందక దిగాక / మళ్లీ అక్కడే చందమామ" అంటుంది."

> హైకూకవి ప్రకృతిని చూసి హైకూ రాయడు, అ ప్రకృతిలో తనూ ఒక భాగమై హైకూ చెబుతాడు.

రత్నమాల వెన్నెలను పూవులుగా భావించి "రాత్రి / ఆకుల సందుల్లో / వెన్నెల పువ్వులు" అని రాస్తుంది. "ఏదో రాసుంది / ఆకాశ పుస్తకంపై / చుక్కల లిపి"(నెలవంక) అని నక్షత్రాలను రాతలా ఊహిస్తాడు మరో హైకూ కవి. "ఎండలో వాన / ముత్యాల తలంబ్రాలు / భూదేవికి" (చంద్రకిరీటి) "వర్షం వచ్చి / రంగుల వంతెనేసింది / నింగికి నేలకు" (వసంతం). ఇలా ప్రతి కవి ప్రకృతిని హైకులుగా మార్చిన విధానాలు మనల్ని ఆశ్చర్య పరుస్తాయి.

అయితే రానురాను తెలుగు కవులు ప్రకృతిని హైకుకి ఆధారంగా కాక కేవలం వస్తువుగా మాత్రమే చూసారు. ఆ సందర్భంలో ఒక వైపు సమాజం, సాహిత్యం, అభ్యుదయం, మానవ కోణం వంటి సమస్యలను ఎదుర్కుంటూ ఉంటే, హైకూ కేవలం పూలు తూనీగలు, చంద్రుడు వంటి వాటికే పరిమితమై గుహలో తపస్సు చేసే సన్యాసిలా తయారైందనే విమర్శలకు గురైంది.

హైకూకవి ప్రకృతిని చూసి హైకూ రాయడు, అ ప్రకృతిలో తనూ ఒక భాగమై హైకూ చెబుతాడు. చూసేంతవరకు మాత్రమే అది ప్రకృతి కాగా, హైకూ రాసాక హైకూ మరియు దానిని రాసిన కవి కూడా ప్రకృతిలో భాగాలే. ప్రకృతి నేపథ్యం హైకూకి ప్రధాన హేతువుగా ఉన్నప్పటికి, తెలుగులో ఇది క్రమక్రమంగా తప్పనిసరి స్థితి నుంచి తప్పుకుంది. అంటే ఇతర సామాజిక అంశాల స్వీకరణ కూడా కనిపిస్తుంది. సామాజికాంశాల స్వీకరణ అనేది జపాన్ హైకుల్లోను కనిపిస్తుంది. వాటిని సెన్ ర్యూ లని పిలిచారు. తెలుగులో తలతోటి పృథ్వీరాజ్ సెన్ ర్యూలు రాసారు. హైకూ జాతీయ సదస్సు నుండి తలతోటి పృథ్వీరాజ్ హైకుల్లో సామాజికతను వదిలేయడమే సబబు అని చెప్పడం గమనించతగింది.

దాని ఉద్దేశ్యం హైకూమూలమైన ప్రాకృతిక ప్రేరణ మరవద్దన్నది ఆయన సూచన.

ప్రకృతి సిద్ధాంతమే హైకూ జెన్ బౌద్ధ తాత్వికత: బౌద్ధ మతం ప్రకృతికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. ఉన్నది ఉన్నట్టు స్వీకరించాలి అనేది బౌద్ధం ప్రధాన . సిద్ధాంతం ఇదే సిద్ధాంతం హైకూపై ప్రభావం చూపింది. హైకూ పుట్టుకకి కారణం జెన్ బౌద్ధం. 'జెన్' అంటే సంస్కృతంలో ధ్యానం అని అర్థం. బౌద్ధంలో ధ్యానం ద్వారా ఆరాధించడం ఒక శాఖగా ఉండేది. భారతదేశంలోని ఈ శాఖకు చెందిన బోధిధర్ముడు వివిధ దేశాలను తిరిగి ఈ విధానాన్ని ప్రచారం చేశాడు. బోధిధర్ముడు చైనాకు వెళ్లి బౌద్ధాన్ని వ్యాప్తి చేసినప్పుడు అక్కడ అది 'చాన్ బౌద్ధం'గా జపాన్ లో జెన్ బౌద్ధంగా పేరు గాంచింది. కనుక హైకూ మూలం భారత దేశమూ, ఇక్కడి సంస్కృతి వారసత్వ భూమిక కూడా.

బౌద్ధం కర్మకు ప్రాధాన్యత ఇస్తుంది. కర్మద్వారా వచ్చిందే ప్రస్తుత ఉనికి అంటుంది.

బౌద్ధం కర్మకు ప్రాధాన్యత ఇస్తుంది. కర్మద్వారా వచ్చిందే ప్రస్తుత ఉనికి అంటుంది. ఆడంబరమైన పూజలకు, ప్రదర్శనాలంకారాలకు ఇది విరుద్ధం. పరిశీలన, విషయ విశ్లేషణ, జ్ఞాన సముపార్జన దిశలో జీవి పయనించాలని బౌద్ధం చెప్తుంది. బౌద్ధం సమాజాన్ని విడిచి ఎక్కడికో దూరంగా వెళ్ళమని చెప్పదు. తన చుట్టూ ఉన్న సమాజంలో ఉంటూనే జ్ఞానం అనే వాస్తవాలను తెలుసుకోమంటుంది. అందుకే బుద్ధుడు 'సంఘం శరణం గచ్ఛామి' అన్నాడు. అన్నింటికి సమాజమే తుది సమాధానం. ఇందుకు ధ్యానాన్ని అనుసరించాలి. ధ్యానం అంటే కళ్ళు మూసుకొని మననం చేయడం కాదని చెప్తూ లంకా వెంకటేశ్వర్లు అంటాడు – "నిత్యం జీవన సారం గ్రోలుతూనే మనచుట్టూ ఉన్న ప్రకృతిలోని సున్నితాంశాలను అందుకొని, కౌగిలిలోకి తీసుకోవడం తనని తను రద్దు చేసుకొని ప్రకృతిలో లీనం కావడం తద్వారా విషయము, విషయి అనే ప్రత్యేక అస్తిత్వం లేని అద్వైత స్థితిని పొందటమే ధ్యానము. "తన కఫనును / తానే అల్లుకుంటుంది / ఏకాకి నిప్పుకణిక.(పెన్నా శివ రామకృష్ణ– సులోచానాలు) జెన్ తత్వానికి సంబంధించి మాకినీడు సూర్యభాస్కర్ గారు

"హైకూ కవిత్వం అనుశీలన, ఒక అవగాహన" అనే గ్రంథంలో లోతైన పరిశీలన చేశారు.

ప్రకృతి దృశ్యమే హైకూ చిత్రణ : హైకూ నిర్మాణం దృశ్యంతో ముడిపడి ఉంటుంది. ఊహకన్నా దృశ్యానికి, ఆలోచన కల్పనకన్నా సన్నివేశ స్పందనకు, వర్ణనకన్నా విషయ ప్రతిపాదనకు హైకూ ప్రాధాన్యతనిస్తుంది. భౌతిక ఉనికి పరిశీలన నుంచి ప్రారంభమయ్యే పదచిత్రం హైకూ. ఏ దృశ్యం చూసాడో కవి దానినుంచి, దానివరకే పరిమితమయ్యే అభివ్యక్తి హైకూ. "ఇలా వచ్చి అలా వెళ్ళింది / సీతాకోక చిలుక / గదిలోని శూన్యాన్ని తెలిపి." (సులోచానాలు – పెన్నా శివరామకృష్ణ) ఇక్కడ సీతాకోక చిలుక వచ్చివెళ్ళడం ఒకటే దృశ్యం. కానీ దానినుంచే ఒంటరితనం ఆలోచన స్ఫురిస్తుంది.

హైకూ రచనలో స్థలం, కాలం, విషయం అనేవి ప్రాధాన్యత వహిస్తాయి. ఇవి ప్రకృతిలో భాగాలు.

ప్రకృతిలో భాగాలే స్థలం, కాలం, విషయం:

హైకూ రచనలో స్థలం, కాలం, విషయం అనేవి ప్రాధాన్యత వహిస్తాయి. ఇవి ప్రకృతిలో భాగాలు. జాగ్రత్తగా గమనిస్తే ఇవి ప్రకృతి ప్రకారమే నడుస్తాయి కానీ మనిషి వీటిని నియంత్రించలేడు. ప్రకృతి ముందు మనిషి తలవంచి దానితో అనుగుణంగా కలిసి పోవలసిందే తప్ప నియంత్రణ ఒక పిచ్చి కోరిక అవుతుంది. స్థలం, కాలం, విషయం మూడింటి సమ్మేళనంతో హైకూ రూపొందుతుంది. మనిషి ఎక్కడ ఉన్నాడు అనేదే స్థలం, ఎప్పుడు అనేదానికి సమాధానమే కాలం. ఏం చేస్తున్నాడో అదే విషయం. కాబట్టి వీటికి ఎక్కువ పరిశ్రమ అవసరం లేదు. "బట్టలదండెం / ఇంట్లో వెలిసింది / ముసురు (చంద్రకిరిటి). ఇందులో స్థలం ఇల్లు, కాలం వర్షాకాలం, విషయం బట్టలదండెం. కాలం కొన్ని ఋతువులుగా కనిపిస్తుంది. కొన్ని ప్రతీకలతో కూడా కాలాన్ని సూచిస్తారు హైకూ కవులు. ఉదాహరణకు మంచు రేఖులు, మంచు ప్రదేశాలు – వసంతం, ఎర్రని తూనీగ – గ్రీష్మం, సీతాకోక చిలుక – శిశిరం, ఎండుకొమ్మ మరియు మిడత – శరత్తు, చార్ కోల్, చలిమంట – వర్షం పొగమంచు – హేమంతం. అవే ప్రతీకలు వాడితే

కొత్తదనం ఉండదు కదా అనే అనుమానం అక్కర్లేదు; ప్రయోగ వైవిధ్యంతో దాన్ని తొలగించవచ్చు. అలాగే కాలాన్ని సూచించే పదాలను జపాన్ లో 'కిగో'లంటారు. స్థలం, కాలం, విషయాల సంయోజనంలో హైకు అందంగా మలచ బడుతుందని చేకూరి రామారావు అభిప్రాయ పడ్డారు. (వాఙ్మయి పత్రిక 2001)

ప్రకృతిని అర్థం చేసుకొని దానితో మనుగడ సాగిస్తే మనిషి ఆరోగ్యంగా సంతోషంగా ఉంటాడు. నిర్లక్ష్యం వహిస్తే జీవ హీనమై పోతాడు.

ప్రకృతిలోని ప్రతి దృశ్యం, ప్రతి కదలిక ఒక్కో హైకూగా ప్రతిఫలించింది; పాఠకులను పరవశింప జేసింది. "చంద్రకొలను / పున్నమి వెలుగులో / లేడి విహారం" (సంభోది–యిమ్మిడిశెట్టి చక్రపాణి). ఇలాంటి హైకూలెన్నో తీయని ఆహ్లాదాన్ని తెలుగు వారి హృదయాలకు గుర్తు చేసాయి. అందుకే హైకూ అనేది తెలుగు లఘుకవిత్వానికే కాదు సాహితీ లోకానికే ఒక కొత్త అనుభవాన్ని నేర్పింది. పదచిత్రాల అల్లికలోను, సునిశిత పరిశీలనలోను, ప్రకృతి ఆరాధనలోను, తాత్విక స్పృహలోను కవులకు కొత్త దృష్టికోణం ఇవ్వగలిగింది. ఇటు పాఠకులకు హైకూ సూక్ష్మరూపంలో ఉన్నత భావజాలాన్ని అందించడంలో పూర్తిగా సఫలీకృతం అయ్యింది. ప్రకృతి ఎంత స్వచమైనదో హైకూ అంతే నిర్మల మైనది. ప్రకృతిని అర్థం చేసుకొని దానితో మనుగడ సాగిస్తే మనిషి ఆరోగ్యంగా సంతోషంగా ఉంటాడు. నిర్లక్ష్యం వహిస్తే జీవ హీనమై పోతాడు. అలాగే హైకూ కవి మరియు పాఠకుడు హైకూని సరిగ్గా పట్టుకోగలిగితేనే అందులో సార్థకత సాధిస్తాడు లేకపోతే కేవలం మూడు పాదాల పఠనమై మిగిలి పోతాడు

(ప్రస్తావిత హైకూ ఉదాహరణలు వివిధ హైకూ సంపుటాల నుండి తీసుకున్నవి. ఇవన్నీ వ్యాసకర్త హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయానికి సమర్పించిన ఆధునిక తెలుగు లఘు కవిత్వం నిర్మాణం, వస్తువు పరిశోధన సిద్ధాంత గ్రంథంలోనివి)

★★★

ఉపయుక్త గ్రంథాలు

1. కాత్యాయనీ విద్మహే– హైకూ తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగం, వాఙ్మయి 2001 అక్టోబర్ (పత్రిక)
2. కిరణ్– హైకూ కవులు ప్రకృతిని అనుసరిస్తున్నారా ?, వార్త 2001 నవంబర్ 4 (పత్రిక)
3. వెంకటేశ్వర్లు లంకా– హైకూ ప్రస్థానం, హైకూ సాహిత్య మాసపత్రిక 2003 సెప్టెంబర్ (పత్రిక)
4. రూప్ కుమార్ డబ్బీకార్– హైకూ సారస్వతం, స్వీయ ప్రచురణలు హైదరాబాద్ , 2003
5. శివరామ కృష్ణ పెన్నా – చినుకుల చిత్రాలు, 2000 స్వీయప్రచురణలు, హైదరాబాద్
6. సూర్య భాస్కర్ మాకినీడు– హైకూ కవిత్వం ఒక అనుశీలన, 1999 సౌమ్య పబ్లికేషన్స్ కాకినాడ

" నా తెనుగు భాష శాస్త్రీయం, తాటాబూటం కాదు. నా తెనుగుభాష యుగయుగాలుగా ప్రవాహినిగా వుండినదిగాని, యివాళ ఆ భాషలోంచి వొక మాటా, యీ భాషలోంచి ఒక మాటా యెరువు తెచ్చుకుని భారతవిద్య ప్రదర్శిస్తున్నది కాదు. నా తెనుగు సరస్వతికే తేనె చినుకు లందించిందిగాని నిరుచప్పనిది కాదు. నా తెనుగుభాష స్వతంత్రంగా బతగ్గలిగిందిగాని కృత్రిమ సాధనాలతో ప్రాణవాయువు కూర్చుకోవలసిందికాదు. అక్రమ దోహదాలతో పోషించ బడవలసిందికాదు".

– శ్రీపాద సుబ్రహ్మణ్య శాస్త్రి

నిశ్శబ్దంగా ప్రవహించే ప్రార్థనే హైకూ

శ్రీ బివివి ప్రసాద్
90320 75415

సామ్రాజ్యాలను జయించినా, కీర్తి విస్తరిల్లినా
చిరుగాలికి పచ్చగడ్డిపై ఊగే
బంగారపు ఎండను చూసి మౌనంలో పడకపోతే
జీవితపు విలువలు తెలియవు
(ఆరాధన, కవితా సంపుటి)

1987 లో ఈ మాటలు రాసుకొనేనాటికి హైకూ అనే ఒక ప్రక్రియ ఉందని తెలీదు. ఒక నిర్మల ప్రాకృతిక దృశ్యం మనకి నిశ్శబ్దానుభవాన్ని ఇస్తుందని, ఆ అనుభవం జీవనసారానికి అతి సమీప వస్తువని స్ఫురించిన వేళ రాసుకున్న ఈ పదాలు, వేరొక దేశంలో, కాలంలో ఒక జీవన విధానాన్ని నిర్మించాయని తెలియదు, సంజీవదేవ్ గారి జపనీయ కళల గురించిన వ్యాసంలో హైకూ గురించి 94లో చదివే వరకూ.

1994 లో ఆ నిశ్శబ్దానుభవాన్ని తేలికైన పదాలలోకి, పదచిత్రాల లోకి తీసుకువచ్చే సాధన మొదలుపెట్టాక, 1999లో మూడవ సంపుటి హైకూలు రాసేనాటికి, హైకూ అటు నా అభివ్యక్తినే కాకుండా, ఇటు నా చూపుని కూడా శుభ్రం చేయటం గమనించాను. కనబడే దృశ్యమూ, చూసే నేనూ కూడా శుభ్రపడుతున్న, తేలికపడుతున్న, కాంతివంతమౌతున్న అనుభవం లీలగా తాకింది. హైకూ రాయటమంటే క్షణంలో, తేలికగా ధ్యానంలోకి మాయం కావటమని అర్థమయింది.

బయటి ప్రపంచంలో ఏం జరిగిందో, జరుగుతుందో, జరగనుందో తెలియటం ఎంత అవసరమో అవగాహన లేదు కానీ, మన లోపలికి మనం

హైకూ రాసే కవిత కాదు, రాసుకొనే కవిత. తన అనుభవాన్ని తానే రికార్డు చేసుకొనే సెల్ఫీ.

పరిశీలించుకొన్నపుడు, మన అనుభవాన్ని మనం శుభ్రం చేసుకొంటున్నపుడు, సాంద్రతరం చేసుకొంటున్నపుడు, మన అనుభవం లోతుల్లోకి మునుగుతున్నపుడు మనం ఏమిటో, ఎందుకున్నామో, ఏం చేయాలో మన లోపల ఎక్కడో మనకి తడుతుంది.

కావలసింది మన జీవితం పై మనకి వల్లమాలిన గౌరవం, శ్రద్ధ; మన సారంలో మనకి ఏది తెలుస్తుందో, తాకుతుందో అదే సమస్త జీవాలకీ, సమస్త జీవితానికీ మూలమనే విశ్వాసం, ప్రేమ, అనుకంపన.

ఈ పరమ స్వచ్ఛమైన మానసిక స్థితినే ఒకానొక కాలంలో, ఒకానొక దేశంలో కొందరు సాధువులు సాధించారు, లేదా సాధించే యత్నం చేశారు. వారికి సాధనలో ఉపకరణగా తోచినదే హైకూ ప్రక్రియ అని నమ్ముతున్నాను.

ఈ ప్రక్రియ పుట్టడం వెనుకనున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక నేపథ్యాల గురించి ఆసక్తి గానీ, అవగాహన కానీ లేవు. కానీ ఇది బషో అనే ఒక యోగిలో ఎందుకు, ఎలా పుట్టి ఉంటుందో ఒక అవగాహన ఉంది.

మానవ ఉద్వేగాలలోని, సంబంధాలలోని, ప్రాధాన్యతలలోని నశ్వరత్వాన్నీ , అర్థహీనతనూ, తెలివితక్కువతనాన్నీ గ్రహించిన ఒక సాధువు జీవనసారాన్ని వెదకబోయే క్రమంలోనే, మనసు అణిగే నిశ్శబ్దానుభవాన్నీ, అది అణిగినప్పుడు కలిగే శాంతినీ, అనుకంపననీ, సమగ్రతనీ, వాటికి ప్రేరకంగా నిలిచే అమాయకమైన ప్రాకృతిక చలనాలనీ, సన్నిధినీ తనలాంటి మిత్రుల కోసం మాటలుగా దిద్దబోయినపుడు హైకూ పుట్టిందని అనిపిస్తుంది.

హైకూ రాసే కవిత కాదు, రాసుకొనే కవిత. తన అనుభవాన్ని తానే రికార్డు చేసుకొనే సెల్ఫీ. హైకూ రాయటం అంటే తనని తానే అద్దంలో చూసుకోవటం, తనని తానే ప్రేమించుకోవటం, తనని తానే నింపుకోవటం, తన చుట్టూ ఉన్న ప్రపంచమంతా తానేనని తెలివి తెచ్చుకోవటం, ఇంత జీవితంగా కనిపిస్తున్న తనలోకి తాను మేలుకోవటం.

కనక, హైకూ రాయటానికి ఎవరూ, ఎపుడూ ప్రయత్నించరు. ప్రయత్నించి రాసేవి మరేమైనా కావచ్చు, హైకూలు కావు. హైకూ రావటానికి తమని వాహికగా చేసుకోగలిగిన వారి ద్వారా హైకూలు వస్తాయి. హైకూకి తమని నిశ్శేషంగా, నిశ్శబ్దంగా సమర్పించుకోగలిగిన, అతి పలుచని అహంకారం మాత్రమే మిగిలిన పసిమనస్కుల నుండి మాత్రమే హైకూలు ఈ లోకంలోకి ప్రవేశిస్తాయి.

ఏ ప్రకృతి నుండి తన భౌతిక ఉనికి ఏర్పడిందో, ఆ ప్రకృతిలోనే తమ విముక్తి మార్గం కూడా ఉందని గ్రహించారు.

పూర్వమెపుడో రాసుకొన్నట్టు హైకూ రాయటం తేలిక, హైకూ కవి కావటమే కష్టం. తనని వదులుకోవటం కష్టం, తనని ఖాళీ చేసుకోవటం కష్టం, తాను లేకుండా పోవటం కష్టం.

ప్రపంచంలో ఏ కాలపు, ఏ దేశపు, ఏ విశ్వాసాలకు, అలవాట్లకు చెందిన వారైనా జీవితం దుఃఖమయమని స్పష్టంగా గ్రహించి, దుఃఖమూలమైన అహంకారం నుండి, అహంకార ప్రేరకమైన దృశ్యం నుండి తమని విముక్తం చేసుకోవాలని యత్నించిన ఏ సాధువులైనా, వివేకులైనా, జ్ఞానులైనా ఏ ప్రకృతి నుండి తన భౌతిక ఉనికి ఏర్పడిందో, ఆ ప్రకృతిలోనే తమ విముక్తి మార్గం కూడా ఉందని గ్రహించారు.

అలాంటి పరమ నిర్మలుల స్వరమే హైకూలో మెత్తగా, కానీ, దృఢంగా, లీలగా, కానీ, స్పష్టంగా పలికింది. ఇక ముందూ పలుకుతుంది.

హైకూ వినోదం కాదు. సందేశం కాదు. కవిత్వం కాదు. తేలికైన అక్షరాలలోకి, సరళమైన పదచిత్రాలలోకి చల్లగా, నిశ్శబ్దంగా ప్రవహించే ప్రార్థన, ధ్యానం, కాంతి.

'పూలు రాలాయి ' హైకూ సంపుటి నుండి కింద ఇచ్చిన కొన్ని హైకూలు నా వ్యాసంలోని కొన్ని అంశాలకు ఉదాహరణలుగా చూడవచ్చు.

రా సీతాకోకా..
నా గదిలో ఒకసారి
ఎగిరి వెళ్ళు

పూవు వికసిస్తోంది
ఇంకా సున్నితమైన
శూన్యంలోకి

వెన్నెల రాత్రి
మిత్రునికి పంపాలనిపించింది
ఒక తెల్లని కాగితం

కదలని నీటిలో
గురి తప్పకుండా
కప్ప తనలోకి దుమికింది!

చిన్నారి పూవులారా
నిద్రవస్తోంది
కలలోకి వస్తారా..

కలలోంచి వచ్చేసాను
అక్కడివారు
దు:ఖిస్తున్నారా..

వాన వెలిసింది
రాలినపూలు తేలుతున్నాయి
చెట్ల ప్రతిబింబాలమీద

ధన్యోస్మి

ఏప్రిల్ - జూన్ 2025 సంచికలో ప్రచురణ కోసం మంచి వ్యాసాలు రాసి పంపిన వ్యాసకర్తలకి శతకోటి నమస్సులు. ఈ సంచిక వెలువరించడంలో ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ సహకరించిన వారందరో, వారందరికీ వందనములు.

ఈ సంచికలో ప్రచురణకి వ్యాసాలు రాసిన రచయితలకి ధన్యవాదాలు. హైకూ ప్రక్రియ పై వ్యాసాలు సేకరించడంలో సహకరించిన ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికి, ఆచార్య ఎస్. రఘు గారికి ధన్యవాదాలు.

ప్రచురణ కోసం కథలు, కవితలు, పరిశోధనా వ్యాసాలు పంపమని రచయితలను కోరుతున్నాము.

ఎప్పటిలాగే పాఠకులు ఈ సంచిక ను కూడా చదివి ఆనందిస్తారని ఆశిస్తాను.

చదవండి, చదివించండి.

భవదీయుడు

ఆచార్య కొవ్వలి గోపాలకృష్ణ

ప్రధాన సంపాదకులు

ISSN 2766-0168
అంతర్జాల త్రైమాస పత్రిక
వ్యవస్థాపక సంపాదకులు
కీ.శే. గురజాడ వేంకట అప్పారావు
www.prakasika.org

ప్రకాశిక

సమగ్ర సాహిత్య, సామాజిక పత్రిక
సంపుటి 5 | సంచిక 2 ఏప్రిల్-జూన్ 2025

మమత-సమత-మానవత
www.gurajada.org

పితృస్మరణ

- శ్రీ గురజాడ వెంకట రామదాసు

వన్నెకెక్కిన కవులు ముఫ్ఫరు
నన్నయాదులు వెలుగు దివ్వెలు
వారి దారిని వీడ రాదని
వ్రాసినా రన్యుల్.

కాలగతిలో క్రొత్త రీతిని
కాంచనేరక పాత ఛందమె
అందమనియెడు వెర్రి భ్రాంతుల
నాంధ్రకవు లుండన్-

భావ విప్లవ మొకటి దెచ్చితి
నవ్యతకు భవ్యతను గూర్చితి
తెలుగు కవితల తీగలల్లితి
వెల్లరకు తొలిగా.

క్రొత్త పాతల మేళవించుకు
మత్తు డుల్చెడి క్రొత్త త్రోవల
కెక్కి జాతికి తెలియ జెప్పితి
వెక్కుడగు విద్యల్.

ముద్దు లొలికెడు ముత్తె సరులను
మురువు గూర్చెడు మంచి కతలను
నాటకమ్ముల మణికిరీటము
నగలు భారతికిన్